

అధికారిక పంట కొనుగోలు పూర్తి

ఆయా కేంద్రాల్లో ఆగిన వేలం.. కొన్నిచోట్ల చూర విక్రయాలు

రైతుల వద్ద ఇంకా సుమారు 45 మిలియన్ కిలోల ఉత్పత్తి

జాప్యం జరిగితే నష్టపోతామని ఆందోళన

హాట్‌హాట్‌గా సాగుతున్న పొగాకు మార్కెట్‌కు బ్రేకులు పడ్డాయి. అయితే పొగాకును కొనే వ్యాపారులు లేరనో, ధరలు సరిగా లేవనో, రైతులు ఆందోళనలు చేయడం వలనో, గోడౌన్లు లేవనో కాదు. అధిక పంట ఉత్పత్తిపై అపరాధ రుసుం విషయాన్ని కేంద్రం ఎటూ తేల్చకపోవడమే అందుకు కారణం. దీంతో మార్కెట్‌లో కొనుగోళ్లకు ఆటంకం ఏర్పడింది. ఇప్పటికే అత్యధిక కేంద్రాల్లో అధికారిక పంట కొనుగోలు పూర్తయ్యింది. అలాంటి చోట్ల కేంద్రం ప్రభుత్వం నుంచి అనుమతులు రాక, అధికోత్పత్తి కొనుగోలు చేసే అవకాశం లేక వేలాన్ని బోర్డు అధికారులు నిలిపేశారు. కొన్నింటిలో చూర కొనుగోలు చేయిస్తున్నా రెండురోజులు పోతే అవి కూడా పూర్తవుతాయి. అలాగే ప్రస్తుతం అనుమతికి లోబడి ఉన్న పంటకు మూడు, నాలుగు కేంద్రాల్లో వేలం జరుగుతున్నా ఈ వారంలో అక్కడా కొనుగోళ్లు పూర్తికానున్నాయి. ఆ తర్వాత అక్కడా వేలం ఆగిపోతుంది.



పొగాకు అధికోత్పత్తి కొనుగోలుపై సందిగ్ధం

ఎటూ తేల్చని కేంద్ర ప్రభుత్వం

ఒంగోలు, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఇతర పంటలకు భిన్నంగా పొగాకు సాగు, విక్రయాలు ఇతరత్రా అన్నింటిపైనా ప్రభుత్వ నియంత్రణ ఉంటుంది. కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ పరిధిలోని భారత పొగాకు బోర్డు పర్యవేక్షణలో ఈ ప్రక్రియ అంతా సాగుతుంటుంది. ఏటా ఎంత విస్తీర్ణంలో సాగు చేయాలి, బ్యారన్‌కు ఎంతమేర ఉత్పత్తి చేయాలన్నది పొగాకు బోర్డు నిర్ణయిస్తుంది. అలాగే రైతులు కూడా బ్యారన్లకు లైసెన్సులు పొంది తదనుగుణంగానే సాగు చేయాలి. పొగాకు బోర్డు అనుమతి లేకుండా సాగు చేసినా, అనుమతి ఇచ్చిన దానికన్నా పంట అధికంగా ఉత్పత్తి అయినా, దానిని కొనుగోలు చేయాలంటే రైతులపై బోర్డు అపరాధ రుసుం వసూలు చేస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) నిబంధన ప్రకారం దేశంలో పొగాకు ఉత్పత్తి తగ్గింపు చర్యలలో భాగంగా కేంద్రం ఇలాంటి షరతులు అమలు చేస్తోంది. కాగా కొన్నిసందర్భాలలో బోర్డు ఇచ్చిన అనుమతి కన్నా తక్కువగా, మరికొన్ని సీజన్లలో ఎక్కువగా పంట ఉత్పత్తి జరుగుతుంటుంది. వాతావరణంలో మార్పులతో కూడా అలా జరగవచ్చు.

పదిశాతం దాటితే అపరాధం వసూలు

అనుమతించిన పరిమాణం కన్నా పదిశాతం అధికంగా ఉత్పత్తి జరిగితే అందులో పదిశాతం వరకు వాతావరణంలో మార్పుగా భావించి కొనుగోళ్లకు అనుమతిస్తారు. అంతకు మించితే అపరాధ రుసుం వేస్తారు. గతంలో అలా అధికంగా ఉత్పత్తి అయిన పంటకు దాని ధరలో 15శాతం అలాగే కిలోకు రెండు రూపాయల వంతున అపరాధ రుసుం వసూలు చేసేవారు. ఏటేటికి ఆ ఏడు పొగాకు బోర్డు ఇందుకోసం కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ నుంచి అనుమతులు తీసుకోవాలి. అంత శాతం అపరాధ రుసుంతో నష్టపోతామన్న రైతుల ఆవేదనను పరిగణనలోకి తీసుకొని దానిని 15 నుంచి 10 శాతానికి కొన్నేళ్ల క్రితం తగ్గించారు. ఇదిలా ఉండగా గత రెండు, మూడు సీజన్‌లుగా కర్ణాటకలో అనుమతించిన దానిలో 60 నుంచి 70శాతం మాత్రమే పంట ఉత్పత్తి జరుగుతుండటంతో పెట్టుబడులు కూడా రావడం లేదని అక్కడ గగ్గోలు పెట్టడంతో వరుసగా రెండు సీజన్లు అక్కడ అపరాధ రుసుంను కేంద్రం రద్దు చేసింది.

కర్ణాటక మాదిరిగానే...

కర్ణాటక తరహాలో తమకు కూడా మినహాయింపు ఇవ్వాలని ఆంధ్ర రైతులు కోరగా గతేడాది ఇక్కడ కూడా అపరాధ రుసుంను రద్దుచేశారు. అయితే ఈ ఏడాది భారీగా రాష్ట్రంలో పంట ఉత్పత్తి పెరిగింది. సాధారణ ఎన్నికల నేపథ్యంలో అపరాధ రుసుంపై కేంద్రం ఇంత వరకు స్పష్టత ఇవ్వలేదు. దక్షిణాదిలోని రెండు రీజియన్లలో 11 వేలం కేంద్రాలు ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు జిల్లాలో ఉండగా ఆ పరిధిలో 2023-24 సీజన్‌కు పొగాకు బోర్డు సుమారు 57వేల హెక్టార్ల విస్తీర్ణంలో పంట సాగుకు, 86.62 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి అనుమతి ఇచ్చింది. అయితే గత రెండేళ్ల మార్కెట్ ఆశాజనకంగా ఉండటం, కర్ణాటకలో ఉత్పత్తి తగ్గడం, ఇక్కడ వాతావరణం అనుకూలత వంటి అంశాలతో దక్షిణాదిలో రైతులు భారీగా పొగాకు సాగు చేశారు. సుమారు 72వేల హెక్టార్లపైగా విస్తీర్ణంలో పంట సాగు కాగా ఇంచుమించు 134 మిలియన్ కిలోలు అధికంగా ఉత్పత్తి జరిగినట్లు అంచనా. ఈ ఏడాది ఫిబ్రవరి 29న కొన్ని, మార్చి 6న మిగిలిన కేంద్రాలలో వేలం ప్రారంభించగా ఇప్పటివరకు సుమారు 89 మిలియన్ల కొనుగోళ్లు జరగ్గా సగటున కిలోకు రూ.254కు పైగా ధర లభించింది. ఆ విషయం అలా ఉంచితే ఇప్పటికే ఒంగోలు-1, 2, కందుకూరు-1, 2 , కలిగిరి, డీసీపల్లి, కనిగిరి కేంద్రాల్లో అధికారిక పంట కొనుగోళ్లు పూర్తయ్యాయి. వెల్లంపల్లిలో రేపటితో ముగియనుండగా మిగిలిన టంగుటూరు, కొండపి పొదిలిలోనూ ఈ వారంలో పూర్తి కానున్నాయి.


కోల్డ్ స్టోరేజీలో ఉంచిన పొగాకు బేళ్లు

ఆలస్యమయ్యే కొద్దీ తూకంతోపాటు నాణ్యత తగ్గుముఖం

దక్షిణాదిలో దాదాపు 48 మిలియన్ కిలోలు అధికంగా పంట ఉత్పత్తికాగా కేంద్రం దాని కొనుగోలు విషయంలో అపరాధ రుసుం రద్దు చేయడమా లేక కొంత వసూలు చేయడమా అన్నది స్పష్టత ఇవ్వలేదు. ఈవిషయంపై తగు సూచనలు కోరుతూ బోర్డు అధికారులు చాలా ముందుగానే కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖకు రాతపూర్వకంగా సంప్రదించారు. బోర్డు పాలక మండలి బాధ్యులు, పలువురు రైతులు కూడా ఇటీవల ఆ శాఖ మంత్రి పియూష్‌గోయల్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ప్రధానంగా ధరలు కొంత బాగానే ఉన్నా పెట్టుబడి ఖర్చులు భారీగా పెరగడం, కర్ణాటకలో అపరాధ రుసుం రద్దు చేయడంతో అలాగే ఇక్కడ కూడా రుసుం రద్దుచేసి అధిక పంట ఉత్పత్తి కొనుగోలుకు అనుమతి ఇవ్వాలని కోరారు. అయితే కేంద్రం నుంచి ఈ విషయంలో స్పష్టత రాలేదు. దీంతో కొనుగోలు పూర్తయిన ఏడు కేంద్రాల్లో రైతులు వద్ద పంట ఉన్న వేలం నిలిచిపోయింది. దాదాపు 47 మిలియన కిలోల పంట రైతుల ఇళ్లలో ఆగిపోగా కొనుగోళ్ల ఇంకా జాప్యం జరిగితే తూకం తగ్గడంతోపాటు నాణ్యత దెబ్బతిని భారీగా నష్టపోతామని రైతాంగం ఆందోళన చెందుతున్నారు. తక్షణం కేంద్రం అపరాధ రుసుం రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చి అధిక పంట కొనుగోలు జరిగేలా చూడాలని రైతులు కోరుతున్నారు. కొనుగోలు నిలిచిన విషయంపై పొగాకు బోర్డు ఒంగోలు ఆర్‌ఎం లక్ష్మణరావును వివరణ కోరగా అధిక పంట కొనుగోళ్లపై కేంద్ర వాణిజ్యమంత్రిత్వశాఖ నుంచి ఆదేశాలు త్వరలో వస్తాయని రాగానే వేలం తిరిగి ప్రారంభిస్తామన్నారు.

వైపాలెం ఎస్సైపై వేటు

వసూళ్ల పర్వంపై విచారణ

సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు


ఎస్సై సుదర్శన్

ఒంగోలు(క్రైం), జూలై 5: వసూళ్ల పర్వానికి శ్రీకారం చుట్టిన ఎస్సైపై వేటు పడింది. ఎర్రగొండపాలెంలో పనిచేస్తున్న ఎస్ఐ సుదర్శన్‌ను సస్పెండ్ చేస్తూ గుంటూరు రేంజి ఐజీ శ్రీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీచేశారు. ఎన్నికల ఖర్చుల కోసమంటూ వ్యాపార సంఘాలను పిలిపించి ఒక్క సంఘం నుంచి రూ.20 వేలకు తగ్గకుండా ఇవ్వాలని ఎస్సై డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. త్వరలో తాను బదిలీ అవుతున్నానని, అప్పులయ్యానంటూ ఎన్నికల సమయంలో నేరుగా వసూళ్లపర్వం ప్రారంభించాడు. అంతేకాదు స్వయంగా పోలీసు స్టేషన్‌కు పిలిపించుకొని కనీసం రూ.15వేలకు తగ్గకుండా ఇవ్వాలని వ్యాపారులకు హుకుం జారీ చేశారు. దీంతో వ్యాపారులు కలవరం చెందారు. ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ ఆదేశాల మేరకు మార్కాపురం డీఎస్పీ బాలసుందరావు విచారణ నిర్వహించారు. సమగ్ర నివేదికను గుంటూరు రేంజీ ఐజీకి పంపారు. ఎస్ఐ సుదర్శన్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలు నిర్ధారణ కావడంతో వెంటనే చర్యలు తీసుకున్నారు. ఎస్సై అవినీతి ఆరోపణలు మండలంలో చర్చనీయాంశం కావడంతో ఎస్పీ విచారణ చేయించారు.

పాఠశాల గ్రాంటు రాలేదు

జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర

ఒంగోలు(విద్య), జూలై 5: జిల్లాలోని పాఠశాలలకు 2023-24లో పాఠశాలల కాంపోజిట్ గ్రాంటు, మండల విద్యావనరుల కేంద్రాల గ్రాంటు, స్కూలు కాంప్లెక్స్ గ్రాంట్లు సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయం నుంచి విడుదల కానిది వాస్తవమేనని జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర ధ్రువీకరించారు. పాఠశాలలకు సమగ్రశిక్ష ప్రాజెక్టు నుంచి నయాపైసా నిధులు విడుదల కాలేదు. రాని గ్రాంట్లకు సమగ్రశిక్ష ఆడిట్ నిర్వహిస్తున్న విషయాన్ని ప్రస్తావిస్తూ 'సమగ్రశిక్ష మజాకా' శీర్షికతో ఈనెల 3న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. 2023-24 విద్యా సంవత్సరానికి సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు కార్యాలయం నుంచి జిల్లా ప్రాజెక్టు కార్యాలయానికి పాఠశాల, కాంప్లెక్స్, ఎమ్మార్సీ గ్రాంట్లు విడుదల కాలేదు. దీంతో తాము జిల్లాలోని పాఠశాలలు, కాంప్లెక్స్, ఎంఆర్‌సీలకు తాము నిధులు విడుదల చేయలేకపోయామని డీఈవో వివరణ ఇచ్చారు. రాష్ట్ర సమగ్రశిక్ష కార్యాలయం నియమించిన ఆడిటర్ల బృందం ఈనెల 3, 4 తేదీల్లో పాఠశాలలకు ఆడిట్ నిర్వహించారని సుభద్ర తెలిపారు.

మండల సమావేశం ఉద్రిక్తం

- జడ్పీ చైర్‌పర్సన్‌ను ప్రశ్నించేందుకు భారీగా చేరిన టీడీపీ శ్రేణులు
- పోలీస్ బందోబస్తు మధ్య సమావేశం
- ఎంపీటీసీ, ఎంపీపీ మధ్య తీవ్ర వాగ్వివాదం
- సమావేశాన్ని అర్ధంతరంగా ముగించిన వైనం


నిబంధనలకు విరుద్ధంగా సమావేశానికి వస్తున్న వైసీపీ నేతలను రానివ్వకుండా అడ్డుకున్న టీడీపీ శ్రేణులు

దొనకొండ, జూలై 5 : ప్రజాసమస్యలను చర్చించేందుకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఉషారాణి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా సాగింది. కొంతమేర ఉద్రిక్తత నెలకొంది. సమావేశానికి జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలుసుకున్న టీడీపీ శ్రేణులు భారీసంఖ్యలో కార్యాలయం వద్దకు చేరుకున్నారు. జడ్పీ చైర్‌పర్సన్‌గా మూడేళ్లకాలంలో ఏయే సమస్యలు పరిష్కరించారో ప్రశ్నించేందుకు టీడీపీ మండలాధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు నేతృత్వంలో శ్రేణులు ఎంపీడీవో కార్యాలయం వద్దకు చేరుకున్నారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకొని సభ్యులను మాత్రమే లోపలకు పంపి పోలీసు పహారా మధ్య సమావేశాన్ని కొనసాగించారు. అధికారులు వారిశాఖల పరిధిలో సమాచారాన్ని వివరిస్తుండగా వైస్ ఎంపీపీలు వడ్లమూడి వెంకటేశ్వర్లు, మిట్టా కోటిరెడ్డిలు సమస్యలు పరిష్కరించలేని సమావేశాలు నిర్వహించటం ఎందుకని ప్రశ్నించారు. దీనిపై ఎంపీపీ జోక్యం చేసుకోవటంతో వారి మధ్య వాగ్వాదం నెలకొంది. దీంతో ఇరువురూ సభను వాకౌట్ చేసి బయటకు వెళ్లిపోయారు. ఆరవళ్లిపాడు టీడీపీ ఎంపీటీసీ సభ్యురాలు కమ్మా వెంకటసుబ్బులు తమ గ్రామంలో నేటికీ ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని, అర్హులైన వారికి పింఛన్లు కూడా ఇప్పించలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీపీ ఉషారాణి జోక్యం చేసుకొని మాట్లాడటంతో ఇరువురు మధ్య మళ్లీ వాగ్వివాదం పెరిగింది. ఈ నేపథ్యంలో ఎంపీటీసీ వెంకటసుబ్బులును ఎంపీపీ అదుపు తప్పి దుర్భాషలాడడంతో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సమావేశంలో జరిగిన తీరును బయట ఉన్న టీడీపీ శ్రేణులు విని ఎంపీపీ క్షమాపణ చెప్పాలంటూ పెద్దఎత్తున డిమాండ్ చేశారు. దీంతో పలువురు చొరవ తీసుకొని ఎంపీపీని సమావేశం హాలు నుంచి తీసుకెళ్లిపోవటంతో సమావేశం అర్ధంతరంగా ముగిసింది. సమావేశానికి ముందు ఎంపీడీవో వసంతరావునాయక్ టీడీపీ నాయకుల మధ్య వివాదం నెలకొంది. మండల టీడీపీ అధ్యక్షుడు శివకోటేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ రాచగొర్ల వెంకటయ్య, జడ్పీటీసీ మాజీ సభ్యుడు పులిమి రమణాయాదవ్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు, వల్లపునేని వెంకటస్వామి, సింగమనేని హనుమంతు, దుగ్గెంపూడి చెంచయ్య, చొప్పరపు మైకేల్‌బాబు, వేగినాటి అల్లూరయ్య, వడ్లమూడి వెంకటాద్రి మరికొందరు నాయకులు గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతుంటే పట్టించుకోకుండా ఐదేళ్ల వైసీపీ నేతలు, అధికారులు ఇబ్బందిపెట్టిన తీరును ప్రశ్నించారు. టీడీపీ తరపున తాము ట్యాంకర్లు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీరుస్తున్నామన్నారు. జడ్పీ నిధులను ఇష్టారాజ్యంగా వైసీపీ నాయకులకు కట్టబెట్టి వారి జేబులు నింపారే తప్ప గ్రామాల్లో అభివృద్ధిని విస్మరించారని ఆరోపించారు. మూడేళ్లుగా జడ్పీ చైర్‌పర్సన్‌గా ఉన్న వారికి ప్రజల సమస్యలు తెలియవా..? ఆమె ప్రజలకు ఏంచేశారో చెప్పాలంటూ వారు నిలదీశారు.


ఎంపీడీవోతో వాగ్వివాదం చేస్తున్న టీడీపీ శ్రేణులు

ఆగని వైసీపీ నేతల దౌర్జన్యం

బూచేపల్లితోపాటు సమావేశంలోకి చొరబడేందుకు యత్నం

అడ్డుకున్న టీడీపీ శ్రేణులు

గంటపాటు ఆందోళనకరవాతావరణం

ప్రభుత్వం మారినా ఇంకా మండలంలో వైసీపీ నేతల దందా ఆగడం లేదు. శుక్రవారం మండల సమావేశానికి హాజరయ్యేందుకు జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డిలతోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు పోలోమంటూ మండల పరిషత్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. విషయం తెలిసి టీడీపీ శ్రేణులు సైతం ముందుగానే కార్యాలయం వద్దకు చేరాయి. సమావేశానికి అధికసంఖ్యలో వైసీపీ నాయకులు, కార్యకర్తలతో చేరుకున్న జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, వైసీపీ నాయకులను టీడీపీ శ్రేణులు కార్యాలయం లోపలకు వెళ్లనీయకుండా గేటు వద్ద అడ్డుకున్నాయి. నిబంధనల మేరకు జడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే మినహా మిగిలిన వారు లోపలకు వెళ్లేందుకు వీలులేదంటూ పట్టుబట్టారు. దాదాపు గంట సేపు ఇరువర్గాల మధ్య వాగ్వివాదంతోపాటు ఒక దశలో ఉద్రిక్తత నెలకొంది. ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు బుద్ధిచెప్పినా ఇంకా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న తీరును వారు ప్రశ్నించారు. ఈ ఘటన ఎటువంటి గొడవలకు దారితీస్తుందోనని పలువురు ఆందోళనలకు గురయ్యారు. త్రిపురాంతకం సీఐ సుబ్బారావు, దొనకొండ ఎస్సై సంపత్‌కుమార్‌లు చొరవ తీసుకొని టీడీపీ శ్రేణులకు సర్దిచెప్పి ముందు ఎమ్మెల్యేని, ఆ తర్వాత జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మను కార్యాలయం లోనికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు పరిష్కరించని జడ్పీ చైర్‌పర్సన్ గోబ్యాక్ అంటూ గట్టిగా నినాదాలు చేశారు. అప్పటికే సమావేశం ముగియటంతో ఇరువురు ఎంపీపీ గదిలో కొంతసేపు కూర్చుని తిరిగి బయటకు వెళ్లిపోయారు.



పంచాయతీలకు పూర్వవైభవం!

- ముఖ్యమంత్రి నేతృత్వంలో విస్తృత చర్చలు
- సచివాలయ వ్యవస్థతో నిర్వీర్యమైన గ్రామపంచాయతీలు
- రెండింటినీ అనుసంధానం చేసే దిశగా అడుగులు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 3: గ్రామ పంచాయతీ వ్యవస్థకు పూర్వవైభవం తెచ్చేందుకు నూతన ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా సచివాలయ వ్యవస్థను తెచ్చి పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసింది. దీంతో పాలక వర్గాలు ఉన్నా ఉత్సవ విగ్రహాలుగా మార్చింది. ప్రజలకు ఏ అవసరం వచ్చినా గ్రామ పంచాయతీలకు కాకుండా సచివాలయాలకు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. సచివాలయ వ్యవస్థ నిర్వహణ బాధ్యత మాత్రం పంచాయతీలకు ఉన్నా అందులో పని చేసే ఉద్యోగులు కానీ, ప్రభుత్వపరంగా అందించే సంక్షేమ పథకాలతో పాటు ఏ అవసరం వచ్చినా పంచాయతీలకు సంబంధం లేకుండా జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిర్వహించింది. దీంతో గత మూడేళ్ల నుంచి గ్రామపంచాయతీల పాలకులు తమ హక్కులు తమకు కల్పించాలని అనేక సార్లు వైసీపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. దీంతో పంచాయతీల్లో పాలన లేకపోవడంతో సర్పంచ్‌లు కానీ, ఇటు పంచాయతీ కార్యదర్శులు కానీ ఏమి చేయలేకపోయారు. అప్పటి ప్రభుత్వం ఏది చెప్పితే అదే చేయాల్సిన పరిస్థితి. జిల్లాలో 730 గ్రామ పంచాయతీల పరిధిలో సుమారు 720 సచివాలయాలు ఉన్నాయి. ఆ సచివాలయాల పరిధిలోనే ప్రభుత్వ కార్యక్రమాలు జరుగుతున్న విషయాన్ని గుర్తించిన నూతన ప్రభుత్వం అందులో పంచాయతీ వ్యవస్థకు పూర్వవైభవం తెచ్చేందుకు చర్యలు తీసుకుంది.

వాటి పరిధిలోకి సచివాలయ ఉద్యోగులు

ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వంలో జనసేన అధినేత, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పంచాయతీరాజ్ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాలు, పంచాయతీల నిర్వీర్యం తదితర అంశాలన్నింటినీ సమీక్షించారు. గ్రామ పంచాయతీల స్థానంలో సచివాలయ వ్యవస్థను తేవడం ద్వారా అవి నిర్వీర్యమైనట్లు గుర్తించారు. సచివాలయ వ్యవస్థలో పనిచేసే ఉద్యోగులను పంచాయతీలో భాగస్వామ్యం చేసే దిశగా అడుగులు వేసి తద్వారా పూర్వవైభవం తెచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ ప్రక్రియ పక్షంరోజుల్లో పూర్తవుతుందనే ప్రచారం ఉంది. ఇంకొకవైపు గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో గ్రామాల్లో మీసేవా కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు అన్ని రకాల సేవలను అందుబాటులోకి తెచ్చారు. ఆ సేవలను కూడా వైసీపీ ప్రభుత్వం ప్రజలకు దూరం చేసి ఏ పనికావాలన్నా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల ద్వారా చేయిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారానే గ్రామాల అభివృద్ధితో పాటు ప్రజలకు సత్వర సేవలు అందుబాటులోకి తెచ్చేవిధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

325 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత


బియ్యం తరలిస్తున్న లారీని పట్టుకున్న అధికారులు

నాగులుప్పలపాడు, జూలై 5 : వేర్వేరు ప్రాంతాల్లో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న లారీని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. ఏపీ27 యూబీ 5598 నంబరు గల లారీ 200 బస్తాల రేషన్ బియ్యం లోడుతో మండలంలోని ఉప్పుగుండూరు నుంచి గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్ వైపు వెళుతుండగా బి.నిడమానూరు వద్ద శుక్రవారం తెల్లవారుజామున విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో డీటీలు డేవిడ్, సీహెచ్ కృష్ణమోహన్, రామనారాయణరెడ్డి బృందం దాడి చేసి పట్టుకున్నారు. పట్టుబడిన బియ్యం బస్తాలను ఒంగోలులోని ఎఫ్‌సీఐ గోడౌన్‌కు తరలించారు. బాధ్యులపై కేసులు నమోదు చేసినట్లు డీటీ కృష్ణమోహన్ తెలిపారు. అలాగే శుక్రవారం ఎర్రగొండపాలెం మండలం అయ్యంబొట్లపల్లిలో 125 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు.

మెస్, కాస్మెటిక్ చార్జీలు విడుదల చేయాలి


ఎస్ఎఫ్ఐ నాయకుల నుంచి అర్జీ స్వీకరిస్తున్న మంత్రి స్వామి

తూర్పునాయుడుపాలెం(టంగుటూరు) జూలై 5 : నెలలు తరబడి పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మెటిక్ చార్జీలు విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.వినోద్, ఒంగోలు నగర కార్యదర్శి బి.వీరాస్వామి కోరారు. ఈ మేరకు వారు తూర్పునాయుడుపాలెంలో మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని కలసి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా హాస్టళ్లలో విద్యార్థుల ఇబ్బందులను వారు మంత్రికి ఏకరువు పెట్టారు. మెస్ చార్జీలలో 9నెలలుగా పెం డింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత


పట్టుబడిన ట్రాక్టర్‌తో ఎస్ఈబీ ఎస్సై దయాకర్

సింగరాయకొండ, జూలై 5 : పాలేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్ఈబీ సీఐ నరహరిరావు తెలిపారు. సింగరాయకొండ మండలం కనుమళ్ల గ్రామం వద్ద ఒక ట్రాక్టర్‌ను, జరుగుమల్లి మండలం నందనవనం వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న మరో ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. కనుమళ్ల వద్ద పట్టుబడిన ట్రాక్టర్‌కు తొలి తప్పు కింద రూ.10 వేలు, నందనవనం దగ్గర పట్టుబడిన ట్రాక్టర్‌కు రెండో త ప్పుకింద రూ.20 వేలు పెనాల్టీ విధించినట్లు సీఐ వివరించారు. ఈ దాడుల్లో ఎస్సై దయాకర్, ఎస్ఈబీ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

విచారించకుండా నిర్ధారణ ఎలా చేస్తారు?


నిరసన వ్యక్తం చేస్తున్న హరిబాబు, శ్రీనివాసరావు

టంగుటూరు, జూలై 5 : విద్యుత్ శాఖ రూరల్ ఏఈ చంద్రశేఖర్‌పై తాను ఆరోపణలు చేస్తే మాటమాత్రం తనను విచారించకుండా తాను తప్పు చేసినట్లు నిర్ధారిస్తారా, ఇదెక్కడి చోద్యం అని విద్యుత్ శాఖ అధికారులపై మండలంలోని జమ్ములపాలెం ఎస్సీ కాలనీకి చెందిన హరిబాబు ఆగ్రహం వ్యక్తం చేశాడు. జమ్ములపాలెం నివాసి హరిబాబు తనను రూరల్ ఏఈ తీవ్రంగా అవస్థ పెడుతున్నాడని ఆరోపిస్తూ ఈనెల 3న టంగుటూరు విద్యుత్ రూరల్ కార్యాలయం వద్ద ఉన్న టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. ఈ నేపథ్యంలో గురువారం ఒంగోలులో అధికారులు తనపై లేనిపోని ఆరోపణలు చేశారన్నారు. శుక్రవారం టంగుటూరు రూరల్ ఏఈ కార్యాలయానికి వచ్చిన ఏడీ తనను పిలిపించి ఏఈకి అనుకూలంగా రాసి సంతకం పెట్టి ఇవ్వాలని తనకు హుకుం జారీ చేశాడని చెప్పారు. దీనికి ఆగ్రహం చెందిన హరిబాబు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఆయనకు మద్దతుగా బొడ్డు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్విస్‌లో ఘనంగా పర్యావరణ దినోత్సవం

ఒంగోలు(విద్య), జూలై 5: ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు ఏక పెర్ మాకె నామ్ ప్రచారాన్ని ప్రారంభించారు. కళాశాల విద్యార్థులు తమ తల్లుల గౌరవార్థం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ నిడమానూరి సూర్య కళ్యాణచక్రవర్తి, వైస్ ఛైర్మన్ డాక్టర్ గాయత్రి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు విరివిగా మొక్కలు నాటాలన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ హెడ్ డాక్టర్ జి.నవనీత్‌కృష్ణన్ ప్రిన్సిపాల్ వైవీ.హనుమంతరావు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే క్విస్ హైస్కూలులో సూర్యకళ్యాణ్ చక్రవర్తి, డాక్టర్ గాయత్రి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆంథోని మేరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి


మట్టిని సేకరిస్తున్న ఏవో, సిబ్బంది

కొండపి, జూలై 5 : మండలంలోని రైతులందరూ తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏవో విజయ్ కుమార్ చెప్పారు. మండలంలోని వెన్నూరు గ్రామంలో రైతుల పొలాల నుంచి మట్టినమూనాలను వ్యవసాయ అసిస్టెంట్ సాయంతో శుక్రవారం సేకరించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ భూసార పరీక్షల ద్వారా రైతులు తమ భూముల్లో ప్రధాన పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాష్ ఏ మేరకు అందుబాటులో ఉన్నాయో తెలుసుకోవచ్చన్నారు. అదేవిధంగా సూక్ష్మపోషకాలైన జింక్, ఐరన్, మాంగనీస్ వంటి మూలకాల లోపాలను, చౌడు లక్షణాలను తెలుసుకోవచ్చని చెప్పారు. తద్వారా భూమిలో ఏమి లోపం ఉందో తెలుసుకుని అవసరమైన వాటిని ఎరువుల రూపంలో అందజేయవచ్చన్నారు. కార్యక్రమంలో వెన్నూరు వీఏఏ కొండలరావు పాల్గొన్నారు.

పొగాకు చూర గరిష్ఠ ధర కేజీ రూ.148

కొండపి, జూలై 5 : కొండపి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం పొగాకు చూర, ముక్క బేళ్లను రైతులు వేలానికి ఉంచారు. కేజీ చూర, ముక్కకు అత్యధిక 148 రూపాయలు లభించగా, అత్యల్ప ధర 59 రూపాయలు పలికింది. ఎన్.ఎన్.కండ్రిగ, పెట్లూరు, వర్ధినేనివారిపాలెం, జగ్గరాజుపాలెం, అయ్యపరాజుపాలెం, నరసరాజుపాలెం, పెదకండ్లగుంట గ్రామాలకు చెందిన రైతులు 709 బేళ్లు వేలానికి తీసుకురాగా, 519 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా వేలం నిర్వహణాధికారి జి. సునీల్‌కుమార్ మాట్లాడుతూ శుక్రవారం 9 కంపెనీల వ్యాపారులు మాత్రమే పాల్గొన్నారన్నారు. వీటిలో ఐదు కంపెనీలు చూర, ముక్కను కొనుగోలు చేయలేదని, శనివారం ఎక్కువగా కంపెనీలు పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి



సదస్సులో మాట్లాడుతున్న పీడీ అన్నపూర్ణ

నాగులుప్పలపాడు, జూలై 5 : రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వనరుల కేంద్రం పీడీ అన్నపూర్ణ సూచించారు. మద్దిరాలపాడు గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయం, భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగం పై రైతులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా రసాయన ఎరువులు, పురుగుమందులను విచక్షణ రహితంగా వాడటం వల్ల నేల, గాలి, నీటి కాలుష్యంతో పాటు సాగు ఖర్చులు పెరిగి రైతుకు నికర ఆదాయం తగ్గిపోతుందని సూచించారు. కావున ప్రస్తుత పరిస్థితులపై రైతులు అవగాహన కలిగి ఉండి రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడకం తగ్గించాలని చెప్పారు. తమ సిఫార్సు మేరకు మాత్రమే వినియోగించాలన్నారు. సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు, జీవ శిలీంద్రనాసినులు, వేప కషాయం, వేప నూనే లాంటి ప్రకృతి వనరులను వినియోగించుకొని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలన్నారు. భూసార పరీక్ష కేంద్రం, వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.సుచరిత మట్టి నమూనా తీసే విధానం, మట్టి పరీక్ష ఫలితాలను అనుసరించి ఎరువుల వాడకం సమస్యాత్మక భూముల యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను మండల వ్యవసాయ అధికారి పి.వెంకట్రావు రైతులకు వివరించారు. ఎరువుల వినియోగంపై ముద్రించిన కరపత్రాలను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారులు ఎ.శైలజారాణి, వి.వెంకటశేషమ్మ, వీఏఏ సాయి, రైతులు పాల్గొన్నారు.

సఫాయికర్మచారీల అభివృద్ధికి కృషి

- నేషనల్ కమిషన్ సభ్యుడు వావ


మాట్లాడుతున్న నేషనల్ కమిషన్ సభ్యుడు వావ

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 5: మునిసిపాలిటీల్లో పనిచేసే సఫాయికర్మచారీల సామాజిక, ఆర్థిక, విద్యా స్థితిగతులపై ప్రత్యేక దృష్టి సారించాలని నేషనల్ కమిషన్ ఫర్ సఫాయికర్మచారి సభ్యుడు డాక్టర్ పీపీ.వావ సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో శుక్రవారం మాన్యువల్ స్కావెంజింగ్ ఉపాధిని నిషేధించడం, వారి పునరావాస చట్టం-2013 అమలును ఆయన సమీక్షించారు. సమావేశ మెంబర్ సెక్రటరీ, ఎక్స్ అఫిషియో లక్ష్మానాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వావ మాట్లాడుతూ సఫాయి కరంచారీల సమస్యలను తన దృష్టికి తెస్తే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. కొవిడ్‌తో చనిపోయిన సఫాయికర్మచారీలకు రూ.కోటి పరిహారం ఇస్తామన్నారు. సోషల్ వర్కర్ మిట్నసల బెంజిమెన్ మాట్లాడుతూ ఈఎస్ఐ హాస్పటల్‌పై కర్మచారీలకు అవగాహన కల్పించాలని కోరారు. మునిసిపాలిటీలలో పనిచేసే సఫాయి కరంచారీలకు నియమ నిబంధనలతో కూడిన నియామక పత్రాలు ఇవ్వాలన్నారు. సామాజిక కార్యకర్త డాక్టర్ కిషోర్ మందా మాట్లాడుతూ జిల్లాలో రెండు అట్రాసిటీ కేసులు నమోదైనా ఇంత వరకు రిలీఫ్ అందలేదన్నారు. అనంతరం ఆయా అంశాలపై జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జిల్లాలో స్కావెంజింగ్ ఉపాధి నిషేధం, పునరావాస చట్టం కచ్చితంగా అమలు జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా, డీఆర్వో విశ్వేశ్వరరావు, ఆర్డీవోలు సుబ్బారెడ్డి, జాన్‌ఇర్విన్, అధికారులు టి.ఉషారాణి, సుభద్ర, శ్రీనివాస్‌కుమార్, మనోహర్‌రెడ్డి, జశ్వంత్‌రావు, కోటిరెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ రమేష్, పశుసంవర్ధక అధికారి బేబీరాణి, రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.బాలాజీ నాయక్, మునిసిపల్ కమిషనర్లు ఈశ్వరరాజు, వై.మహేశ్వరరావు, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జనరల్ హాస్పటల్ తనిఖీ

కాగా నగరంలోని ప్రభుత్వ జనరల్ హాస్పటల్‌ను వావ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ సఫాయి కరంచారీల సిబ్బందితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. సఫాయికర్మచారీల సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

గెలుపు కోసం పాటుపడిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తా!

- ఎమ్మెల్యే దామచర్ల హామీ
- టీడీపీ నాయకులతో సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 5 : తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం, అలాగే తనకు అత్యధిక మెజారిటీ తీసుకొచ్చేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తానని, అన్ని వేళలా అండగా ఉంటానని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ హామీ ఇచ్చారు. శుక్రవారం ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో కూటమి నాయకులతో సమావేశం అయిన దామచర్ల మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ళ వైసీపీ పాలనలో టీడీపీ శ్రేణులు అనేక ఇబ్బందులు పడ్డారని, అన్ని విషయాలు తనకు తెలుసన్నారు. ఎవరూ అధైర్యపడవద్దని తెలిపారు. నియోజకవర్గ సమస్యల పరిష్కారంతోపాటు, పార్టీ కోసం పని చేసిన మరిచిపోనని పేర్కొన్నారు. అలాగే నియోజకవర్గ అభివృద్ధిలో మీరంతా భాగస్వాములు కావడంతోపాటు, మంచి పేరు తీసుకురావాలని దామచర్ల కోరారు. అలాగే కొత్తగా పార్టీలో చేరిన వారిని కలుపుకుని పోవాలని తెలిపారు. విభేదాలకు, అసంతృప్తులకు అవకాశం ఇవ్వకుండా టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులందరూ ఒక కుటుంబంగా పనిచేసి ప్రజల నమ్మకాన్ని నిలబెడదామని పిలుపునిచ్చారు. తాను ఎప్పుడూ మీ మనిషినేనని, ఏ సమస్య వచ్చిన తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు పలువురు తమ అభిప్రాయాలను దామచర్లకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, నాయుకులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలి

- కలెక్టర్ అన్సారియా ఆదేశం


కమిషనర్లతో సమీక్షిస్తున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 5: తాగునీటి సరఫరాలో ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం ఒంగోలు కార్పొరేషన్‌తో పాటు జిల్లాలోని అన్ని మునిసిపాలిటీలు, నగర పంచాయతీల కమిషనర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ఆయా మునిసిపాలిటీల్లో ఉన్న ఇళ్ళు సరఫరాకు ఉన్న డిమాండ్, ప్రస్తుతం సరఫరా చేస్తున్న పరిమాణం, అందుబాటులో ఉన్న నీటి వనరులు, తాగునీటి సరఫరాకు కొత్త పథకాలు, ప్రతిపాదనలు, ట్యాంకుల ద్వారా సరఫరా తదితర అంశాల వారీగా సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఒంగోలు కమిషనర్ జశ్వంతరావు మాట్లాడుతూ రెండు నెలలకు సరిపడా నీరు ప్రస్తుతం అందుబాటులో ఉందన్నారు. రామతీర్థం నుంచి స్థానిక చెరువులకు నీటిని తరలించి నిల్వ చేశామని చెప్పారు. కార్పొరేషన్‌లో విలీనమైన 37 గ్రామాలకు 35 ట్యాంకర్ల ద్వారా రోజుకు 250 ట్రిప్పులు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ఇతర మునిసిపాలిటీల్లో కూడా తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పాలన, ఆర్థికపరమైన అంశాలు ఏమైనా ఉంటే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో మునిసిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు పలువురి శుభాకాంక్షలు


కలెక్టర్ అన్సారియాకు బొకే ఇస్తున్న రియాజ్


కలెక్టర్‌కు బొకే ఇస్తున్న ముస్లిం నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 5 : ఇటీవల కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తమీమ్ అన్సారియాను జనసేనపార్టీ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ ఆధ్వర్యంలో అన్సారియాను కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు అంశాలను కలెక్టర్ దృష్టికి రియాజ్ తీసుకెళ్ళారు. కార్యక్రమంలో చిట్టెం ప్రసాద్, ముత్యాల కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే కలెక్టర్ తమీమ్ అన్సారియాను ముస్లిం ప్రజాసంఘాల ఐక్యవేదిక జిల్లా నాయకులు శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు బొకే అందజేసి శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా వేదిక నాయకులు పలు అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు. జిల్లాలో ఉర్దూ స్కూళ్ల అభివృద్ధి, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు పఠాన్ కరీముల్లాఖాన్, హైకోర్టు న్యాయవాది షేక్ కరీముల్లా, ముస్లిం హక్కుల పరిరక్షణ సమితిజిల్లా అధ్యక్షుడు సయ్యద్‌ఇస్మాయిల్, అవాజ్ నాయకులు సయ్యద్‌హుస్సేన్, షేక్ ఖాజా, పఠాన్ అయూబ్ ఖాన్, అబ్దుల్‌రవూఫ్, కరీంబేగ్, మహమద్ బిలాల్ తదితరులు పాల్గొన్నారు.

కనగాల మధును అభినందించిన దామచర్ల

ఒంగోలుకు చేరిన టీడీపీ నాయకుల తిరుమల పాదయాత్ర


ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు బొకే ఇస్తున్న మధు

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 5: ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కూటమి భారీ విజయం సాధించడంతో బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గానికి చెందిన కొల్లూరు మండల వజీఈ ఎంపీపీ డాక్టర్ కనగాల మధు చేపట్టిన తిరుమల పాదయాత్ర శుక్రవారం ఒంగోలుకు చేరుకుంది. తన సొంత జిల్లా కొల్లూరు నుంచి తిరుమల తిరుపతికి మధు చేపట్టిన పాదయాత్ర 14 రోజుల పూర్తయి 400 కి.మీ.లకు చేరుకుంది. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రం వద్ద ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను మధు కలిశారు. ఈ సందర్భంగా దామచర్ల ఆయన చేపట్టిన పాదయాత్రను అభినందించారు. పార్టీ కోసం నిబద్ధత గల కార్యకర్తలు, నాయకులు, అభిమానులు ఉండటంతో టీడీపీని ప్రజలు మరింతగా ఆదరించారని ఆయన తెలిపారు.

2,516 మంది సర్టిఫికెట్ల పరిశీలన

నూజివీడు టౌన్, జూలై 5: ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, ఆర్కే వ్యాలీ, శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌లలో 2024-25 విద్యా సంవత్సరంలో ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్‌లో ప్రవేశాలకై ప్రత్యేక కేటగిరిల్లో 2,516 మంది విద్యార్థులకు నూజివీడు ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి అయినట్లు ఆర్జీయూకేటీ అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్.అమరేంద్రకుమార్ తెలిపారు. ఎన్‌సీసీ కేటగిరిలో మొదటి ఐదురోజులకు గాను 1141 మంది, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో 162 మంది, క్యాప్ విభాగంలో 167, దివ్యాంగుల విభాగంలో 249, క్రీడా విభాగంలో 796 మంది విద్యార్థులు తమ సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేసుకున్నారన్నారు. కాగా జనరల్ కౌన్సెలింగ్‌కు సంబంధించి క్యాంపస్‌ల వారీగా ఎంపికైన విద్యార్థుల తుది జాబితా ఈ నెల 11న విడుదల చేయటం జరుగుతుందని, ఎంపికైన విద్యార్థులు ధ్రువ పత్రాల పరిశీలన, నూజివీడు, ఆర్కే వ్యాలీ క్యాంపస్‌లలో లై 22, 23 తేదీల్లోనూ, ఒంగోలు క్యాంపస్‌కు సంబంధించి ఆర్కే వ్యాలీలో 24, 25 తేదీల్లో, శ్రీకాకుళం క్యాంపస్‌లో 26, 27 తేదీల్లో జరుగుతుందన్నారు.

వైభవంగా గంధమహోత్సవం


దర్గాలో ప్రార్థనలు చేస్తున్న మంత్రి స్వామి

సింగరాయకొండ, జూలై 5 : సింగరాయకొండ పంచాయతీ పరిధిలో కనుమళ్ల రోడ్డు ఈద్గామిట్టలోని దర్గాలో శ్రీహజరత్ మహబూబ్ సుభానీ గంధమహోత్సవాన్ని గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి పాల్గొన్నారు. మతపెద్దలు స్వామిని సాదరంగా ఆహ్వానించి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. అనంతరం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో టీడీపీ నేతలు షేక్ సంధానీబాషా, యస్థాని, షేక్ సనావుల్లా, అజీం, అబ్దుల్ సుభాన్, గౌస్ పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

నేడు ప్రపంచ జూనోసిస్ దినోత్సవం

- పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ టీకా

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 5: పశుపక్ష్యాదుల నుంచి మనుషులకు సంక్రమించే జూనోటిక్ వ్యాధులలో రేబిస్ వ్యాధి(పిచ్చికుక్క కాటు వ్యాధి) ఒకటి. ఈ వ్యాధి కారణంగా ప్రపంచ వ్యాప్తంగా లక్షల మంది చనిపోతున్నారు. రేబిస్ వ్యాధి నివారణ కోసం పెంపుడు కుక్కల యజమానులు తమ కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేయించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. శనివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఒంగోలు నగరం సంతపేట పశువైద్యశాలలో అన్ని పెంపుడు కుక్కలకు ఈ రేబిస్ టికాను ఉచితంగా వేసేందుకు ఆ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లాకు 35,230 డోసుల వాక్సిన్‌ను కేటాయించారు. జిల్లాలోని అన్ని పశువైద్యకేంద్రాల్లో రేబిస్ టీకాను ఉచితంగా వేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ బేబీరాణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పెంపుడు కుక్కల యజమానులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

15లోపు అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు(విద్య), జూలై 5: 2024 సంవత్సరం జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు అర్హులైన ఉపాధ్యాయులు ఈనెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలి. నేషనల్ అవార్డు.టు టీచర్స్ ప్రభుత్వ వెబ్ సైట్‌లో ఉపాధ్యాయులు తమ ప్రతిపాదనలను అప్‌లోడ్ చేయాలి. వర్డ్ డాక్యుమెంట్ సీడీ 30 పేజీలకు మించకుండా ఉండేలా సమర్పించాలి. ఆన్‌లైన్ దరఖాస్తు చేసిన కాపీ రెండు సెట్ల ప్రతిపాదనలను ఉపాధ్యాయులు సంబంధిత మండల విద్యాధికారులు, ఉప విద్యాధికారులకు సమర్పించాలి. టీచర్ల ప్రతిపాదనలు ఎంఈవోలు, డిప్యూటీ డీఈవోలు ఈనెల 15లోపు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలని ఆమె కోరారు.

నేడు బ్రిలియంట్ ఆధ్వర్యంలో మెగా ఎడ్యుకేషన్ ఫెయిర్

ఒంగోలు(కల్చరల్), జూలై 5: ఒంగోలులోని బ్రిలియంట్ కంప్యూటర్స్ ఆధ్వర్యంలో శనివారం మెగా ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ఛైర్మన్ షేక్ న్యామతుల్లా బాషా శుక్రవారం తెలిపారు. విద్యార్థులకు ఎంతో ఉపయోగంగా ఉండేవిధంగా కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. దేశంలోని పలు యూనివర్సిటీలకు చెందిన ప్రొఫెసర్లు, ప్రిన్సిపాల్స్ పాల్గొని ఇంజనీరింగ్, మెడికల్, డిగ్రీ కోర్సుల విద్యార్థులకు అవసరమైన పలు సూచనలు అందజేస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, పోలీస్ విశ్రాంత అధికారి కేఆర్ఎం కిషోర్‌కుమార్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. కనుక ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ షేక్ తాహరా కోరారు.

పేద విద్యార్థికి పుస్తకాల అందజేత

ఒంగోలు(కల్చరల్), జూలై 5: ఒంగోలు నగరం బండ్లమిట్టకు చెందిన పేద విద్యార్థికి శుక్రవారం సూర్యశ్రీ ట్రస్ట్ ఆధ్వర్యంలో పుస్తకాలు, దుస్తులను అందజేశారు. స్థానిక కర్నూల్‌రోడ్ ట్రస్ట్ కార్యాలయంలో నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు మాట్లాడుతూ పేద విద్యార్థి సలాం పదో తరగతిలో 90 శాతం మార్కులతో ఉత్తీర్ణుడయ్యాడని, ఇంటర్ మొదటి సంవత్సరం పుస్తకాలు కొనటానికి ఆర్థిక స్తోమత లేకపోవటంతో ప్రవాస భారతీయుడు ఖాజాహుస్సేన్ కందుకూర్ ఆర్థిక సహకారంతో పుస్తకాలు, దుస్తులు ఏర్పాటుచేశామన్నారు. ట్రస్ట్ సెక్రటరీ సర్దార్‌బాషా, ఛైర్మన్ షహనాజ్, మోటుపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో ఎంఎల్‌టీ కోర్సు ప్రారంభం

ఒంగోలు(విద్య), జూలై 5 : ఒంగోలులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరం నుంచి మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ(ఎంఎల్‌టి) డిగ్రీ కోర్సు ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి.కళ్యాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఈ కోర్సు ఉన్న ఏకైక కళాశాల తమదేనని పేర్కొన్నారు. బీఎస్సీ ఆనర్స్ కెమిస్ట్రీ, నాల్గవ సంవత్సరం కూడా అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. మూడు సంవత్సరాల డిగ్రీ కోర్సు పూర్తిచేసిన వారు ఈ కోర్సులో నాల్గవ సంవత్సరంలో నేరుగా చేరవచ్చు. ఇంటర్ ఎంపీసీ, బైపీసీ చదివిన వారు ఈ కోర్సు మొదటి సంవత్సరంలో చేరవచ్చు. నాలుగు సంవత్సరాల డిగ్రీ కోర్సు పూర్తి చేసిన వారు నేరుగా పీజీలో చేరాలన్నారు. బీకాం జనరల్ కోర్సుకు కూడా ఈ సంవత్సరం అడ్మిషన్లు జరుగుతున్నాయి. విద్యార్థినులు ఉద్యోగావకాశాలున్న కోర్సుల్లో చేరి సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కళ్యాణి, రసాయన శాస్త్ర విభాగాధిపతి ఎం.శ్రీనివాసరెడ్డి, కామర్స్ విభాగాధిపతి కుసుమకుమారి కోరారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ప్రతినిధులు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 5: ఒంగోలులోని శ్రీచైతన్య పాఠశాలలో శుక్రవారం నాసా స్పేస్ సెటిల్మెంట్ అవార్డును నిర్వహించారు. గత ఏడాది విద్యార్థులు ప్రయోగాత్మకంగా చేసిన ప్రాజెక్టు నాసా రాయల్‌డ్రాగన్ అవార్డును గెలుచుకుంది. జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ ప్రాజెక్టుకు ఎంపికైన విద్యార్థులకు శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆర్ఐ అనిల్, కో ఆర్డినేటర్ జి.శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయుడు జోషప్ తంబి, అకడమిక్ డీన్ బాలసుబ్రహ్మణ్యం, వైస్ ప్రిన్సిపాల్ శివపార్వతి, నాసా ఇన్‌చార్జి మధుస్మితల చేతుల మీదుగా మెమోంటోలు, సర్టిఫికెట్లు, పతకాలను అందజేశారు.

అపస్మారకస్థితిలో గ్యాస్ డెలివరీ బాయ్

- పోలీసులకు అతని తల్లి ఫిర్యాదు

ఒంగోలు(క్రైం), జూలై 5: గ్యాస్ డెలివరీ బాయ్‌గా పని చేసే తన కుమారుడిపై హత్యాయత్నం జరిగిందంటూ అతడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చావు బతుకుల మధ్య ఆసుపత్రిలో తన కుమారుడు చికిత్స పొందుతున్నాడని వాపోయింది. వివరాల్లోకి వెళితే.. ఒంగోలు నగరం బలరాంకాలనీలో నివాసం ఉంటున్న కాకర్లమూడి డానియిల్ ఓ గ్యాస్ కంపెనీలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. వివాహమైన ఆయన భార్యకు దూరంగా ఉంటున్నాడు. ఈనెల 3వ తేదీ రాత్రి ఇంటి నుంచి బయిటకు వెళ్ళాడు. అదే కాలనీలో ఉండే ఓ మహిళ ఇంటి బయిట అపస్మారక స్థితిలో 4వ తేదీ తెల్లవారుజామున పడిఉండటంతో అతని స్నేహితుడు గౌస్‌బాషా రిమ్స్ ఆసుపత్రికి తరలించాడు. అతని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాడు. దీంతో తల్లిదండ్రులు వెళ్ళి చూడగా డానియిల్ పరిస్థితి ఆందోళనకరంగా ఉందని డాక్టర్లు చెప్పడంతో అక్కడ నుంచి నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. తన కుమారుడు మెడ చుట్టూ కందిపోయి ఉందని, తమకు అనుమానంగా ఉందని డానియిల్ తల్లి కుమారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు గౌస్‌బాషాతో సదరు మహిళ, ఆమె సోదరుడులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. తాలుకా ఎస్సై వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్దిపాడులో కదలని మురుగు

మద్దిపాడు,జూలై 5: మద్దిపాడులో మురుగు కాలువలు దుర్గంధం వెదజల్లుతూ రహదారి వెంట వెళ్లే ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తున్నాయి. మురుగు నీరు పేరుకుపోయి ముందుకు కదలక పోవటంతో దోమలు విజృంభిస్తున్నాయి. స్థానిక అరుంధతి కాలనీలో సైడు కాలువల్లో చెత్త పేరుకుపోయి మురుగు కదలటం లేదు. అధికారులకు ఎన్నిసార్లు ప్రజలు మొరపెట్టుకున్నా స్పందన లేదని వాపోతున్నారు. కనీసం నెలకు ఒక్కసారైనా చెత్తను తొలగించే పనులు చేయకపోవడంతో కాలువల్లో మురుగు నిలిచిపోతుంది. అదేవిధంగా పాత సిండికేట్ బ్యాంక్, ఎస్సీ హాస్టల్ దగ్గర కూడా పరిస్థితి దయనీయంగా ఉంది. ఇప్పటికైనా మండల అధికారులు స్పందించి మద్దిపాడులో మురుగుకాలువల్లో పూడిక తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

బడి ఈడు పిల్లలందరూ స్కూళ్లలో ఉండాలి

మద్దిపాడు, జూలై 5: బడి ఈడు పిల్లలందరూ స్కూళ్లలో ఉండేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఈవో అంజనేయులు పేర్కొన్నారు. మద్దిపాడు మండల విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాటాడుతూ నేను బడికి పోతా కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించాలన్నారు. బడి బయట విద్యార్థులను గుర్తించి స్కూళ్లలో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డయేరియా నిర్మూలనకు కృషి చేయాలి

మద్దిపాడు, జూలై 5: డయేరియా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని మద్దిపాడు పీహెచ్‌సీ డాక్టర్ శ్రావణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం వెల్లంపల్లి గ్రామంలో డయేరియాపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విరోచనాలు, టైఫాయిడ్ నీటి ద్వారా సంక్రమించే వ్యాధులను నియంత్రించేందుకు వ్యక్తిగత పరిశుభ్రత అవసరమన్నారు. నీటిలో బ్యాక్టీరియా ఇతర సూక్ష్మజీవులు నశింపజేయాలంటే క్లోరినేషన్ తప్పనిసరి అని చెప్పారు, కార్యక్రమంలో వెల్లంపల్లి సర్పంచ్ చిట్టిబోయిన అనిల్‌కుమార్‌యాదవ్, ఎంపీటీసీ అద్దేపల్లి లక్ష్మీదుర్గాభవాని, సర్పంచ్ దాసరి శిల్పసౌందర్య, గ్రామకార్యదర్శి మాధవి, హెల్త్ సూపర్‌వైజర్ కె.బాలకోటయ్య, ఏఎన్ఎం శ్రీదేవి, లిదియా, వెంకటేశ్వరమ్మ, నాగభూషణమ్మ, గ్రామ సచివాలయ ఉద్యోగులు హెల్త్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఐజీని కలిసిన దామచర్ల, ముత్తుముల



ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని సత్కరిస్తున్న ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ముత్తుముల అశోక్‌రెడ్డి, రియాజ్

గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం సాయంత్రం విజయవాడలోని ఐజీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా వారు పలు అంశాలపై చర్చించారు. - ఒంగోలు(కార్పొరేషన్)





మంత్రులు రామానాయుడు, నారాయణలతో డాక్టర్ లక్ష్మి దంపతులు

దర్శి అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలి

● మంత్రులను కలిసి కోరిన గొట్టిపాటి లక్ష్మి దంపతులు

దర్శి, జూలై 5 : దర్శి నియోజకవర్గ అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని రాష్ట్ర మంత్రులు పి. నారాయణ, ఎన్. రామానాయుడులను శుక్రవారం టీడీపీ దర్శి నియోజకవర్గ నాయకురాలు గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు కలిసి విజ్ఞప్తి చేశారు. తొలుత ఇరువురు మంత్రులకు బొకేలు అందించి అభినందనలు తెలిపారు. దర్శి నియోజకవర్గంలో మూలనపడ్డ సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి రామానాయుడుకు విజ్ఞప్తి చేశారు గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కనీస మరమ్మతులు చేయక సాగర్ కాలువలు అధ్వాన్నంగా మారాయని వివరించారు. మొగిలిగుండాల రిజర్వాయర్ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని, వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం వేగవంతం చేయాలని కోరారు. అనంతరం పురపాలక శాఖ మంత్రి నారాయణతో మాట్లాడుతూ దర్శి నగర పంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. గత వైసీపీ పాలనలో నగర పంచాయతీ చేశారే గాని పోస్టులు మంజూరు చేయకపోవటంతో పాలన కుంటుపడిందన్నారు. అన్నీ పోస్టులు భర్తీ చేసి దర్శి పట్టణ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. అందుకు రాష్ట్ర మంత్రులు సానుకూలంగా స్పందించారని గొట్టిపాటి లక్ష్మి దంపతులు తెలిపారు.

'మా అప్పుల సంగతి ఏమిటి..?'



అప్పుల బిల్లులను చూపిస్తున్న వ్యాపారులు

అద్దంకి, జూలై 5: జగనన్న మహిళా మార్ట్‌కు సరుకులు అప్పు ఇచ్చిన వ్యాపారులు తమ అప్పుల పరిస్థితి ఏమిటని మార్ట్ నిర్వహణ కమిటీని నిలదీశారు. సుమారు రూ.11 లక్షల మెప్మా సభ్యుల పెట్టుబడి నిధితో మహిళా మార్ట్ నిర్వహిస్తుండగా ఇటీవల మూత పడింది. ఇప్పటికే సభ్యుల పెట్టుబడి డబ్బులు గోల్‌మాల్ జరిగాయని విమర్శలురాగా విచా రణ జరుగుతుంది. మహిళా మార్ట్‌కు సరుకులు అప్పులు ఇచ్చిన పలువురు వ్యాపారులు శుక్రవారం మెప్మా నిర్వహణ కమిటీ సభ్యులు శుక్రవారం స్థానిక గీతామందిరంలో సమావేశం అయినట్లు తెలుసుకుని అక్కడకు వచ్చి తమ అప్పుల పరిస్థితి ఏమిటని నిలదీశారు. అధికారులు అందుబాటులో లేకపోవటంతో ఈ విషయాన్ని వారి దృష్టికి తీసుకుపోతామని కమిటీ సభ్యులు హామీ ఇచ్చారు.

వీఆర్‌కు చీరాల డీఎస్పీ ప్రసాద్

చీరాల, జూలై 5: చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్‌ను వీఆర్(వేకెన్సీ రిజర్వ్‌డ్)కు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం అందుకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రసాద్ గతంలో 2019 ఎన్నికల సమయంలో చీరాలలో సీఐగా పనిచేశారు. అతరువాత 2024 ఎన్నికలకు ముందుకు డీఎస్పీగా చీరాల వచ్చారు. తాజా ఉత్తర్వులతో ఆయన వీఆర్‌కు వెళుతున్నారు.

టీడీపీ నేతపై కానిస్టేబుల్ దాడి

చీరాలటౌన్, జూలై 5: టీడీపీ నాయకుడిపై దాడికి పాల్పడిన కానిస్టేబుల్‌తో పాటు మరో ఆరుగురిపై చీరాల టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేటపాలెం మండలం పందిళ్లపల్లికి చెందిన టీడీపీ నేత నక్కల వెంకటరమణారావుకు ఈపూరుపాలెం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ బాలుయాదవ్‌కు స్వల్ప వివాదాలు ఉన్నాయి. ఈక్రమంలో గురువారం టీడీపీ కార్యాలయం నుంచి బయటకు వస్తున్న రమణారావుపై బాలు యాదవ్ మరో ఆరుగురు దాడి చేశారు. దీంతో బాధితుడు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి విరాళం

పర్చూరు, జూలై 5: పర్చూరులోని వైజంక్షన్‌లో రూ.2కోట్ల వ్యయంతో శ్రీఅభయాంజనేయస్వామి విగ్రహంతో రూపుదిద్దుకున్న ఆలయ అభివృద్ధికి తిమ్మసముద్రం గ్రామానికి చెందిన ప్రవాసాంధ్రుడు, జనసేన నాయకుడు మన్నెం శ్రీకాంత్, వారి కుటుంబసభ్యులు రూ.40లక్షల విరాళం ప్రకటించి దాతృత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయనను ఘనంగా సత్కరించారు. దేవస్థాన ప్రాంగణంలో వంటశాల భవనం, పూజారి, వాచ్‌మన గదుల నిర్మాణం కోసం విరాళాన్ని ప్రకటించినట్లు ఆయన తెలిపారు. శ్రీకాంత్‌కు కమిటీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

వైసీపీ కౌన్సిలర్ల చెరలో ప్రభుత్వ స్థలాలు

గత ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా ఆక్రమణలు

కాశిరెడ్డికాలనీ వద్ద రూ.కోట్లాది విలువైన భూముల కబ్జా

చుట్టూ ప్రహరీ గోడల నిర్మాణం

పట్టించుకోని అధికారులు



ఒంగోలు రోడ్డులోని కాశిరెడ్డి కాలనీ వద్ద ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి నిర్మించిన ప్రహరీలు



హైవే వెంట వాగు స్థలాన్ని ఆక్రమించి నిర్వహిస్తున్న హోటల్

కనిగిరి, జూలై 5: కనిగిరి ప్రాంతంలో గత ప్రభుత్వంలో ప్రభుత్వ పోరంబోకు, వాగులు, వంకలకు చెందిన కోట్లాది రూపాయల విలువైన భూములను వైసీపీ కౌన్సిలర్లు ఆక్రమించారు. వైసీపీ అధికారం కోల్పోయినప్పటికీ ఆయా పార్టీ నేతల హవా మాత్రం కొనసాగుతూనే ఉంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కనిగిరి ఏమూల చూసినా సదరు నేతల భూ దాహానికి ప్రభుత్వానికి చెందిన ఎన్నో విలువైన భూములు కబ్జాకు గురయ్యాయి. అధికార ప్రాబల్యంతో ఐదేళ్ల ఇష్టారాజ్యంగా ప్రభుత్వ భూములు ఆక్రమించి వైసీపీ నేతలు దురాగతాలకు పాల్పడినా ప్రశ్నించి చర్యలు తీసుకునే అధికారులు వారిచ్చే మాముళ్ళకు కక్కుర్తి పడి వత్తాసు పలికారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కాశిరెడ్డి కాలనీ వద్ద భూముల కబ్జా

గత వైసీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ వాగు, వంక, కొండ పోరంబోకు భూములపై కన్నేసిన వైసీపీ కౌన్సిలర్లు పట్టణంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న సదరు భూములను ఆక్రమించారు. రికార్డులను తారుమారు చేసి పక్కాగా పాగా వేశారు. మాజీ ఎమ్మెల్యే అండదండలు ఉండటంతో పాటు అధికారుల ప్రసన్నం కూడా వారికి కలిసొచ్చింది. దీంతో ప్రభుత్వ భూమి కనపడితే పాగా వేసేశారు. అందులో భాగంగా కనిగిరి పట్టణ సమీపంలోని కాశిరెడ్డి కాలనీ వద్ద ప్రధాన హైవే మార్గం వెంబడి ఉన్న ప్రభుత్వ భూములను కబ్జా చేసి వాటి చుట్టూ ప్రహరి గోడలు నిర్మించారు. కొంతమంది ఏకంగా ఎకరాలకు ఎకరాలు వాగు భూములను ఆక్రమించి హైవే రోడ్డు ఎత్తువరకు మెరక పోసి హోటళ్ల నిర్వహిస్తున్నారు.

చోద్యం చూస్తున్న అధికారులు

ఇటీవల ఎన్నికల్లో పరాజయం పాలయినా వైసీపీ నేతలు, కౌన్సిలర్లలో అధికార దాహం వీడలేదు. వీరికితోడు అధికారుల్లో కూడా ఆపార్టీ వాసన వీడలేదు. దీంతో వైసీపీ ప్రభుత్వంలో కౌన్సిలర్లు, నేతలు చేసిన భూ ఆక్రమణలపై చర్యలు తీసుకునేందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇదేతంతు కొనసాగితే ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుతోపాటు కనిగిరి అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రభుత్వ భూముల ఆక్రమణలపై దృష్టి సారించి వాటని స్వాధీనం చేసుకుని కనిగిరి అభివృద్ధికి చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

ఉత్కంఠగా తాళ్లూరు మండల సమావేశం

బూచేపల్లి వెంట వైసీపీ శ్రేణులు

అప్రమత్తమైన టీడీపీ ఎంపీపీ

అండగా వచ్చిన అధికార టీడీపీ శ్రేణులు

భారీగా పోలీసుల మోహరింపు

ఎక్కువ మంది అధికారుల గైర్హాజరు



వైస్ ఎంపీపీని సభావేదిక నుంచి కిందకు వెళ్లాలంటూ సూచిస్తున్న ఎంపీడీవో

తాళ్లూరు, జూలై 5: తాళ్లూరు మండలపరిషత్ సభ్యసమావేశానికి జిల్లాపరిషత్ చైర్‌పర్సన్, దర్శి ఎమ్మెల్యే రావటంతో శుక్రవారం ఉత్కంఠ నెలకొంది. ఎన్నికల ముందు వైసీపీని వీడి టీడీపీలోకి చేరిన అధికార టీడీపీ ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అప్రమత్తమై సమావేశం సజావుగా నిర్వహించటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వైసీపీ జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి సమావేశానికి హాజరుకాలేదు. రెండు పర్యాయాలు జడ్పీటీసీగా ఉండి వైసీపీలో కీలక పాత్ర పోషిస్తూ ఏనాడు మండల సర్వసభ్యసమావేశానికి దూరంగా ఉండని జడ్పీటీసీ మారం ఈ సమావేశానికి దూరంగా ఉండటం చర్చనీయాంశమైంది. జడ్పీచైర్‌పర్సన్, ఎమ్మెల్యే మొదటిసారి మండల సమావేశానికి వస్తూ ముందస్తు సమాచారం ఇవ్వకుండా వారి పర్యటన షెడ్యూల్ ప్రకటించటంతో అసంతృప్తి చెంది సమావేశానికి గైర్హాజరయినట్లు సమాచారం. రెండో వైస్‌ఎంపీపీ సమావేశానికి దూరంగా ఉన్నారు. బూచేపల్లి వర్గీయులు ముందుగా తాళ్లూరులోని వైసీపీ కార్యాలయానికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అప్రమత్తయ్యారు. మండలంలోని అన్నిగ్రామాలకు చెందిన టీడీపీ నేతలు, శ్రేణులు ఉదయం 10గంటల సమయంలో ఎంపీపీ చాంబర్‌కు చేరుకున్నారు. 11.30 వరకు ఎంపీపీ తన చాంబర్‌లో వేచి ఉన్నారు. గంటన్నర ఆలస్యంగా ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి వెంట ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ శ్రేణులు ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నారు. దీంతో ఏమిజరుగుతుందోనని అందరూ ఉత్కంఠగా ఎదురు చూశారు. ఎస్సై విజయ్‌కుమార్ పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యే బూచేపల్లి వెంట ఎంపీటీసీ, సర్పంచ్‌లను మాత్రమే సమావేశంహాలులోకి పంపారు. తదుపరి మండల పరిషత్ సమావేశానికి వచ్చిన ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అధ్యక్షత వహించి సంప్రదాయాలు, నిబంధనల మేరకు సమావేశం నిర్వహిస్తామని, బయట వ్యక్తులకు, ప్రజాప్రతినిధుల గన్‌మెన్‌లకు లోనికి ప్రవేశం లేదని పంపించి వేశారు. గతంలో మాదిరిగా వైస్ ఎంపీపీ ఐ.వెంకటేశ్వరరెడ్డి సభా వేదిక మీదుగా ఉండగా ప్రొటోకాల్ మేరకు ఉండాల్సిన వారినే వేదికపై ఉంచాలని, మిగిలిన వారిని సభ ముందు సీట్లలోకి పంపాలని ఎంపీడీవోకు సూచించారు. దీంతో జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, సభ్యులు నివ్వెరపోయారు. గతంలో వేదిక మీద కూర్చోనిచ్చారుగా ఇంతలోనే ఏమి మార్పు వచ్చిందని వైస్ ఎంపీపీ వెంకటేశ్వరెడ్డి ఎంపీపీని ప్రశ్నించారు. గతంలో ఇష్టమైంది, ఇప్పుడు ఇష్టం కాలేదు అంటూ నిర్మోహమాటంగా చెప్పటంతో చేసేదిలేక వైస్‌ఎంపీపీ వేదిక ముందు సీట్లో కూర్చొన్నారు. అయితే మండల స్థాయి అధికారులు కేవలం నలుగురు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. అందరూ సమావేశానికి తమకు ఆరోగ్యం బాగోలేదని, రాలేమని తమకు ముందస్తు సమాచారం ఇచ్చారని ఎంపీపీ సమావేశంలో వెల్లడించటం గమనార్హం.సమావేశం ప్రారంభం నుంచి ముగిసేవరకు ఎస్సై తన సిబ్బందితో హాలు బయట విధులు నిర్వహించారు.సమావేశం ముగిసేవరకు టీడీపీ,వైసీపీ శ్రేణులు అధిక సంఖ్యలో కార్యాలయం వద్ద వేచిఉన్నారు. సమావేశం ప్రశాంతంగా ముగియటంతో ఉత్కంఠకు తెరపడింది.

టీడీపీ నాయకులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

● హోంమంత్రికి ఎమ్మెల్యే ఏలూరి వినతి



హోంమంత్రి అనితను కలిసి సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు, జూలై 5: గత ప్రభుత్వ హయాంలో పెట్టిన అక్రమ కేసుల ఉపసంహరణకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హోంశాఖ మంత్రి వంగలపూడి అనితను కోరారు. శుక్రవారం విజయవాడలోని హోంమంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా గత ప్రభుత్వ హయాంలో టీడీపీ నాయకులపై పెట్టిన అక్రమ కేసులు, పోలీస్ స్టేషన్ల అధునికీకరణ, నూతన వాహనాలు, నూతన అగ్నిమాపక కేంద్రం, ఎస్సీ, ఎస్టీ కేసులు, ఫాం 7 సుల పురోగతి తదితర అంశాలపై చర్చించారు. ప్రధానంగా రాజధానిగా అమరావతి కొనసాగించాలని అమరావతి రైతులు 2021 నవంబర్‌లో శాంతియుతంగా చేపట్టిన పాదయాత్ర సందర్భంగా పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించాలని కోరారు. అలాగే, పర్చూరు నియోజకవర్గంలో గుంటూరు చానల్ పొడిగించాలని దీక్ష చేపట్టిన నల్లమడ రైతులపై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలని మంత్రికి వివరించారు. వైసీపీ నేతలు అడ్డదారిలో తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుల ఓట్ల తొలగింపునకు తన నియోజకవర్గంలో వందల సంఖ్యలో ఫాం 7 దరఖాస్తులు చేసిన విషయాన్ని హోం మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అక్రమమార్గంలో ఓట్ల తొలగింపునకు కుట్రపన్నిన వారిపై ఎలాంటి విచారణ జరపకుండా నీరుకార్చిన తీరుపై విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేలా ఆదేశించాలని మంత్రిని ఏలూరి కోరారు. మార్టూరులో గ్రానైట్ వ్యాపారులపై అప్పటి అధికార పార్టీ ఒత్తిడితో పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఉపసంహరించు కోవాలన్నారు. ఎన్నికల సమమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలపై పెట్టిన ఎస్సీ, ఎస్టీ కేసులను సమీక్షించాలన్నారు. పర్చూరులో అగ్నిమాపక కేంద్రం, నూతన సబ్ డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. మార్టూరు, యద్దనపూడి మండలాలను మార్టూరు సర్కిల్‌గా, పర్చూరు, కారంచేడు మండలాలను పర్చూరు సర్కిల్‌గా, ఇంకొల్లు, చిన్నగంజాం మండలాలను ఇంకొల్లు సర్కిల్‌గా ఏర్పాటు చేసేలా చొరవ చూపాలన్నారు. మార్టూరు అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్‌ను సాధారణ స్టేషన్‌గా మార్చాలని పేర్కొన్నారు. నేషనల్ హైవే పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్లను మోడల్ స్టేషన్లుగా తీర్చిదిద్దాలని, ఆధునిక సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఏలూరి మంత్రిని కోరారు.

షుగర్ వ్యాధిగ్రస్తులకు దివ్యౌషధం నేరేడు కాయలు

కిలో రూ.150 నుంచి రూ.200

పలుకుతున్న వైనం



పామూరు , జూలై 5 ; ఔషధ గుణాలు కలిగిన నేరేడు కాయలు షుగర్ వ్యాధిగ్రస్తులకు దివ్య ఔషధం లాంటిది. వర్షరుతువు ఆరంభంలో దిగుబడి వచ్చే నేరేడు ఏడాదికి ఒక్కసారైనా తినాలనేది నానుడి. పులుపు, తీపి, వగరు, రుచులతో అందరి నోళ్ళు ఊరిస్తున్నాయి. సి విటమిన్ పుష్కలంగా ఉండే నేరేడు చక్కెర వ్యాధిగ్రస్తులకు దివ్య ఔషధంలా పనిచేయడమే కాకుండా శరీరంలోని మలినాలను, శుభ్రపరిచే గుణంతో పాటు, జీర్ణ ప్రక్రియకు కూడా నేరేడు పండు దోహదపడే గుణం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. సామాన్యుల నుంచి సంపన్నుల వరకు ఇష్టపడేది నేరేడు పండ్లు గ్రామాల్లో నాడు విరివిరిగా లభించేది. బెంగళూరు, కడప, చీరాల, మదనపల్లి, ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారులు నేరేడు కాయలను కొనుగోలు చేసుకోని పామూరులో కేజీ 150 నుంచి రూ. 200 వరకు విక్రయిస్తున్నారు. ఒకప్పుడు పల్లె ప్రాంతాల్లో విరివిరిగా లభించే నేరేడు పండ్లు ప్రకృతి వైపరీత్యాల్యతో కనుమరుగుతున్నాయి. డబ్బులు పెట్టి కొనాలన్న దొరకని పరిస్థితి నేడు ఏర్పడింది. ఏటేటా వర్షాభావ పరిస్థితులు, మానవుని స్వార్థ చింతన రియల్ ఎస్టేట్ ప్రభావంతో నేరేడు చెట్లు అంతరించి పోతున్నాయి. హైబ్రిడ్ రకం మొక్కలను తెచ్చి రైతులు పండ్ల తోటల మాదిరిగా నేరేడును సాగుచేస్తున్నారు. నేరేడుకు మార్కెట్‌లో డిమాండ్ ఉండటంతో ఇటీవల గ్రామీణ ప్రాంతాల్లో హైబ్రిడ్ సాగు వైపు రైతులు దృష్టి సారిస్తున్నారు. మార్కెట్‌లో అక్కడక్కడ లభించే హైబ్రిడ్ నేరేడు ధర మాత్రం ఎక్కువగా ఉండటంతో సామాన్యుడు కొనలేకపోతున్నాడు. ఇతర ప్రాంతాల నుంచి అధిక రేటు పెట్టి అమ్ముతున్నామని అయిన కూలీ గిట్టుబాటు కావడం లేదని అమ్మకందారులు వాపోతున్నారు. ధర ఎంతైనా ఏడాది కొకసారి అయిన నేరేడు కాయలను కొనుగోలు చేసి తినాల్సిందేనని వినియోగదారులు అంటున్నారు.

ఆరోగ్య ప్రయోజనాలు

సీజన్‌లో లభించే నేరుడు పండ్లు తీసుకోవడం అనేక ఆరోగ్య సమస్యలకు చెక్ పెట్టవచ్చునని కంభాలదిన్నె ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ గద్దె ఏడుకొండల అన్నారు. హిమోగ్లోబిన్ శాతాన్ని పెంచేందుకు నేరేడు కాయలు ఉపయోగపడతాయని, శరీరంపై గాయమైన చోట నేరేడు చెట్టు ఆకును ఉంచి కట్టుకడితే త్వరగా నయం అవుతుందని, గింజలను కాల్చి పొడిచేసి నీటిలో కలిపి తాగితే సుగర్ వ్యాధి అదుపులో ఉంచుతుందని, నోటి పూత చిగుళ్ల వ్యాధులు, దంతక్షయం, నుంచి ఉపశమనం కలుగుతుందని, కడుపులో నులిపురుగులను నివారించడం తోపాటు, క్యాన్సర్ కు ఔషధంగా పనిచేస్తుందని తెలిపారు. అలాగే రోగనిరోధక శక్తి పెంచుతుందని తెలిపారు.

నీటి సరఫరాలో నిలువు దోపిడీపై ఫిర్యాదు

కుంకలమర్రు(పర్చూరు), జూలై 5: కారంచేడు మండలం కుంకలమర్రు గ్రామంలో మంచినీటి సరఫరాలో దోపిడి జరిగిందని టీడీపీ నాయకుడు కొల్లా సుబ్బారాయుడు ఆరోపించారు. ఇందుకు సంబంధించి గ్రామస్థుల లిఖితపూర్వక ఫిర్యా దును శుక్రవారం బాపట్లలో కలెక్టర్‌కు అందజేశారు. సర్పంచ్‌తోపాటు పంచాయతీ కార్యదర్శి, సీనియర్ అసిస్టెంట్, వైసీపీ నాయకులు జువ్వా శివరాంప్రసాద్ అవినీతికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామంలోని వాటర్‌ప్లాంట్ పనిచేయక పోవడంతో దానిని బాగు చేయకుండా శివరాంప్రసాద్ జువ్వా చారిటబుల్ ట్రస్ట్ పేరుతో మరో వాటర్ ప్లాంట్‌ను నెలకొల్పినట్లు తెలిపారు. దీనికి నీటి సరఫరా చేసేందుకు నెలకు రూ.25వేలు పంచాయతీకి ఇచ్చేవిధంగా ఒప్పందం కుదుర్చుకుని, నాలుగు నెలల అనంతరం మరో తీర్మానం చేసినట్టు చెప్పారు. 2023 జనవరి 1 నుంచి 2037 డిసెంబరు 1 వరకు 15 ఏళ్లపాటు ట్రస్ట్ ఏడాది రూ.25వేలు చెల్లించేలా తీర్మానం చేశారని ఆరోపించారు. దీనిని రద్దుచేసి పాత వాటర్‌ప్లాంట్‌ను పునరుద్ధరించాలని కలెక్టర్‌ను ఆయన కోరారు.

కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య

ముండ్లమూరు, జూలై 5 : మండలంలోని సింగనపాలెం గ్రామానికి చెందిన పీ బ్రహ్మనాయుడు(35) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. సింగనపాలెం రజక వీధికి చెందిన బ్రహ్మనాయుడు పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం కొండలరాయుడుపాలెం గ్రామంలో తన అత్తగారి ఇంటికి వెళుతున్నానని చెప్పి ఒక చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బ్రహ్మనాయుడు చని పోవటానికి కారణం కుటుంబ కలహాలని తెలిసింది. మృతి చెందిన బ్రహ్మనాయుడుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముండ్లమూరు, జూలై 5 : మండలంలోని నాయుడుపాలెం గ్రామానికి చెందిన బద్రి శ్రీకాంత్‌రెడ్డి(34)ఎలుకల మందు తిని నాలుగు రోజుల నుంచి ఒంగోలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. ఆ బాధ తట్టుకోలేక పోలవరం సమీపంలోని ఒక రేకుల షెడ్డులో ఎలుకల మందు తిని అపస్మారక స్థితికి వెళ్ళాడు. కుటుంబసభ్యులు విషయం తెలుసుకొని వెంటనే ఒంగోలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందాడు. ఎస్ఐ ఆంజనేయులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దర్శి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య, ముగ్గురు ఆడ పిల్లలు ఉన్నారు.

మానసిక స్థితి సరిగా లేక..

ముండ్లమూరు, జూలై 5 : పసుపుగల్లు గ్రామానికి చెందిన నలదిమ్మి వెంకటేశ్వర రెడ్డి(40) అనే వ్యక్తి గత కొన్ని రోజుల నుంచి మానసిక స్థితి సరిగా లేక గురువారం సాయంత్రం పురుగుల మందు తాగి మృతి చెందారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దర్శి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

నేడు రేబిస్ వ్యాక్సినేషన్

సింగరాయకొండ, జూలై 5 : ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా శనివారం స్థానిక ప్రభుత్వ పశువైద్యశాలలో రేబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పశువైద్యులు నగళ్ల హజరత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెంపుడు కుక్కలకు విధిగా వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తామని చెప్పారు.

పంట కాలువల అభివృద్ధి పట్టదా ?

- మరమ్మతులను పట్టించుకోని అధికారులు
- కట్టలపై అక్రమ కట్టడాలు
- సాగుకు దూరమవుతున్న రైతులు


ప్లాస్టిక్ వ్యర్థాలతో పేరుకుపోయిన కాలువ

కంభం, జూలై 5 : ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. పంట కాలువలు, కాలువల మరమ్మతులు, అభివృద్ధి లేకపోవడంతో చెరువుకు నీరు వచ్చినా రైతులు వరిసాగుకు దూరమవుతున్నారు. పెద్దకంభం కాలువలను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయకపోవడంతో చిల్లచెట్లతో నిండిపోయాయి. నక్కలగండి కెనాల్, పట్టణ నడిబొడ్డు నుంచి వెళ్లే ప్రధాన పంట కాలువలు, పాపాయిపల్లె సప్లైఛానల్, గృహాల నుంచి వచ్చే మురుగునీరు, చెత్తాచెదారం చేరి పూడిపోయాయి. ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి కంపుకొడుతున్నాయి. చెరువు నీరు కాలువలకు వదిలినా పొలాలకు నీరు సరఫరా కావడం లేదు. ఇరిగేషన్ అధికారులు ప్రధాన పంట కాలువల్లో సగం వరకే పూడిక తీయించారు. కాలువల్లోని సిమెంటు పెచ్చులూడిపోయాయి. తూముల వద్ద తుప్పుపట్టి పనికిరాకుండా పోయాయి. దీంతో నీరు వదిలితే వృథాగా పక్కదారి పోతున్నాయి. రావిపాడు, ఔరంగబాద్, కందులాపురం, ఎల్.కోట, లింగోజీపల్లి, నడింపల్లి తదితర గ్రామాలకు వెళ్లే 650 ఎకరాలను బీళ్లుగా వదిలి వేశామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్దకంభం కాలువ పొడవు 7.2 కిలోమీటర్లు కాగా దీని కింద 2089 ఎకరాల ఆయకట్టు, చిన్నకంభం కాలువ పొడవు 8.81 కిలోమీటర్లు కాగా దీని కింద 2062 ఎకరాలు, చీతిరాల కతువ కాలువ పొడవు 10 కిలోమీటర్లు కాగా దీని కింద 1904 ఎకరాలు, నక్కలగండి కాలువ పొడవు 2.50 కిలోమీటర్లు కాగా దీని కింద 160 ఎకరాలు, పాపాయిపల్లె కాలువ పొడవు 2.40 కిలోమీటర్లు కాగా దీని కింద 229 ఎకరాలు ఎకరాల ఆయకట్టు సాగవుతుంది. ఇప్పటికే ఇరిగేషన్ అధికారులు ఈ కాలువల మరమ్మతులకు పూడికతీతకు ప్రత్యేక నిధులు కేటాయించి బాగు చేయించాలని రైతులు కోరుతున్నారు.


నక్కలగండి ప్రధాన కాలువలో పెరిగిన చిల్లకంప చెట్లు

ఇరిగేషన్ డీఈ వివరణ

కాలువల మరమ్మతులో జరుగుతున్న జాప్యంపై ఇరిగేషన్ డీఈ జాకీర్‌హుస్సేన్‌ను వివరణ కోరగా గత ప్రభుత్వ కాలంలో నిధుల లేమి కారణంగా మరమ్మతులు చేపట్టలేక పోయామన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలోని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

నాగుపాము కలకలం

గిద్దలూరు, జూలై 5 : రాచర్ల మండలం సోమిదేవిపల్లి గ్రామంలో నాగుపాము కలకలం సృష్టించింది. వీధుల్లో అటూ ఇటూ తిరుగుతుండగా ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పక్కనే ఉన్న ఒక ఇంట్లోకి నాగుపాము దూరడంతో గ్రామస్థులు అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫారెస్టు రెస్క్యూ టీమ్ సిబ్బంది వచ్చి నాగుపామును పట్టుకొని సమీప అడవిలో వదలడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

లారీలో అగ్ని ప్రమాదం

- రూ.1.90 లక్షలు ఆస్తినష్టం

పెద్ద దోర్నాల, జులై 5: ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో లారీ క్యాబిన్ కాలిపోయిన ఘటన మండల కేంద్రంలోని భారత్ పెట్రోలు బంకు సమీపంలో శుక్రవారం చోటుచేసుకొంది. దోర్నాలకు చెందిన షేక్ సిలార్‌షా తన లారీని స్థానిక భారత్ పెట్రోలు బంకు సమీపంలో నిలిపి క్యాబిన్‌లో చిన్నపాటి మరమ్మత్తులు నిర్వహించుకొని వెళ్లారు. కొద్దిసేపటికి ఉన్నట్లుండి క్యాబిన్‌లో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే అప్పటికే క్యాబిన్‌లో చాలా భాగం కాలిపోయింది. సుమారు రూ1,90,000లు ఆస్తినష్టం జరిగినట్లు అగ్నిమాపక కేంద్రం అధికారి పాండురంగారావు తెలిపారు.

భారీగా రేషన్ బియ్యం పట్టివేత

- నారు బాలవెంకటరెడ్డిపై 6ఏ కేసునమోదు


రేకులషెడ్‌లో నిల్వఉంచిన బియ్యం

ఎర్రగొండపాలెం, జూలై 5 : ఎర్రగొండపాలెం మండలం అయ్యంబొట్లపల్లి గ్రామం పొలాల్లో రేకులషెడ్‌లో అక్రమంగా నిల్వఉంచిన 121 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శుక్రవారం సాయంత్రం దాడులు నిర్వహించి ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పుల్లలచెరువు మండలం నాయుడుపాలెం గ్రామానికి చెందిన నారు బాలవెంకటరెడ్డి అక్కడ అక్రమంగా పీడీఎస్ బియ్యం నిల్వ ఉంచారని రెవెన్యూ అధికారులకు సమాచారం అందడంతో ఎన్‌ఫోర్సుమెంటు డీటీ జితేంద్రకుమార్, ఎర్రగొండపాలెం డిప్యూటీ తహసీల్దార్ యూ.విజయభాస్కర్, వీఆర్వో కే.రాంబాబు, వీఆర్ఏలు దాడుల్లో పాల్గొని బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యం నిల్వ ఉంచిన నారు బాలవెంకటరెడ్డిపై 6ఏ కేసు నమోదు చేశామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ జితేంద్రకుమార్ తెలిపారు. బియ్యాన్ని త్రిపురాంతకం ప్రభుత్వ గోడౌన్‌కు చేర్చినట్లు తెలిపారు.

జీవితంపై విరక్తితో వివాహిత ఆత్మహత్య

కంభం, జూలై 5 : జీవితంపై విరక్తితో వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం చోటుచేసుకొంది. కంభం ఎస్సై పులి.రాజేష్ కథనం ప్రకారం కంభం మండలం చిన్నకంభం గ్రామానికి చెందిన టి.అల్లూరమ్మ కూరగాయలు అమ్ముకుని కుటుంబాన్ని పోషిస్తోంది. భర్త తిరుపతి కుటుంబ విషయాలు పట్టించుకోకుండా నిత్యం మద్యంసేవించి తిరుగుతుండడంతో ఆవేదన చెందిన అల్లూరమ్మ శుక్రవారం ఉదయం కుటుంబ పరిస్థితి, పిల్లలపై దృష్టి పెట్టాలని భర్తకు నచ్చచెప్పేందుకు ప్రయత్నించింది. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య వాదన జరిగి భర్త తిరుపతి బయటకు వెళ్లిన సమయంలో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకొంది. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విత్తన దుకాణాల తనిఖీ

గిద్దలూరు, జూలై 5 : రాచర్ల మండలంలోని పలు విత్తన దుకాణాలను అంతర్జిల్లా తనిఖీ బృందం ప్రతినిధులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్ బిల్లులను, భౌతిక నిలువలను పరిశీలించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు చూపలేని రూ.2.78 లక్షల విలువైన విత్తన అమ్మకాలను నిలిపి వేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. హోల్‌సేల్ డీలర్ల నుంచి విత్తనాలు తీసుకొచ్చే సమయంలో తప్పనిసరిగా ఇన్‌వాయిస్, సోర్సాఫ్ సర్టిఫికెట్ తెచ్చుకోవాలన్నారు. రైతులకు అమ్మే సమయంలో బిల్లు ఇవ్వాలని తనిఖీ బృందం సభ్యులు సహాయ వ్యవసాయ సంచాలకులు ఏ.వెంకటరమణ, మండల వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్‌రఫిక్ తెలిపారు.

వ్యవసాయ మంత్రిని కలిసిన అశోక్‌రెడ్డి


అచ్చెన్నాయుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు అశోక్‌రెడ్డి, సాంబశివరావులు

గిద్దలూరు టౌన్, జూలై 5 : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరపు అచ్చెన్నా యుడిని గిద్దలూరు, పర్చూరు ఎమ్మెల్యేలు ముత్తుముల అశోక్‌రెడ్డి, ఏలూరి సాంబశివరావులు మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర సచివాలయంలోని అచ్చెన్నాయుడు కార్యాలయం వద్ద ఎమ్మెల్యేలు ముత్తుముల అశోక్‌రెడ్డి, ఏలూరి సాంబశివరావులు కలిసి శాలువ కప్పి బొకె అందజేశారు. రాష్ట్రమంత్రిగా ఎంపికైన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

ఐజీని కలిసిన అశోక్‌రెడ్డి, జనార్దన్

గుంటూరు రేంజ్ ఐజీ కార్యాలయంలో ఐజీ శ్రీ సర్వశ్రేష్ఠ త్రిపాటిని జిల్లా ఎమ్మెల్యేలు ముత్తుముల అశోక్‌రెడ్డి, దామచర్ల జనార్దన్‌లు మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు. వారి వెంట జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్ ఉన్నారు. ఓ పూలమొక్కను అందజేసి శాలువాతో సన్మానించారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

గిద్దలూరు టౌన్, జూలై 5 : నేడు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఉయ్యాల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని, సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి హాజరు కానున్నారని కమిషనర్ తెలిపారు.

ప్రత్యామ్నాయ ఉపాధి చూపించాలి

గిద్దలూరు, జూలై 5 : పారిశుధ్య కార్మికుల సమావేశం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించారు. పారిశుధ్య కార్మికుల సంఘం నాయకురాలు షేక్ సమీర మాట్లాడుతూ రద్దయిన పాఠశాలల్లో పనిచేస్తున్న పాఠశాల పారిశుధ్య కార్మికులను మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపించాలని కోరారు. సీఐటీయూ నాయకులు టి.ఆవులయ్య, బీనరసింహులు మాట్లాడుతూ ముండ్లపాడు డీఎస్‌టీ స్కూల్‌ను విద్యార్థులు లేక రద్దు చేయగా అందులో పని చేసే ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు బదిలీ చేశారని, కానీ పారిశుధ్య, మధ్యాహ్న భోజన పథకం కార్మికులను ముండ్లపాడు హైస్కూలులో ప్రత్యామ్నాయంగా చేర్చాలని డిమాండ్ చేశారు. ఈనెల 10వ తేదిన జరిగే డిమాండ్స్ డేలో కార్మికులందరూ పాల్గొనాలని కోరారు. సమావేశంలో కార్మిక సంఘం ప్రతినిధులు పుష్ప, జహీర, రాధ, తదితరులు పాల్గొన్నారు.

వేతనాల కోసం పంచాయతీ కార్మికుల ధర్నా

నాలుగవరోజు కొనసాగిన నిరసన


నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

కొమరోలు, జూన్ 5: కొమరోలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులు శుక్రవారం నాలుగవరోజు కడప-అమరావతి రాష్ట్రీయ రహదారిలో బైఠాయించారు. కొమరోలు మండల సీపీఎం నాయకురాలు అంజమ్మ, సీఐటీయూ గిద్దలూరు నాయకులు ఆవులయ్యలు స్వచ్ఛభారత్ కార్మికులకు అండగా నిలిచి వారికి సంఘీభావంగా వారితోపాటు ధర్నాలో కూర్చున్నారు. ఉదయం నుంచి కార్యాలయం ముందు ధర్నా చేశారు. అధికారుల నుంచి ఎలాంటి సమాచారం రాకపోవడంతో కార్మికులు రోడ్డుపైకి వచ్చారు. దీంతో ట్రాఫిక్ నిలిచి పోవడంతో కొద్దిసేపు ట్రాఫిక్ నిలిచింది. విషయం తెలుసుకున్న ఎంపీడీవో నరసింహారావు, ఎస్సై మాధవరావు, ఈఓపీఆర్‌డీ షరీఫ్‌లు కార్మికులకు ఎన్నిసార్లు సర్దిచెప్పినా ఫలితం లేక పోవడంతో జిల్లా పంచాయతీ అధికారి ఉషారాణికి ఫోన్ ద్వారా సమా చారం ఇవ్వడంతో వెంటనే కార్యదర్శి, సర్పంచ్‌లపై నివేదికను పంపాలని ఆదేశించారు. అనంతరం సీపీఎం నాయకురాలు పోసాని అంజమ్మతో డీపీవో మాట్లాడుతూ జీతాలను త్వరలో పెట్టిస్తామని చెప్పగా కార్మికులు వినకుండా రోడ్డుపై బైఠాయించారు. ఎంపీడీవో నరశింహారావుకు డీపీవో ఫోన్‌చేసి సర్పంచ్, కార్యాదర్శిలతో మాట్లాడానని 10నెలల జీతాలు వెంటనే ఇస్తున్నామని, వారంలోపు మిగిలిన బిల్లులు చెల్లిస్తామని కార్మికులకు తెలిపారు అందుకు స్వచ్ఛాభారత్ కార్మికులు సర్పంచ్ నుంచి లిఖితపూర్వక హామీ ఇస్తేనే నిరసన కార్యాక్రమాలు విరమిస్తామని ఎంపీడీవో, ఈఓపీఆర్‌డీలకు తెల్పి చెప్పారు.

రైతులకు అండగా పందిరి దొండసాగు

- ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం
- నికరాదాయంతో రైతుల ఆసక్తి

పెద్దదోర్నాల, జులై 5: ఏటా సాగు చేసే వాణిజ్య పంటలు పత్తి, మిరపలో అపార నష్టాల్ని చవిచూస్తున్న రైతులకు పందిరి దొండసాగు అండగా నిలుస్తోంది. ఒకసారి విత్తన మొక్కలు నాటితే మూడేళ్ల వరకు ఫలసాయాన్ని ఇచ్చే దొండసాగు పట్ల రైతులు మొగ్గు చూపుతున్నారు. అంతేగాక తెగుళ్ల బెడద పెద్దగా లేని కొద్ది పాటి నీటితడులతో నికరాధాయాన్నిస్తోంది. కూలీలు కూడా పెద్దగా అవసరం లేకుండానే ఇంటి మనుషులతోనే దిగుబడులు తీయొచ్చు. సీజను బట్టి ధరలు పెరుగుదలతో అధిక లాభాలు వస్తున్నాయి. దీంతో పందిరి దొండసాగు చిన్నసన్నకారు రైతులకు ఎంతగానో ఊతమిస్తోంది. పైగా ప్రభుత్వం కూడా ప్రోత్సాహాన్నిస్తూ పందిరి ఏర్పాటుకు రాయితీ ఇస్తోంది.


కాయలు కోస్తున్న కూలీలు

పందిరితో అధిక దిగుబడులు

దొండసాగుకు పందిరి ఖర్చు రైతులకు కొంచెం కష్టమనిపించినా మునుముందు సమస్య కాదు. ఎకరంలో దొండ సాగుకు పందిరి వేసేందుకు రూ.4లక్షలు ఖర్చవుతాయి. ప్రభుత్వం లక్ష రూపాయలు రాయితీ కల్పిస్తోంది. శాశ్వత పందిరి ఏర్పాటు వల్ల పంటలో తెగుళ్ల బెడద ఉండదు. తద్వారా దిగుబడులు పెరుగుతాయి. ఒకసారి నాటితే మూడేళ్ల వరకు పంట దిగు బడులు తీసుకోవచ్చు. వారం వారం కోతలు తీసుకోవచ్చు. కోతకు ఎకరానికి 5 క్వింటాలు దిగుబడులు వస్తాయని రైతులు తెలిపారు. సీజను బట్టి కిలో రూ.15లు నుండి రూ.25 వరకు మార్కెట్టులో కొనుగోలు చేసినా మంచి ఆదాయం లభిస్తుందని చెబుతున్నారు. చిన్న సన్న కారు రైతులకు మరింత ఉపయుక్తంగా ఉంటుందని దొండసాగు రైతులు చెబుతున్నారు. మండలంలోని చిన్నదోర్నాల, తిమ్మాపురం, రామచంద్రకోట, బొమ్మలాపురం గ్రామాల్లో సాగు చేస్తున్నారు.


కోతలు చేసిన కాయలు

పాత స్తంభాలను తొలగించాలి

- మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు


మాట్లాడుతున్న కమిషనర్ టీవీ.రంగారావు

కనిగిరి, జూలై 5: మున్సిపాల్టీ పరిధిలో ఉన్న ప్రధాన రోడ్లలోని పాత స్తంభాలను తొలగించి వాటి స్థానంలో నూతనవి ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్ టీవీ రంగారావు పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో విద్యుత్, మున్సిపాల్టీ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆదేశాల మేరకు నగర సుందరీకరణలో భాగంగా పట్టణంలోని ఒంగోలు రోడ్డు, పామూరురోడ్డు, కందుకూరు రోడ్డు, చెప్పుల బజారు తదితర ప్రాంతాల్లో నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో విద్యుత్ డీఈ ఉమాకాంత్, ఏఈ పవన్ కుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, సచివాలయ ఎమినిటీ సెక్రటరీలు పాల్గొన్నారు.

టీచ్‌టూల్ ట్రైనింగ్ సెంటర్‌లో తనిఖీ


మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో చంద్రమౌళీశ్వర్

గిద్దలూరు టౌన్, జూలై 5 : పట్టణంలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న టీచ్ టూల్ ట్రైనింగ్ సెంటర్‌ను శుక్రవారం డిప్యూటీ డీఈవో ఎ.చంద్రమౌళీశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ట్రైనింగ్ జరుగుతున్న తీరును పరిశీలించారు. టీచ్ టూల్‌పై కొన్ని ప్రశ్నలకు జవాబు పాల్గొన్న ఉపాధ్యాయుల నుంచి అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. ట్రైనింగ్ సెంటర్‌లో వసతుల పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ గిరిధరశర్మ, మాస్టర్ ట్రైన ర్స్ బత్తిని వెంకటేశ్వర్లుగౌడ్, వాడకట్టు వెంకటరమణ ఉన్నారు.

మహిళా కళాశాలలో ఎంఎల్‌టీ కోర్సు ప్రారంభం

ఒంగోలు(విద్య), జూలై 5 : ఒంగోలులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరం నుంచి మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ(ఎంఎల్‌టి) డిగ్రీ కోర్సు ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి.కళ్యాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఈ కోర్సు ఉన్న ఏకైక కళాశాల తమదేనని పేర్కొన్నారు. బీఎస్సీ ఆనర్స్ కెమిస్ట్రీ, నాల్గవ సంవత్సరం కూడా అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. మూడు సంవత్సరాల డిగ్రీ కోర్సు పూర్తిచేసిన వారు ఈ కోర్సులో నాల్గవ సంవత్సరంలో నేరుగా చేరవచ్చు. ఇంటర్ ఎంపీసీ, బైపీసీ చదివిన వారు ఈ కోర్సు మొదటి సంవత్సరంలో చేరవచ్చు.

తాగునీటి బోర్లలో అడుగంటిన జలాలు


ట్యాంకర్ వద్ద నీళ్లు పట్టుకుంటున్న ప్రజలు

ఎర్రగొండపాలెం, జూలై 5: ఎర్రగొండపాలెం మండలంలో నెలరోజులుగా వర్షాలు కురవక పోవడంతో తాగునీటిబోర్లలో భూగర్భజలాలు అడుగంటాయి. తాగునీటికోసం గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పల్లె ప్రజల్లో గొంతుతడుపుకోవాలంటే ట్యాంకర్ల పైనే ఆధారపడుతున్నారు. మండలంలో 30 గ్రామాల్లో తాగునీటికోసం ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం కేవలం 11 గ్రామాల్లో నీటిసరఫరాకు 79 ట్యాంకర్లకు ప్రభుత్వం అనుమతించింది. ప్రభుత్వం సరఫరా చేస్తున్న ట్యాంకర్ల నీరు మండలంలో ప్రజల తాగునీటి అవసరాలకు సరిపోవడంలేదని ప్రజలు వా పోతున్నారు. ప్రస్తుతం ఉన్న తాగునీటి సమస్య తీరాలంటే నిత్యం 300 ట్యాంకర్లు నీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు. మండలంలోని గంజివారిపల్లె, అయ్యంబొట్లపల్లి, వీరభద్రాపురం, గంగుపల్లి గురిజేపల్లి, వాదంపల్లి, మురారిపల్లి, వెంకటాద్రిపాలెం, గుర్రపుసాల, గోళ్ల వీడపి గ్రామాల్లో తాగునీటి తీవ్రంగా ఉంది. జిల్లా కలెక్టరు అనుమతి ఇచ్చిన తమ్మడపల్లి గ్రామం లో 15 ట్యాంకర్లు, అమానిగుడిపాడు 15 ట్యాంకర్లు, గుర్రపుసాల14, చిన్నకొలుకుల 4,చెన్నరాయునిపల్లి 10, వాదంపల్లి 9, రేగులపల్లి 2, కాశికుంట తాండ 4, మెట్టబొడుతాండ, పిల్లికుంటతాండ 1, వేగినాటికోటయ్యనగర్ 9, మురారిపల్లె 15, , చిన్నబోయలపల్లి 10 ట్యాంకర్లు గ్రామీణ నీటిసరఫరా విభాగం తరుపున సర్పంచులు సరఫరా చేస్తున్నారు. గోళ్లవీడపిలో 3 రోజులకు ఒక పర్యాయం సాగర్‌పైపులైను నుంచి నీటి సరఫరా చేస్తుండడంతో అవి సరిపోవడం లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం సర్వే చేయించి తాగునీటి సమస్య ఉన్న గ్రామాలకు ట్యాంకర్లు ద్వారా నీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు. మండలంలో 11 గ్రామాలకు79 ట్యాంకర్లు ప్రభుత్వ అనుమతితో నీటిని సరఫరా చేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్ తెలిపారు.

అవీ.. ఇవీ..

దూపాడులో పారిశుధ్య వారోత్సవాలు


ర్యాలీ చేస్తున్న సర్పంచ్, అధికారులు

త్రిపురాంతకం, జూలై 5: మండలంలోని దూపాడు గ్రామంలో సర్పంచ్ ఎనిబెర అనూష ఆధ్వర్యంలో పారిశుధ్య వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక పాఠశాల విద్యార్థులతో కలిసి గ్రామంలోని ప్రధాన రహదారి నుంచి అన్ని వీధులలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ వచ్చేది వర్షాకాలమని ప్రతి ఒక్కరూ పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలని అన్నారు. విద్యార్థులు పాఠశాలలోని మరుగుదొడ్లను సక్రమంగా వినియోగించుకోవాలని, పాఠశాల ఆవరణలో మొక్కలను నాటాలని, దోమలను నివారించి డెంగ్యూ, మలేరియా వ్యాప్తి జరుగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, వెల్ఫేర్ అసిస్టెంట్, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి

పొదిలి, జూలై 5 : వాతావరణ మార్పుతో సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని అందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ శరత్‌చంద్ర అన్నారు. శుక్రవారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.. రానున్నది వర్షాకాలం కావడంతో డెంగ్యూ, మలేరియా, డయోరియా తదితర వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. అదేవిధంగా సికిల్‌సెల్ అనిమియా కూడా వస్తుందన్నారు. కనుక వీటిని దూరం చేసేందుకు ప్రతి ఒక్కరు కాచి చల్లార్చిన తాగునీటిని తీసుకోవాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇళ్లముందు పరిసర ప్రాంతాల్లో మురుగునీరు, వర్షపునీరు నిల్వలేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉంటే కిరోసిన్ చల్లాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా గాయత్రి మహాయజ్ఞం


గాయత్రి యజ్ఞంలో పూజలు చేస్తున్న మహిళలు

గిద్దలూరు, జూలై 5 : పట్టణంలోని గాయత్రి మాత దేవస్థానంలో శుక్రవారం గాయత్రి మహాయజ్ఞం నిర్వహిం చారు. భక్తులు సామూ హికంగా గాయత్రి మహాయజ్ఞంలో పాల్గొని పూజలు నిర్వహించారు. విశ్రాంత తెలుగు పండిట్ సూరం నారాయణరెడ్డి మాట్లాడుతూ మనిషి ఆధ్యాత్మిక జీవితం గడుపగలిగితే సవ్యమైన ఆలోచనలు కలుగుతాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పి.సాయికల్పనరెడ్డి, గాయత్రి పరివార్ సభ్యులు బచ్చు వెంకటేశ్వర్లు, ప్రసూన, వీరారెడ్డి, తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రతి విద్యార్థి దేశభక్తిని పెంపొందించుకోవాలి


సీతారామరాజు వేషధారణలో విద్యార్థులు

కొమరోలు, జులై 5: ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచే దేశభక్తిని పెంపొందించుకోవాలని ఎస్‌బీఎస్‌ఆర్‌ఎం పాఠశాలల కరస్పాండెంట్ బందుగుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక కొమరోలు ఎస్‌బీఎస్‌ఆర్‌ఎం ఎయిడెడ్ పాఠశాలలో శుక్రవారం అల్లూరి సీతారామరాజు 124వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే విద్యతోపాటు దేశభక్తిని పెంపోందించుకోవాల్సిన ఆవసరం ఎంతైనా ఉందన్నారు. అల్లూరి సీతారామరాజు దేశానికి చేసిన పోరాటాలను పద్యాలు, కథల ద్వారా వివరించారు. వారిని ఆదర్శంగా తీసుకుని భవిష్యత్తులో దేశం కోసం పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రేవతి, సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షునిగా సామంతపూడి


అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న సంస్థ సభ్యులు

పొదిలి, జూలై 5 :మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడిగా సామంతపూడి నాగేశ్వరరావు, కార్యదర్శిగా బండి అశోక్‌లను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంస్థ అభివృద్ధికి తగిన తోడ్పాటును అందించాలని సంస్థ సభ్యులు కోరారు. అదేవిధంగా తమకు ఇంతటి పెద్దబాధ్యతను అప్పగించినందుకు సంస్థ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారిరువురిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంస్థ జిల్లా అధ్యక్షులు కె యల్లమందారెడ్డి, ఛైర్మన్ మువ్వల పార్థసారధి, కన్వీనర్ కల్లం సుబ్బారెడ్డి, డైరెక్టర్లు జీసీ, యక్కలి శేషగిరి, యర్రెడ్డి, వినోద్, బాజీ, శ్రీకాంత్, శీదేవి, కరిముల్లాబేగ్ పాల్గొన్నారు.

నేటి నుంచి వారాహిదేవి నవరాత్రులు


ప్రత్యేక అలంకరణలో జగదాంబ

మార్కాపురం వన్‌టౌన్, జూలై 5: స్థానిక జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో జగదాంబ అమ్మవారి దేవస్థానంలో శనివారం నుంచి వారాహిదేవి నవరాత్రులు నిర్వహిస్తున్నట్లు ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి తెలిపారు. నవరాత్రులలో భాగంగా అమ్మవారికి నిత్యపూజలు, హోమాలు నిర్వహిస్తున్నామని భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించాలని తెలిపారు.

ప్రేమ మార్గమే సాయితత్వం


శివసాయిరామ్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

మార్కాపురం వన్‌టౌన్, జూలై 5: అందరిని ప్రేమించడమే సాయితత్వం అని గుంటూరుకు చెందిన ఆదిపూడి వెంకట శివసాయిరామ్ అన్నారు. స్థానిక నెహ్రూ బజార్‌లోని షిరిడీ సాయి మందిరంలో గురుపౌర్ణమి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం ఆధ్యాత్మిక ఉపన్యాసం నిర్వహించి శివసాయిరామ్ మాట్లాడుతూ.. బాబామార్గం ఆత్మజ్ఞానమార్గం అన్నారు. భగవంతుడు సర్వజీవులలో ఉన్నాడని, సకల ప్రాణులలో భగవంతునిని చూడటమే నిజమైన జ్ఞానం అని సాయి బోధించి ఆచరించారన్నారు. కార్యక్రమంలో మందిర అధ్యక్షులు సత్యనారాయణ, కార్యదర్శి హరిహరరావు, కోశాధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


మంత్రులు రామానాయుడు, నారాయణలతో డాక్టర్ లక్ష్మి దంపతులు

దర్శి అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలి

● మంత్రులను కలిసి కోరిన గొట్టిపాటి లక్ష్మి దంపతులు

దర్శి, జూలై 5 : దర్శి నియోజకవర్గ అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని రాష్ట్ర మంత్రులు పి. నారాయణ, ఎన్. రామానాయుడులను శుక్రవారం టీడీపీ దర్శి నియోజకవర్గ నాయకురాలు గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు కలిసి విజ్ఞప్తి చేశారు. తొలుత ఇరువురు మంత్రులకు బొకేలు అందించి అభినందనలు తెలిపారు. దర్శి నియోజకవర్గంలో మూలనపడ్డ సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి రామానాయుడుకు విజ్ఞప్తి చేశారు గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కనీస మరమ్మతులు చేయక సాగర్ కాలువలు అధ్వాన్నంగా మారాయని వివరించారు. మొగిలిగుండాల రిజర్వాయర్ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని, వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం వేగవంతం చేయాలని కోరారు. అనంతరం పురపాలక శాఖ మంత్రి నారాయణతో మాట్లాడుతూ దర్శి నగర పంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. గత వైసీపీ పాలనలో నగర పంచాయతీ చేశారే గాని పోస్టులు మంజూరు చేయకపోవటంతో పాలన కుంటుపడిందన్నారు. అన్ని పోస్టులు భర్తీ చేసి దర్శి పట్టణ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. అందుకు రాష్ట్ర మంత్రులు సానుకూలంగా స్పందించారని గొట్టిపాటి లక్ష్మి దంపతులు తెలిపారు.


పోలవరంలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో పద్మ

పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు

ముండ్లమూరు, జూలై 5 : గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు మెరుగైన చర్యలు చేపట్టాలని ఒంగోలు డివిజన్ డీఎల్‌పీవో కే పద్మ అన్నారు. ఆమె పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని పోలవరం, వేముల గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయతీ అధికారులు, ఏఎన్ఎంలతో కలసి గ్రామాల్లోని పలు వీధులను సందర్శించారు. గ్రామాల్లో మెరుగైన పారిశుధ్యం కోసం చర్యలు తీసుకోవాలన్నారు. వీధుల్లో పడవేసిన వ్యర్థ పదార్థాలను వెంటనే తొలగించి సమీపంలోని డంపింగ్ యార్డుల్లో పడ వేయాలన్నారు. పారిశుధ్యం లోపించి ప్రజలు వ్యాధుల బారిన పడితే మాత్రం సంబంధిత అధికారుల పై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధానంగా గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. గ్రామాలకు సరఫరా అవుతున్న ఎస్‌ఎపీ నీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. మురుగు కాలువల్లో పేరుకు పోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శులు మౌలాలి, వైద్య సిబ్బంది, సర్పంచ్‌లు గజ్జల సుబ్బారెడ్డి, నంబూరు ఏసు లీలమ్మ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

గురుకుల పాఠశాల పూర్తికి చర్యలు

● మున్సిపల్ చైర్మన్ గఫార్


ఎస్టీ గురుకల పాఠశాలను పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న చైర్మన్

కనిగిరి, జూలై 5: గిరిజన గురుకుల పాఠశాల పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే సహకారంతో చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ గఫార్ అన్నారు. కనిగిరి పట్టణ సమీపంలోని కందుకూరు రోడ్డులో అసంపూర్తిగా నిలిచిపోయిన గిరిజన గురుకుల పాఠశాల భవనాన్ని శుక్రవారం చైర్మన్ సందర్శించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఎంతో ఆధునాతన హంగులతో రూ. 8.75 కోట్లతో నిర్మాణం చేపట్టామన్నారు. పట్టణంలోని శివనగర్ కాలనీలో ఉన్న ఎస్టీ గురుకుల పాఠశాల వసతి గృహం అపరిశుభ్రంగా నెలకొని ఉండటంతోపాటు సదుపాయాల లేమితో కొట్టుమిట్టాడుతుందన్నారు. ప్రస్తుతం అసంపూర్తిగా ఉన్న ఎస్టీ గురుకుల పాఠశాల భవనం పూర్తిచేయించేందుకు అవసరమయ్యే విధి, విధానాలపై, నిధులపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి భవన నిర్మాణ పూర్తికి కృషి చేస్తామని చైర్మన్ చెప్పారు. చైర్మన్ వెంట ఎస్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గురుస్వామిరెడ్డి, కౌన్సిలర్ దేవరాజ్‌లు పాల్గొన్నారు.

ఏటీఎం ఎనీటైం మూత



మూతవేసిన ఏటీఎం

పామూరు, జూలై 5 ; పామూరు పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవస్థానం వద్ద ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం మూత పడి 2 సంవత్సరాలు గడుస్తోంది. బంగారం కొట్ల లైన్ కావడంతో వ్యాపారం ఎక్కువగా ఉంటుదనే ఉద్దేశంతో ఏటీఎం ఏర్పాటు చేశారు. అయితే రద్దీ కారణంగా తరుచూ మిషన్లు మరమ్మతులకు గురౌతున్నాయి. దాంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మిషన్లను మరమ్మతులు చేసే ఇంజనీర్లు కొరతగా ఉండటంతో సమయానికి చేయలేకపోతున్నామని బ్యాంక్ సిబ్బంది అంటున్నారు. పాత మిషన్ స్థానంలో కొత్త మిషన్ ఏర్పాటు చేసి ఇబ్బందులు తొలగించాలని ఖాతాదారులు కోరుతున్నారు.

వైసీపీ కౌన్సిలర్ల చెరలో ప్రభుత్వ స్థలాలు

గత ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా ఆక్రమణలు

కాశిరెడ్డి కాలనీ వద్ద రూ.కోట్లాది విలువైన భూములు కబ్జా

చుట్టూ ప్రహరీ గోడల నిర్మాణం

చోద్యం చూస్తున్న అధికారులు




ఒంగోలు రోడ్డులోని కాశిరెడ్డి కాలనీ వద్ద ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి నిర్మించిన ప్రహరీలు (ఇన్‌సెట్లో) హైవే వెంట వాగు స్థలాన్ని ఆక్రమించి నిర్వహిస్తున్న హోటల్

కనిగిరి, జూలై 5: కనిగిరి ప్రాంతంలో గత ప్రభుత్వంలో ప్రభుత్వ పోరంబోకు, వాగులు, వంకలకు చెందిన కోట్లాది రూపాయల విలువైన భూములను వైసీపీ కౌన్సిలర్లు ఆక్రమించారు. వైసీపీ అధికారం కోల్పోయినప్పటికీ ఆయా పార్టీ నేతల హవా మాత్రం కొనసాగుతూనే ఉంది. గత ఐదేళ్ళ వైసీపీ పాలనలో కనిగిరి ఏమూల చూసినా సదరు నేతల భూ దాహానికి ప్రభుత్వానికి చెందిన ఎన్నో విలువైన భూములు కబ్జాకు గురయ్యాయి. అధికార ప్రాబల్యంతో ఐదేళ్లు ఇష్టారాజ్యంగా ప్రభుత్వ భూములు ఆక్రమించి వైసీపీ నేతలు దురాగతాలకు పాల్పడినా ప్రశ్నించి చర్యలు తీసుకునే అధికారులు వారిచ్చే మాముళ్ళకు కక్కుర్తి పడి వత్తాసు పలికారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కాశిరెడ్డి కాలనీ వద్ద భూములు కబ్జా

గత వైసీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ వాగు, వంక, కొండ పోరంబోకు భూములపై కన్నేసిన వైసీపీ కౌన్సిలర్లు పట్టణంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న సదరు భూములను ఆక్రమించారు. రికార్డులను తారుమారు చేసి పక్కాగా పాగా వేశారు. మాజీ ఎమ్మెల్యే అండదండలు ఉండటంతో పాటు అధికారుల ప్రసన్నం కూడా వారికి కలిసొచ్చింది. దీంతో ప్రభుత్వ భూమి కనపడితే పాగా వేసేశారు. అందులో భాగంగా కనిగిరి పట్టణ సమీపంలోని కాశిరెడ్డి కాలనీ వద్ద ప్రధాన హైవే మార్గం వెంబడి ఉన్న ప్రభుత్వ భూములను కబ్జా చేసి వాటి చుట్టూ ప్రహరి గోడలు నిర్మించారు. కొంతమంది ఏకంగా ఎకరాలకు ఎకరాలు వాగు భూములను ఆక్రమించి హైవే రోడ్డు ఎత్తువరకు మెరక పోసి హోటళ్లు నిర్వహిస్తున్నారు.

చోద్యం చూస్తున్న అధికారులు

ఇటీవల ఎన్నికల్లో పరాజయం పాలయినా వైసీపీ నేతలు, కౌన్సిలర్లలో అధికార దాహం వీడలేదు. వీరికితోడు అధికారుల్లో కూడా ఆపార్టీ వాసన వీడలేదు. దీంతో వైసీపీ ప్రభుత్వంలో కౌన్సిలర్లు, నేతలు చేసిన భూ ఆక్రమణలపై చర్యలు తీసుకునేందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇదేతంతు కొనసాగితే ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుతోపాటు కనిగిరి అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారుతుంది. సంబంధిత అధికారులు ప్రభుత్వ భూముల ఆక్రమణలపై దృష్టి సారించి వాటని స్వాధీనం చేసుకుని కనిగిరి అభివృద్ధికి చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

ఉత్కంఠగా తాళ్లూరు మండల సమావేశం

బూచేపల్లి వెంట వైసీపీ శ్రేణులు

అప్రమత్తమైన టీడీపీ ఎంపీపీ

అండగా వచ్చిన అధికార పార్టీ శ్రేణులు

భారీగా పోలీసుల మోహరింపు

ఎక్కువ మంది అధికారులు గైర్హాజరు



వైస్ ఎంపీపీని సభావేదికనుంచి కిందకు వెళ్లమని సూచిస్తున్న ఎంపీడీవో

తాళ్లూరు, జూలై 5 : తాళ్లూరు మండలపరిషత్ సభ్యసమావేశానికి జిల్లాపరిషత్ చైర్‌పర్సన్, దర్శి ఎమ్మెల్యే రావటంతో శుక్రవారం ఉత్కంఠ నెలకొంది. ఎన్నికల ముందు వైసీపీని వీడి టీడీపీలోకి చేరిన అధికారపార్టీ టీడీపీ ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అప్రమత్తమై సమావేశం సజావుగా నిర్వహించటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వైసీపీ జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి సమావేశానికి హాజరుకాలేదు. రెండు పర్యాయాలు జడ్పీటీసీగా ఉండి వైసీపీలో కీలక పాత్ర పోషిస్తూ ఏనాడు మండల సర్వసభ్యసమావేశానికి దూరంగా ఉండని జడ్పీటీసీ మారం ఈ సమావేశానికి దూరంగా ఉండటం చర్చనీయాంశమైంది. జడ్పీచైర్‌పర్సన్, ఎమ్మెల్యే మొదటిసారి మండల సమావేశానికి వస్తూ ముందస్తు సమాచారం ఇవ్వకుండా వారి పర్యటన షెడ్యూల్ ప్రకటించటంతో అసంతృప్తి చెంది సమావేశానికి గైర్హాజరయినట్లు సమాచారం. రెండో వైస్‌ఎంపీపీ సమావేశానికి దూరంగా ఉన్నారు. బూచేపల్లి వర్గీయులు ముందుగా తాళ్లూరులోని వైసీపీ కార్యాలయానికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అప్రమత్తయ్యారు. మండలంలోని అన్నిగ్రామాలకు చెందిన టీడీపీ నేతలు, శ్రేణులు ఉదయం 10గంటల సమయంలో ఎంపీపీ చాంబర్‌కు చేరుకున్నారు. 11.30 వరకు ఎంపీపీ తన చాంబర్‌లో వేచి ఉన్నారు. గంటన్నర ఆలస్యంగా ఎమ్మెల్యే బూచేపల్లి వెంట ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పార్టీశ్రేణులు ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నారు. దీంతో ఏమిజరుగుతుందోనని అందరూ ఉత్కంఠగా ఎదురు చూశారు. స్థానిక ఎస్సై విజయ్‌కుమార్ పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యే బూచేపల్లి వెంట ఎంపీటీసీ,సర్పంచ్‌లను మాత్రమే సమావేశం హాలులోకి పంపారు. తదుపరి మండల పరిషత్ సమావేశానికి వచ్చిన ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అధ్యక్షత వహించి సంప్రదాయాలు, నిబంధనల మేరకు సమావేశం నిర్వహిస్తామని, బయట వ్యక్తులకు, ప్రజాప్రతినిధుల గన్‌మెన్‌లకు లోనికి ప్రవేశం లేదని పంపించి వేశారు. గతంలో మాదిరిగా వైస్ ఎంపీపీ ఐ.వెంకటేశ్వరరెడ్డి సభా వేదిక మీదుగా ఉండగా ప్రొటోకాల్ మేరకు ఉండాల్సిన వారినే వేదికపై ఉంచాలని, మిగిలిన వారిని సభ ముందు సీట్లలోకి పంపాలని ఎంపీడీవోకు సూచించారు. దీంతో జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, సభ్యులు నివ్వెర పోయారు. గతంలో వేదిక మీద కూర్చోనిచ్చారుగా ఇంతలోనే ఏమి మార్పు వచ్చిందని వైస్‌ఎంపీపీ వెంకటేశ్వరెడ్డి ఎంపీపీని ప్రశ్నించారు. గతంలో ఇష్టమైంది, ఇప్పుడు ఇష్టం కాలేదు అంటూ నిర్మోహమాటంగా చెప్పటంతో చేసేదిలేక వైస్‌ఎంపీపీ వేదిక ముందు సీట్లో కూర్చొన్నారు. అయితే మండల స్థాయి అధికారులు కేవలం నలుగురు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. అందరూ సమావేశానికి తమకు ఆరోగ్యం బాగోలేదని, రాలేమని తమకు ముందస్తు సమాచారం ఇచ్చారని ఎంపీపీ సమావేశంలో వెల్లడించటం గమనార్హం.సమావేశం ప్రారంభం నుంచి ముగిసేవరకు ఎస్సై తన సిబ్బందితో హాలు బయట విధులు నిర్వహించారు.సమావేశం ముగిసేవరకు టీడీపీ,వైసీపీ శ్రేణులు అధిక సంఖ్యలో కార్యాలయం వద్ద వేచిఉన్నారు.సమావేశం ప్రశాంతంగా ముగియటంతో ఉత్కంఠకు తెరపడింది.

షుగర్ వ్యాధిగ్రస్తులకు దివ్యఔషధం నేరేడు కాయలు



పామూరు , జూలై 5 ; ఔషధ గుణాలు కలిగిన నేరేడు కాయలు షుగర్ వ్యాధిగ్రస్తులకు దివ్య ఔషధం లాంటిది. వర్షరుతువు ఆరంభంలో దిగుబడి వచ్చే నేరేడు ఏడాదికి ఒక్కసారైనా తినాలనేది నానుడి. పులుపు, తీపి, వగరు, రుచులతో అందరి నోళ్ళు ఊరిస్తున్నాయి. సి. విటమిన్ పుష్కలంగా ఉండే నేరేడు చక్కెర వ్యాధిగ్రస్తులకు దివ్య ఔషధంలా పనిచేయడమే కాకుండా శరీరంలోని మలినాలను, శుభ్రపరిచే గుణంతో పాటు, జీర్ణ ప్రక్రియకు కూడా నేరేడు పండు దోహదపడే గుణం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. సామాన్యుల నుంచి సంపన్నుల వరకు ఇష్టపడేది నేరేడు పండ్లు గ్రామాల్లో నాడు విరివిరిగా లభించేవి. బెంగళూరు, కడప, చీరాల, మదనపల్లి, ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారులు నేరేడు కాయలను కొనుగోలు చేసుకొని పామూరులో కేజీ 150 నుంచి రూ. 200 వరకు విక్రయిస్తున్నారు. ఒకప్పుడు పల్లె ప్రాంతాల్లో విరివిరిగా లభించే నేరేడు పండ్లు ప్రకృతి వైపరీత్యాల్యతో కనుమరుగుతున్నాయి. డబ్బులు పెట్టి కొనాలన్న దొరకని సరిస్థితి నేడు ఏర్పడింది. ఏటేటా వర్షాభావ పరిస్థితులు, మానవుని స్వార్థచింతన రియల్ ఎస్టేట్ ప్రభావంతో నేరేడు చెట్లు అంతరించి పోతున్నాయి. హైబ్రిడ్ రకం మొక్కలను తెచ్చి రైతులు పండ్ల తోటల మాదిరిగా నేరేడును సాగుచేస్తున్నారు. నేరేడుకు మార్కెట్‌లో డిమాండ్ ఉండటంతో ఇటీవల గ్రామీణ ప్రాంతాల్లో హైబ్రిడ్ సాగు వైపు రైతులు దృష్టి సారిస్తున్నారు. మార్కెట్‌లో అక్కడక్కడ లభించే హైబ్రిడ్ నేరేడు ధర మాత్రం ఎక్కువగా ఉండటంతో సామాన్యుడు కొనలేకపోతున్నాడు. ఇతర ప్రాంతాల నుంచి అధిక రేటు పెట్టి అమ్ముతున్నామని అయిన కూలీ గిట్టుబాటు కావడం లేదని అమ్మకందారులు వాపోతున్నారు. ధర ఎంతైనా ఏడాదికొకసారి అయిన నేరేడు కాయలను కొనుగోలు చేసి తినాల్సిందేనని వినియోగదారులు అంటున్నారు.

నేరుడుతో ఆరోగ్య ప్రయోజనాలు

సీజన్‌లో లభించే నేరుడు పండ్లు తీసుకోవడం అనేక ఆరోగ్య సమస్యలకు చెక్ పెట్టవచ్చునని కంభాలదిన్నె ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ గద్దె ఏడుకొండల అన్నారు. హిమోగ్లోబిన్ శాతాన్ని పెంచేందుకు నేరేడు కాయలు ఉపయోగపడతాయని, శరీరంపై గాయమైన చోట నేరేడు చెట్టు ఆకును ఉంచి కట్టుకడితే త్వరగా నయం అవుతుందని, గింజలను కాల్చి పొడిచేసి నీటిలో కలిపి తాగితే షుగర్ వ్యాధి అదుపులో ఉంచుతుందని, నోటి పూత చిగుళ్ల వ్యాధులు, దంతక్షయం, నుంచి ఉపశమనం కలుగుతుందని, కడుపులో నులిపురుగులను నివారించడంతోపాటు, క్యాన్సర్‌కు ఔషధంగా పనిచేస్తుందని తెలిపారు. అలాగే రోగనిరోధక శక్తి పెంచుతుందని తెలిపారు.

విత్తనాలు కొనేముందు జాగ్రత్తలు తీసుకోవాలి

వీసీపల్లి, జూలై5 :పంటల సాగుకు ముందు విత్తనాలు కొనే సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి జి.వెంకటస్వామి అన్నారు. శుక్రవారం పలు గ్రామాలకు చెందిన రైతులతో ఆయన మాట్లాడుతూ విత్తనాల ఎంపిక అనంతరం లెసెన్స్ కలిగిన డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనాలన్నారు. కొన్న విత్తనాల సంచులకు డీలర్ల వద్దనుంచి తప్పనిసరిగా రశీదు పొందాలన్నారు. తీసుకున్న బిల్లు మీద విత్తన కంపెనీ పేరు, రకం, బ్యాచ్‌నెంబరు, లాట్‌నెంబరు, రేటు ఉండేలా బిల్లు రాయించుకోవాలన్నారు.అలాగే విత్తన ప్యాకెట్ మీద తయారైన తేదీ, కాలం ముగిసే తేదీని సరిచూసుకోవాలన్నారు.బిల్లు తీసుకున్న రైతులు పంట యొక్క కాలం పూర్తై దిగుబడి వచ్చేంత వరకు జాగ్రత్తగా భద్రపరచుకోవాలన్నారు. పంట దిగుబడి తగ్గినా, కొన్న విత్తనాలు మొలకెత్తకపోయినా డీలర్‌తో పాటు విత్తనాలు సరఫరా చేసిన సంబంధిత కంపెనీపై చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేసేందుకు బిల్లులు ఉపయోగపడతాయని ఆయన అన్నారు.తక్కువ ధరకు విత్తనాలు ఇస్తున్నారని ఆశపడి లైసెన్సు లేని ఇతర వ్యక్తుల వద్ద ఎవరూ విత్తనాలు కొనవద్దని సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి, పక్క జిల్లాల నుంచి విత్తనాలు తీసుకొచ్చి సర్టిఫైడ్ లేబుల్స్ లేకుండా విక్రయిస్తే వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు.

వేముల కార్యదర్శిగా చలపతిరావు

ముండ్లమూరు, జూలై 5 : మండలంలోని వేముల పంచాయతీ కార్యదర్శిగా ఎంవీ చలపతిరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కొండపి మండలం పెదకండ్లకుంట పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తూ బదిలీపై వేములకు నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన చలపతిరావు ఎంపీడీవో జనార్ధన్‌ను, ఈవోపీఆర్‌డీ శ్రీదేవిని కలిశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పంచాయతీ కార్యదర్శి చలపతిరావు మాట్లాడుతూ గ్రామంలో ప్రజలందరికీ అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

అధ్వాన రోడ్లకు మరమ్మతులు చేస్తాం

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

దర్శి, జూలై 5 : దర్శి ప్రాంతంలో అధ్వానంగా మారిన రోడ్ల మరమ్మతులు వెంటనే చేపడతామని ఆర్‌అండ్‌బీ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రజ్యోతి ప్రకాశంలో శుక్రవారం అధ్వానంగా రహదారులు శీర్షిక ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దర్శి -పొదిలి రోడ్డులో కాటేరువాగుపై బ్రిడ్జి పునర్‌నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామన్నారు. రాజంపల్లి - బొద్దికూరపాడు రోడ్డు అత్యవసర మరమ్మతులకు ప్రతిపాదనలు పంపామన్నారు. దర్శి-పోతవరం రోడ్డు గుంతలు పూడ్చేందుకు వార్షిక బడ్జెట్‌లో నిధుల కేటాయిస్తామన్నారు. దర్శి-దొనకొండ రోడ్డులో రోడ్డు మార్జిన్లు బలోపేతం చేసేందుకు వార్షిక బడ్జెట్‌లో మరమ్మతులు చేస్తామని వివరించారు.

సీజనల్ వ్యాధులపై అధికారులు చర్యలు చేపట్టాలి

తాళ్లూరు, జూలై 5 :రానున్న రెండునెలల వర్షాకాలంలో పారిశుధ్యం లోపం వల్ల గ్రామాల్లో సీజనల్ వ్యాధులు రాకుండా అధికారులు తగు చర్యలు చేపట్టాలని దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీపీ సమావేశం హాలులో ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అధ్యక్షతన మండలపరిషత్ సభ్య సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డెంగ్యూ మలేరియా వంటి వ్యాధుల నిర్ధారణ పరీక్షలు ప్రభుత్వవైద్యశాలల్లో నిర్వహించి పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అధ్యక్షుడు ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వంలో మంజూరు చేసే సంక్షేమ పథకాలను అన్నివర్గాల ప్రజలకు అందించాలని కోరారు. సమావేశానికి 10శాఖలకు చెందిన అధికారులు హాజరుకాలేదు. జడ్పీచైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైస్‌ఎంపీపీ ఐ.వెంకటేశ్వరరెడ్డి, ఎంపీడీవో యుగకీర్తి, వైద్యులు ఖాదర్‌మస్తాన్ బీ, శిరీష, ఎంఈవో జిసుబ్బయ్య ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య

ముండ్లమూరు, జూలై 5 : మండలంలోని సింగనపాలెం గ్రామానికి చెందిన పీ బ్రహ్మనాయుడు(35) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. సింగనపాలెం రజక వీధికి చెందిన బ్రహ్మనాయుడు పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం కొండలరాయుడుపాలెం గ్రామంలో తన అత్తగారి ఇంటికి వెళుతున్నానని చెప్పి ఒక చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బ్రహ్మనాయుడు చని పోవటానికి కారణం కుటుంబ కలహాలని తెలిసింది. మృతి చెందిన బ్రహ్మనాయుడుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతూ మృతి

మండలంలోని నాయుడుపాలెం గ్రామానికి చెందిన బద్రి శ్రీకాంత్‌రెడ్డి(34) అనే యువకుడు ఎలుకల మందు తిని నాలుగు రోజుల నుంచి ఒంగోలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. ఆ బాధ తట్టుకోలేక పోలవరం సమీపంలోని ఒక రేకుల షెడ్డులో ఎలుకల మందు తిని అపస్మారక స్థితికి వెళ్ళాడు. కుటుంబ సభ్యులు విషయం తెలుసుకొని వెంటనే ఒంగోలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందాడు. ఎస్ఐ వీ ఆంజనేయులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దర్శి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య, ముగ్గురు ఆడ పిల్లలు ఉన్నారు.

మానసిక స్థితి సరి లేక..

మండలంలోని పసుపుగల్లు గ్రామానికి చెందిన నలదిమ్మి వెంకటేశ్వరరెడ్డి(40) అనే వ్యక్తి గత కొన్ని రోజుల నుంచి మానసిక స్థితి సరిగా లేక గురువారం సాయంత్రం పురుగుల మందు తాగి మృతి చెందారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసుకొని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దర్శి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నేడు కనిగిరి మండల సర్వసభ్య సమావేశం

కనిగిరి, జూలై 5: కనిగిరి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నేడు(శనివారం) నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బీ మహేష్‌బాబు తెలిపారు. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభం కానున్నట్లు శుక్రవారం తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. సమావేశానికి సంబంధించి 23 శాఖల మండల ముఖ్య అధికారులు సమగ్ర సమాచారంతో హాజరు కావాలని సూచించారు.





జీజీహెచ్‌లో..
ఇష్టారాజ్యం

- ఐదేళ్లూ వైసీపీ సేవకే పరిమితం
- అవినీతి, అక్రమాలతో కోట్లలో గోల్‌మాల్
- కూటమి ప్రభుత్వంలోనైనా ప్రక్షాళన జరిగేనా?

గుంటూరు, జూలై 5: వైసీపీ ఐదేళ్ల పాలనలో గుంటూరు జిల్లాకే గాక తెలుగు రాష్ట్రాలకే ఆరోగ్య ప్రధాయనిగా పేరున్న గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రి గాడి తప్పింది. వేలాది మంది రోగులతో కిటకిటలాడే ప్రభుత్వాస్పత్రిని అధికార యంత్రాంగం వ్యాపార కేంద్రంగా మార్చిందనే ఆరోపణలు ఉన్నాయి. రోగులకు చికిత్సలు అందించేకంటే వైసీపీ నేతల సేవలో వైద్యులు, అధికారులు తరించారన్న విమర్శలున్నాయి. కీలకమైన అధికార యంత్రాంగం వైసీపీకి దాసోహం అన్నట్లుగా ప్రవర్తించడం తీవ్ర విమర్శల పాలైంది. ఆస్పత్రిలో నాటి సీఎం జగన్ నుంచి మంత్రులు, ఎమ్మెల్యేల వరకు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం, వారి చిత్రపటాలకు పాలాభిషేకాలు మొదలు చివరకు ఎన్నికల్లో వైసీపీకి ఓట్లు వేయాలంటూ ఉద్యోగులందరికీ ఉన్నతాధికారులు హుకుం జారీ చేసేదాకా పరిస్థితి వెళ్లింది. ఐసీయూ బెడ్స్, వెంటిలేటర్ల కొనుగోళ్లలో, భవన నిర్మాణాల్లోనూ అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. చెన్నైకి చెందిన ట్రాన్స్ హెల్త్ కేర్ కంపెనీ నుంచి కొనుగోలు చేయాలని వచ్చిన ఒత్తిడి మేరకు ఆస్పత్రిలో మూలనబడిన వెంటిలేటర్లు, మానిటర్ల విక్రయాల్లో రూ.3 కోట్ల వరకు అవకతవకలు జరిగాయి. ఆస్పత్రి అభివృద్ధికి వచ్చిన విరాళాల్లోనూ అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన క్రమంలో జీజీహెచ్ ప్రక్షాళనపై పలువురు ఎదు రుచూస్తున్నారు.

సస్పెన్షన్ చేసినా మళ్లీ విధుల్లోకి..

స్టాఫ్ నర్స్ నియామకాల్లో జరిగిన అవకతవకలతో ప్రభుత్వ వైద్యశాలలో పరిపాలనా విభాగానికి చెందిన ఓ కీలక అధికారిని ప్రభుత్వానికి సరండర్ చేశారు. మరోసారి కోర్టు కేసు వ్యవహారంలో సస్పెండ్ చేశారు. అయితే ఆయన అంతా నా ఇష్టం, నన్నెవరూ ఏమీ చేయలేరు, వైసీపీ వారే నాకు పోస్టింగ్ ఇప్పిస్తారని బహిరంగంగా చెప్పేవాడు. ఆయన చెప్పినట్లుగానే రెండు నెలల్లో తిరిగి అదే స్థానానికి రావడం గమనార్హం.

తప్పుడు నివేదికలు.. కాదంటే చార్జిమెమోలు

అప్పట్లో ఎంపీ రఘురామకృష్ణరాజుపై సీఐడీ థర్డ్ డిగ్రీ ప్రయోగంపై కోర్టు ఆదేశాల మేరకు వైద్య పరీక్షల నిమిత్తం జీజీహెచ్‌కు తరలించగా అప్పటి సూపరింటెండెంట్ ప్రభావతి వైసీపీ నేతల ఆదేశాలతో తప్పుడు నివేదిక ఇవ్వడం తీవ్ర కలకలం రేపింది. ఆ తర్వాత అప్పటి మంత్రి రోజాపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే కారణంతో నమోదైన కేసులో టీడీపీ నేత బండారు సత్యనారాయణమూర్తిని పోలీసులు అరెస్టు చేసి గుంటూరు కోర్టులో హాజరు పరిచారు. ఈ సందర్భంగా జీజీహెచ్‌కు తరలించగా ఆయనకు చికిత్స అందించాలని వైద్యులు నివేదించారు. అయితే ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని నివేదిక ఇవ్వాల్సిందిగా సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ సంబంధిత వైద్యులపై ఒత్తిడి తెచ్చినట్లు ప్రచారం జరిగింది. అందుకు అంగీకరించని వారికి చార్జ్‌మెమోలు ఇచ్చి వేధింపులకు గురి చేసినట్లు కూడా ఆస్పత్రి వర్గాలు చర్చించుకున్నాయి.

అక్రమాలు కోకొల్లలు..

రోగులకు ఆహారం సరఫరాకు సంబంధించి ప్రభుత్వ షరతులు మార్చి సొంత షరతులతో అనేక మార్లు టెండర్ పిలిచారు. నిబంధనలు మార్పు గురించి, జరిగిన తప్పులపై హైకోర్టు కూడా ప్రశ్నించింది. కోవిడ్ సమయంలో నాశిరకమైన ఆహారం సరఫరా చేసినందున అప్పటి జేసీ ప్రశాంతి కాంట్రాక్టర్‌ను మార్చారు. ఆ సంస్థకు డబ్బులు చెల్లించకుండా వారిని ఇబ్బందులకు గురిచేసి జిల్లా అధికారుల అనుమతి లేకుండా తిరిగి మరలా పాత కాంట్రాక్టర్‌కే ఆహార సరఫరా బాధ్యతను అప్పగించి డబ్బు వసూలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. గుత్తేదారు గడువు ముగిసినా నెలవారీ ముడుపులు తీసుకుని కాంట్రాక్టు పిలిచే విషయంలో జాప్యం చేశారు. ఈ విషయంలో జేసీ రాజకుమారిని సైతం తప్పు దారి పట్టించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆ దస్త్రాన్ని సదరు అధికారి మాయం చేసినా సదరు అధికారి, సహకరించిన డైటీషియన్‌పై ఇప్పటి వరకు చర్యలు తీసికోకపోవడం గమనార్హం. అర్హత లేని సంస్థకు టెండర్ కట్టబెట్టినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆయా విషయాలు బయటకు రాకుండా ఉండటానికి, ఆధారాలు లేకుండా చేయడానికి డైట్ దస్త్రాన్నే మాయం చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఫిర్యాదులు రాగా వైసీపీ నాయకులు, మంత్రుల జోక్యంతో చర్యలు తీసుకోలేదని సమాచారం.

- ప్రభుత్వ వైద్యశాలలో పొరుగు సేవల కింద హెచ్‌డీఎస్ ద్వారా హెచ్‌ఎంఐఎస్ సేవలు అందిస్తున్న సంస్థను మార్చి రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి సిఫార్సుపై హెచ్‌ఎంఐఎస్ సేవల కాంట్రాక్టు స్థానిక వైసీపీ నాయకుడుకి చెందిన వైఎస్సార్ మెడి టెక్ సంస్థకు కట్టబెట్టేందుకు పలు దఫాలు ఓ ఎమ్మె ల్యే కార్యాలయానికి ఈ దస్త్రాన్ని సదరు అధికారి, సంబంధిత ఉద్యోగి ద్వారా 2019లో తీసుకెళ్లారు. నేటి వరకు ఆ దస్త్రం ఆమోదం పొందలేదు, తదుపరి అది మాయమైందనే ఆరోపణలు ఉన్నాయి.
- ప్రభుత్వ వైద్యశాలలో 2019- 20 నుంచి 2022-23 సంవత్సరాల మధ్య సైకిల్ స్టాండ్ నిర్వహణ ఎవరికి కేటాయించారో తెలియదు. అయితే ఐదేళ్ల పాటు యథేచ్ఛగా సైకిల్ స్టాండ్ పేరుతో పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడ్డారు. సైకిల్ స్టాండ్‌కు సంబంధించి కలెక్టర్ ఇచ్చిన అనుమతులు, అందుకు సంబంధించిన దస్త్రంపై నీలినీడలు అలముకున్నాయి.
- ప్రభుత్వ వైద్యశాలలో జరిగిన 250 స్టాఫ్ నర్సుల నియామకంలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. నలుగురు అక్రమంగా ఉద్యోగం పొందగా వారిని తొలగించారు. సదరు అధికారి సొంత కోటరీని ఏర్పరచుకుని అక్రమ దందాలు, వసూళ్లకు తెరలేపి, కలెక్టర్‌ని సైతం పక్క దారి పట్టించి అర్హతలేని వారికి ఉద్యోగాలు కల్పించారన్న ఆరోపణలున్నాయి. ఇద్దరికీ సైన్సు గ్రూప్ విద్యార్హత లేకున్నా కార్డియాలజీ విభాగంలో ఒకరికి, ఈఎన్‌టీ విభాగంలో మరొకరికి ఉద్యోగాలు ఇచ్చారు. వీటిపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించడంతో సదరు ఉద్యోగులచే రాజీనామా చేయించారు. ఈఎన్‌టీ విభాగంలో ఉద్యోగం పొందిన వ్యక్తి తను ముడుపుగా చెల్లించిన నగదును రాబట్టుకునేందుకు దివ్యాంగుల నుంచి వేలల్లో నగదు వసూలు చేయగా, జిల్లా అధికారులకు తెలిసి అతడ్ని తొలగించారు. ఈ విభాగంలో ఆ పోస్టును భర్తీచేయకపోవడంతో సదరం సర్టిఫికెట్లు జారీ చేయడం లేదు.



బాలికల వసతి గృహం

జేఎన్‌టీయూపై..
నిర్లక్ష్యం

జవహర్‌లాల్ నెహ్రూ టెక్నికల్ యూనివర్సిటీ.. జేఎన్టీయూ ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ. ఇక్కడ చదువుకోవాలని విద్యార్థులు పోటీ పడుతుంటారు. ఆ విద్యా సంస్థ తమ ప్రాంతంలో ఉంటే అదో గుర్తింపుగా ఆ ప్రాంతవాసులు భావిస్తారు. అలాంటి ది నరసరావుపేట సమీపంలో జేఎన్టీయూకేను 2016లో ప్రారంభించారు. ఈ విద్యా సంస్థపై గత వైసీపీ పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం వహించారు. అది టీడీపీ హయాంలో వచ్చిందనో మరే కారణం వల్లనో కానీ ఐదేళ్లుగా పట్టించుకోలేదు. కళాశాల నిర్వహణపై కాకినాడ జేఎన్టీయూ తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. ఈ కారణంగా భవనాల నిర్మాణాల నుంచి అధ్యాపక నియామకాల వరకు వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసింది. ఈ కారణంగా ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలో అడ్మిషన్లకు విద్యార్థులు వెనుకంజ వేస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అడ్మిషన్లు పొందిన విద్యార్థులు కూడా వసతికి, రాకపోకలకు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నా ఇటు ప్రభుత్వం.. అటు వర్సిటీ పాలకవర్గం పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. వర్సిటీ వీసీ ఇటీవల తన పదవికి రాజీనామా చేశారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వ హయాంలో కళాశాలకు మంచి రోజులు వస్తాయని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆశిస్తున్నారు.

- పాలకులకు పట్టని ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థ
- అధ్యాపకుల కొరతతో నష్టపోతున్న విద్యార్థులు
- నరసరావుపేట కళాశాలలో నత్తనడకన నిర్మాణాలు
- కొత్త వీసీ నియామకంతోనైనా నిర్వహణ గాడిలో పడేనా?

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఐదు బ్రాంచ్‌లు.. వెయ్యి మంది విద్యార్థులు ఉన్న నరసరావుపేట జేఎన్టీయూ(కే) కళాశాల అనేక సమస్యలతో సతమతమవుతున్నది. వర్సిటీ పెద్దల నిర్లక్ష్యానికి నరసరావుపేట కళాశాల బలైంది. ఇక్కడి కళాశాలను అభివృద్ధి చేయడం వర్సిటీ అధికారులతో పాటు గత పాలకులకు ఇష్టం లేదన్న విమర్శలున్నాయి. కళాశాలను నిర్వీర్యం చేసేలా సదరు అధికారులు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు కూడా వస్తున్నాయి. గత విద్యా సంవత్సరంలో ఈ కళాశాలలో 80 సీట్లు భర్తీ కాకపోవడం ఇక్కడి దయనీయస్థితిని తెలియజేస్తున్నది. సాధారణంగా జేఎన్టీయూ కళాశాలలో చేరేందుకు ఇంజనీరింగ్ విద్యార్థులు పోటీ పడతారు. కానీ ఆ పరిస్థితి ఈ కళాశాలలో లేదు. కళాశాలను ప్రారంభించి సుమారు ఎనిమిదేళ్లు అవుతున్నా ఇప్పటికీ భవన నిర్మాణాలు ఒక కొలిక్కిరాలేదు. ఇక అధ్యాపకుల నియామకాలు కూడా సక్రమంగా జరగడంలేదు. అటు తరగతుల నిర్వహణకు, ఇటు వసతికి విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇక అధ్యాపకులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కళాశాల, వసతి గృహాల భవనాల నిర్మాణాన్ని పూర్తి చేయలేకపోయింది. నరసరావుపేట నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న కళాశాలకు నిత్యం రాకపోకలకు విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు. పూర్తికాని భవనాల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రాంగణంలో వసతి గృహాలు లేక వసతికి విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు. అధ్యాపకుల కొరతతో బోధన సక్రమంగా ఉండటం లేదు.



స్పోర్ట్స్ కాంప్లెక్స్ భవనం

ఖాళీల వివరాలు ఇలా..

క్యాడర్	ఉండాల్సిన వారు	ఉన్నవారు	ఖాళీ
ప్రొఫెసర్	8	1	7
అసోసియేట్లు	18	2	16
అసిస్టెంట్లు	53	4	49

ఐదేళ్లుగా సాగుతున్న నిర్మాణాలు..

కళాశాల భవనాల నిర్మాణానికి జేఎన్టీయూ కాకినాడ రూ.90 కోట్లు మంజూరు చేసింది. రూ.28 కోట్లతో పరిపాలన, ప్రయోగశాలలు, తరగతి గదుల నిర్మాణాలను చేపట్టారు. అయితే ఐదేళ్లుగా నిర్మాణ పనులు సాగదీస్తున్నారు. తరగతులు నిర్వహించేందుకు వీలుగా పనులు పూర్తి చేశారే తప్ప పూర్తి స్థాయిలో పనులు చేయలేదు. వసతి గృహాల నిర్మాణాన్ని రూ.62 కోట్లతో చేపట్టారు. ఏళ్లు గుడుస్తున్నా ఆ పనులు పూర్తికి నోచుకోలేదు. ప్రారంభం కానున్న విద్యా సంవత్సరానికి కూడా ఇక్కడ వసతి గృహాల భవనాలు అందుబాటులోకి వచ్చే పరిస్థితులు కానరావడంలేదు. బాలికల వసతి గృహాలలో ఒక బ్లాక్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. మారో బ్లాక్, బాలుర వసతి గృహాల నిర్మాణాల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. విద్యార్థుల ఇబ్బందుల దృష్ట్యా పనులను వేగవంతంగా చేయాల్సి ఉన్నా వర్సిటీ పెద్దలు చర్యలు తీసుకోవడంలేదన్న విమర్శలున్నాయి.

అతిథి అధ్యాపకులే దిక్కు..

కళాశాలలో వెయ్యి మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నా ఉద్దేశపూర్వకంగా వర్సిటీ పాలకులు అధ్యాపకులను నియమించడంలేదు. అతిథి అధ్యాపకులతో కాలం గడుపుతున్నారు. 2016లో ప్రారంభమైన కళాశాలో సివిల్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్, ఈఈఈ, ఈసీఈ బ్యాంచ్‌లు 60 సీట్ల చొప్పున ఉన్నాయి. 2018 డిసెంబరులో టీడీపీ ప్రభుత్వం కళాశాలకు 80 అధ్యాపక పోస్టులను మంజూరు చేసింది. ఇందుకు సంబంధించి రూ.7.11 కోట్లు వార్షిక బడ్జెట్‌ను కేటాయించింది. 9 మంది ప్రొఫెసర్లు, 53మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 18 మంది అసోసియేట్ ప్రొఫెసర్లను కళాశాలకు మంజూరు చేస్తూ జీవోను విడుదల చేసింది. అయితే ఆయా అధ్యాపకులను యూనివర్సిటీ నేటికీ నియమించలేదు. పర్మినెంట్ అధ్యాపకులు ఏడుగురు మాత్రమే కళాశాలలో విధులు నిర్వహిస్తున్నారు. ప్రొఫెసర్ పోస్టులు మొత్తం ఖాళీగానే ఉన్నాయి. ఉన్నది ఒకే ఒక ప్రొఫెసర్ అది కూడా ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు. ఆయనను ఇటీవల బదిలీ చేయగా 'జేఎన్టీయూపై నీలినీడలు' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంతో బదిలీని వర్సిటీ నిలిపివేసింది. అసోసియేట్ ప్రొఫెసర్లు ఇద్దరు ఉండగా వారిలో క్రీడలకు సంబంధించి ఒకరు. పర్మినెంట్ అధ్యాపకులను నియమించాల్సిన వర్సిటీ అతిథి అధ్యాపకులతో కాలం వెళ్లబుచ్చు తున్నది. మొత్తంమీద 73 మంది అధ్యాపకుల కొరత ఉంది. నామమాత్రంగా కాంట్రాక్ట్ అధ్యాపకులను నియమించి చేతులు దులుపుకుంది. కనీసం అధ్యాపకులను కాంట్రాక్టు పద్ధతిలో నియమించే విషయంలోనూ వర్సిటీ అధికారులు అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు.

విద్యార్థులకు అన్యాయం

అధ్యాపకుల కొరత కారణంగా ప్రతిభ కలిగిన విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతోంది. అధ్యాపకుల కొరతతో విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూలను కోల్పోతున్నారు. ఉద్యోగాలకు ఎంపికయ్యే విద్యార్థుల సంఖ్య ఏటేటా తగ్గిపోతోంది. 2021లో 180 మంది క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. 2022లో 150 మంది, 2023లో 110 మంది ఉద్యోగాలు సాధించారు. 2024లో కేవలం 72 మంది మాత్రమే ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఏటా ఉద్యోగాలు పొందే విద్యార్థుల సంఖ్య పెరగాల్సి ఉండగా ఈ కళాశాలలో దారుణంగా పడిపోతున్నట్లు సదరు లెక్కలు తెలియజేస్తున్నాయి.



బాలుర వసతి గృహం



నిర్మాణంలో ఉన్న భవనాలు

సాగునీటి కాల్వల్లో అత్యవసర పనులపై సమీక్ష
మరమ్మతులకు.. ప్రతిపాదనలు

- డెల్టాలో రూ.14 కోట్లు, సాగర్ కాల్వలకు రూ.22.54 కోట్లకు అంచనాలు
- ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళతానన్న మంత్రి నిమ్మల

గుంటూరు, నరసరావుపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణా పశ్చిమ డెల్టా, సాగర్ కుడి కాల్వ పరిధిలో అత్యవసరంగా చేపట్టాల్సిన మరమ్మతులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు స్వీకరించింది. శుక్రవారం రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తన కార్యాలయంలో సమీక్షించారు. డెల్టా, సాగర్ పరిధిలో అవసరమైన పనులను గుంటూరు ఇరిగేషన్ అధికారి ఉమామహేశ్వరరావు, సాగర్ కెనాల్స్ సీఈ, ఎస్సీలు నివేదించారు. షట్టర్లు, కాల్వల గట్లు బలోపేతం చేయడం వంటి పనులను ప్రతిపాదించారు. డెల్టాకు సంబంధించి రూ.14 కోట్లు, సాగర్ కాల్వలకు రూ.22.54 కోట్లు అవసరమౌతాయని ఆయా అధికారులు మంత్రికి నివేదించారు. అన్ని జిల్లాల నుంచి ప్రతిపాదనలు తెప్పించుకున్న అనంతరం సీఎం చంద్రబాబునాయుడి దృష్టికి తీసుకెళ్లి అనుమతులు తీసుకుంటామని మంత్రి అధికారులకు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో త్వరలోనే నిధులు మంజూ రౌతాయని అధికారులు ఆశిస్తున్నారు.

రూ.కోట్లు ఖర్చు పెట్టినా నిరుపయోగం..

వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో కాల్వలు, డ్రెయిన్లకు సంబంధించి ఎలాంటి పనులు చేపట్టలేదు. కేవలం ఓఅండ్ఎం పనుల పేరుతో కేవలం నాచు, తూటికాడ తొలగింపునకు రూ.కోట్లు ఖర్చు పెట్టారు. వాటి వల్ల ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. కొద్ది రోజుల్లోనే మళ్లీ నాచు, తూటికాడ పెరిగిపోయి కాల్వల్లో నీటి ప్రవాహానికి ప్రతిబంధకాలు ఏర్పడేవి. జిల్లా నీటిపారుదల సలహా మండలి, సమీక్ష మండలి సమావేశాల్లో తూతూ మంత్రంగా సమీక్షలు మినహా కాల్వలు, డ్రెయిన్లను పట్టించుకోలేదు. ఏటా రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లోనూ నిధుల కేటాయింపు జరపలేదు. ఈ కారణంగా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని సాగునీటి కాల్వల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. కాల్వల గట్లు పూర్తిగా బలహీనపడిపోయాయి. పూర్తి సామర్థ్యం మేరకు నీటిని విడుదల చేస్తే షట్టర్లు కొట్టుకుపోయేలా ఊగిసలాడుతున్నాయి. అలానే లీకుల కారణంగా నీరు వృథా అవుతున్నది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో తొలుత రూ.13.72 కోట్లతో కనీస పునరావాస మరమ్మతులు చేపట్టారు. వీటితో పాటు అత్యవసరంగా చేపట్టాల్సిన పనుల పైనా ప్రతిపాదనలను మంత్రి స్వీకరించారు. ఈ రెండు పనులు జరిగితే రెండేళ్ల పాటు కాల్వల్లో నీటి పారుదలకు ఆటంకాలు ఉండవు. ఆ తర్వాత నిధుల లభ్యతని బట్టి పూర్తిస్థాయి మరమ్మతులు గురించి ఆలోచన చేయవచ్చు.

ఖరీఫ్ సాగుపై చర్చ

సమావేశంలో ఖరీఫ్ పంటల సాగు పైనా చర్చ జరిగినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం పులిచింతల డ్యాంలో కేవలం అర టీఎంసీ నీరు మాత్రమే ఉన్నది. ఈ నేపథ్యంలో నాగార్జునసాగర్ నుంచి వరద వస్తే నీటిని దిగువకు విడుదల చేయలేని పరిస్థితి నెలకొన్నది. ప్రత్యామ్నాయంగా పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా నీటిని తరలించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. తొలుత డెల్టా పరిధిలో అన్ని చెరువులను నింపి ఆ తర్వాత సాగునీటిపై ఆలోచన చేద్దామని మంత్రి రామానాయుడు అధికారులకు తెలిపారు. ఆ మేరకు ఏర్పాట్లు చేసుకోవాల్సిందిగా ఆదేశించారు.



గోవిందాపురం కాలువలో పెరిగిన కంప చెట్లు

జగన్ నిర్వాకం.. రూ.300 కోట్ల భారం

- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్లను పాడుబెట్టారు
- అత్యాధునిక సదుపాయాలతో టీడీపీ హయాంలో నిర్మాణం
- 9 నెలల్లో పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ఆదేశాలు
- ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే క్వార్టర్స్ పరిశీలనలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు

తుళ్లూరు/ గుంటూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): 'అమరావతి రాజధాని ప్రాంతంలో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నివాసాల కోసం క్వార్టర్లు నిర్మించగా.. జగన్ వాటిని పాడుబెట్టారు. వైసీపీ పాలకుల తీరు కారణంగా ప్రస్తుతం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్వార్టర్లను పూర్తి చేయడానికి రూ.300 కోట్ల అదనపు భారం పడింది. మిగిలిన పనులు పూర్తి చేసి తొమ్మిది నెలల్లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు అప్పగిస్తాం..' అని శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. రాజధాని అమరావతిలోని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవన సముదాయాలను శుక్ర వారం ఆయన పరిశీలించారు. ఐదేళ్ల క్రితం ఆగిపోయిన భవన సముదాయాలను చూసి ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో ఉన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్లను మించిన అత్యాధునిక సదుపాయాలతో చంద్రబాబు అమరావతిలో నిర్మించారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో అద్భుతమైన ప్రణాళికతో 90 శాతం పూర్తి చేయగా అనంతరం అధికారంలోకి వచ్చిన జగన్ నాశనం చేశారన్నారు. ఒక నాయకుడి అనాలోచిత పాలన వల్లే ఐదేళ్ల క్రితం ఆగిన భవనాలు నేడు శిథిల స్థితికి చేరాయన్నారు. క్వార్టర్లలోని ఇనుప సామగ్రి మొత్తం తుప్పు పట్టిపోయిందన్నారు. ఈ ప్రాంతంలోని సామగ్రిని కూడా కొందరు దొంగలించుకపోయినట్లు తెలిసిందన్నారు. వారి నిర్వాకం వల్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి ఇప్పుడు రూ.300 కోట్లు అదనంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ దృష్టికి తీసుకువెళ్లి బడ్జెట్ కేటాయించేలా చేసి 9 నెలల్లో భవనాల నిర్మాణం పూర్తి చేసి ప్రజాప్రతినిధులకు అప్పగిస్తామన్నారు. గత ప్రభుత్వంలో ఐదేళ్లలో ఒక్కసారి కూడా అసెంబ్లీకి సున్నం కూడా వేయించలేదన్నారు. ఆగిపోయిన గ్రంథాలయాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అసెంబ్లీ ఆవరణలో ప్రజా ప్రతినిధులకే కాకుండా, వచ్చే విజిటర్లకు కూడా భోజన వసతి కల్పించేలా క్యాంటీన్ ఏర్పాటు చేయాలని కోరారు.



అమరావతిలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవనాలను పరిశీలిస్తున్న స్పీకర్ అయ్యన్న పాత్రుడు

ఎర్రగొండపాలెం ఎస్సైపై వేటు

● వసూళ్ల పర్వంపై విచారణ ● సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు



ఎస్ఐ సుదర్శన్

ఒంగోలు(క్రైం), జూలై 5: ఎన్నికల ఖర్చులంటూ వసూళ్ల పర్వానికి శ్రీకారం చుట్టిన ఎస్ఐపై వేటుపడింది. ఎర్రగొండపాలెంలో పనిచేస్తున్న ఎస్ఐ సుదర్శన్‌ను సస్పెండ్ చేస్తూ గుంటూరు రేంజి ఐజీ శ్రీ సర్వశ్రేష్ఠి త్రిపాఠి ఉత్తర్వులు జారీచేశారు. స్వయంగా పోలీసు స్టేషన్‌కు పిలిపించుకొని వైపాలెం పట్టణ వ్యాపారులను బెదిరించినట్లు సమాచారం. ఎన్నికల్లో డబ్బులు చాలా ఖర్చయ్యాయి, ప్రభుత్వం నుంచి నిధులు రాలేదు, మీరు మీ సంఘాల తరఫున ఒక్కొక్కరూ రూ.15వేలకు తగ్గకుండా నగదు ఇవ్వాలని ఎస్ఐ సుదర్శన్ హుకుం జారీ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. తాను బదిలీ అవుతున్నానని, నేరుగా వసూళ్లపర్వం ప్రారంభించాడు. ఎస్సై అవినీతి వ్యవహారం మండలంలో చర్చనీయాంశమై ఉన్నతాధికారులకు చేరింది ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ ఆదేశాల మేరకు మార్కాపురం డీఎస్పీ బాలసుందరావు విచారణ నిర్వహించారు. సమగ్ర నివేదికను గుంటూరు రేంజీ ఐజీకి పంపారు. ఎస్ఐ సుదర్శన్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలు నిర్ధారణ కావడంతో వెంటనే చర్యలు తీసుకున్నారు.

పాఠశాల గ్రాంటు విడుదల కానిది వాస్తవమే

● జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర

ఒంగోలు(విద్య), జూలై 5: జిల్లాలోని పాఠశాలలకు 2023-24లో పాఠశాలల కాంపోజిట్ గ్రాంటు, మండల విద్యావనరుల కేంద్రాల గ్రాంటు, స్కూలు కాంప్లెక్స్ గ్రాంట్లు సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయం నుంచి విడుదల కానిది వాస్తవమేనని జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర ధ్రువీకరించారు. పాఠశాలలకు సమగ్రశిక్ష ప్రాజెక్టు నుంచి నయాపైసా నిధులు విడుదల కాలేదు. రాని గ్రాంట్లకు సమగ్రశిక్ష ఆడిట్ నిర్వహిస్తున్న విషయాన్ని ప్రస్తావిస్తూ 'సమగ్రశిక్ష మజాకా' శీర్షికతో ఈనెల 3న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. 2023-24 విద్యా సంవత్సరానికి సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు కార్యాలయం నుంచి జిల్లా ప్రాజెక్టు కార్యాలయానికి పాఠశాల, కాంప్లెక్స్, ఎమ్మార్సీ గ్రాంట్లు విడుదల కాలేదు. దీంతో తాము జిల్లాలోని పాఠశాలలు, కాంప్లెక్స్, ఎంఆర్‌సిలకు తాము నిధులు విడుదల చేయలేకపోయామని డీఈవో వివరణ ఇచ్చారు. రాష్ట్ర సమగ్రశిక్ష కార్యాలయం నియమించిన ఆడిటర్ల బృందం ఈనెల 3,4 తేదీల్లో పాఠశాలలకు ఆడిట్ నిర్వహించారని సుభద్ర తెలిపారు.


రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని పట్టుకున్న విజిలెన్స్ అధికారులు

200 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

నాగులుప్పలపాడు, జూలై 5 : అక్రమంగా రేషన్ బియ్యంను తరలిస్తున్న లారీని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. ఏపీ27యుబీ5598 నంబరు గల లారీ 200 బస్తాల రేషన్ బియ్యం లోడుతో ఉప్పుగుండూరు నుంచి గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్ వైపు వెళుతుండగా బి.నిడమానూరు వద్ద శుక్రవారం తెల్లవారుజామున విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కె.వి.ఆర్ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో డీటీలు డెవిడ్, సీహెచ్ కృష్ణమోహన్, రామనారాయణరెడ్డి బృందం దాడి చేసి పట్టుకున్నారు. పట్టుబడిన బియ్యం బస్తాలను ఒంగోలులోని ఎఫ్‌సీఐ గోడౌన్‌కు తరలించారు. బాధ్యులపై కేసులు నమోదు చేసినట్లు డీటీ కృష్ణమోహన్ తెలిపారు.


మంత్రులు రామానాయుడు, నారాయణలతో డాక్టర్ లక్ష్మి దంపతులు

దర్శి అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలి

● మంత్రులను కలిసి కోరిన గొట్టిపాటి లక్ష్మి దంపతులు

దర్శి, జూలై 5 : దర్శి నియోజకవర్గ అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని రాష్ట్ర మంత్రులు పి. నారాయణ, ఎన్. రామానాయుడులను శుక్రవారం టీడీపీ దర్శి నియోజకవర్గ నాయకురాలు గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు కలిసి విజ్ఞప్తి చేశారు. తొలుత ఇరువురు మంత్రులకు బొకేలు అందించి అభినందనలు తెలిపారు. దర్శి నియోజకవర్గంలో మూలనపడ్డ సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి రామానాయుడుకు విజ్ఞప్తి చేశారు గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కనీస మరమ్మతులు చేయక సాగర్ కాలువలు అధ్వాన్నంగా మారాయని వివరించారు. మొగిలిగుండాల రిజర్వాయర్ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని, వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం వేగవంతం చేయాలని కోరారు. అనంతరం పురపాలక శాఖ మంత్రి నారాయణతో మాట్లాడుతూ దర్శి నగర పంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. గత వైసీపీ పాలనలో నగర పంచాయతీ చేశారే గాని పోస్టులు మంజూరు చేయకపోవటంతో పాలన కుంటుపడిందన్నారు. అన్నీ పోస్టులు భర్తీ చేసి దర్శి పట్టణ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. అందుకు రాష్ట్ర మంత్రులు సానుకూలంగా స్పందించారని గొట్టిపాటి లక్ష్మి దంపతులు తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

● కలెక్టర్ అన్సారియా ఆదేశం

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 5: తాగునీటి సరఫరాలో ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం ఒంగోలు కార్పొరేషన్‌తో పాటు జిల్లాలోని అన్ని మునిసిపాటిటీలు, నగర పంచాయతీల కమిషనర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ఆయా మునిసిపాలిటీల్లో ఉన్న ఇళ్ళు, సరఫరాకు ఉన్న డిమాండ్, ప్రస్తుతం సరఫరా చేస్తున్న పరిమాణం, అందుబాటులో ఉన్న నీటి వనరులు, తాగునీటి సరఫరాకు కొత్త పథకాలు, ప్రతిపాదనలు, ట్యాంకుల ద్వారా సరఫరా తదితర అంశాల వారీగా సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఒంగోలు కమిషనర్ జశ్వంతరావు మాట్లాడుతూ రెండు నెలలకు సరిపడా నీరు ప్రస్తుతం అందుబాటులో ఉందన్నారు. రామతీర్థం నుంచి స్థానిక చెరువులకు నీటిని తరలించి నిల్వ చేశామని చెప్పారు. కార్పొరేషన్‌లో విలీనమైన 37 గ్రామాలకు 35 ట్యాంకర్ల ద్వారా రోజుకు 250 ట్రిప్పులు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ఇతర మునిసిపాలిటీల్లో కూడా తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మునిసిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

తేల్చని కేంద్రం.. నిలిచిన వేలం

అధికారిక పంట కొనుగోలు పూర్తి

ఆయా కేంద్రాల్లో ఆగిన వేలం

కొన్నిచోట్ల చూర విక్రయాలు

రైతుల వద్ద ఇంకా సుమారు 45 మిలియన్ కిలోల పొగాకు

జాప్యం జరిగితే నష్టపోతామని ఆందోళన


వేలం కేంద్రాల వద్ద కొనుగోలు లేక నిల్వ ఉన్న పొగాకు బేళ్లు

హాట్‌హాట్‌గా సాగుతున్న పొగాకు మార్కెట్‌కు బ్రేకులు పడ్డాయి. అయితే అది కొనే వ్యాపారులు లేకనో, ధరలు సరిలేక రైతులు ఆందోళనలు చేయడం వల్లో లేక గోడౌన్లు లేకనో కాదు. అధిక పంట ఉత్పత్తిపై అపరాధ రుసుం విషయంపై కేంద్రం ఎటు తేల్చకపోవడమే. దీంతో మార్కెట్‌లో కొనుగోళ్లకు ఆటంకం ఏర్పడింది. ఇప్పటికే అత్యధిక కేంద్రాల్లో అధికారిక పంట కొనుగోళ్లు పూర్తయ్యాయి. అలాంటి చోట్ల కేంద్రం నుంచి అనుమతులు రాక, అధిక ఉత్పత్తి కొనుగోలు చేసే అవకాశం లేక వేలాన్ని బోర్డు అధికారులు నిలిపేశారు. కొన్నింటిలో చూర కొనుగోలు చేయిస్తున్నా రెండురోజులు పోతే అవి కూడా పూర్తవుతాయి. అలాగే ప్రస్తుతం అనుమతి ఉన్న పంట కొద్దిమేర ఉన్న మూడు, నాలుగు కేంద్రాల్లో వేలం జరుగుతున్నా ఈ వారంలో అక్కడ కూడా పూర్తయ్యి అవి కూడా ఆగిపోయే పరిస్థితి వినిపిస్తోంది.

ఒంగోలు, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఇతర పంటలకు భిన్నంగా పొగాకు సాగు, విక్రయాలు ఇతరత్రా అన్నింటిపైనా ప్రభుత్వ నియంత్రణ ఉంటుంది. కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ పరిధిలోని భారత పొగాకు బోర్డు పర్యవేక్షణలో ఈ ప్రక్రియ అంతా సాగుతుంది. ఏటా ఎంత విస్తీర్ణంలో పంట సాగు చేయాలి, బ్యారన్‌కు ఎంతమేర ఉత్పత్తి చేయాలన్నది పొగాకు బోర్డు నిర్ణయిస్తుంది. అలాగే రైతులు కూడా పొగాకు బ్యారన్లకు లైసెన్సులు పొంది తదనుగుణంగానే సాగు చేయాలి. పొగాకు బోర్డు అనుమతి లేకుండా సాగు చేసినా, అనుమతి ఇచ్చిన దాని కన్నా పంట అధికంగా ఉత్పత్తి అయినా, దానిని కొనుగోలు చేయాలంటే రైతులపై పొగాకు బోర్డు అపరాధ రుసుం వసూలు చేస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌ఓ) నిబంధన ప్రకారం దేశంలో పొగాకు ఉత్పత్తి తగ్గింపు చర్యలలో భాగంగా కేంద్రం ఇలాంటి షరతులు అమలు చేస్తుంది. కాగా కొన్నిసందర్భాలలో పొగాకు బోర్డు ఇచ్చిన అనుమతి కన్న తక్కువగా మరి కొన్ని సీజన్లలో ఎక్కువగా పంట ఉత్పత్తి జరుగుతోంది. వాతావరణంలో మార్పులతో కూడా అలా జరగవచ్చు.

పదిశాతం దాటితే అపరాధం వసూలు

అనుమతించిన పరిమాణం కన్నా పదిశాతం అధికంగా ఉత్పత్తి జరిగితే పదిశాతం వరకు వాతావరణంలో మార్పుగా భావించి కొనుగోళ్లకు అనుమతిస్తారు. అంతకు మించితే అపరాధ రుసుం వేస్తారు. గతంలో అలా అధికంగా ఉత్పత్తిఅయిన పంటకు దాని ధరలో 15శాతం అలాగే కిలోకు రెండు రూపాయలు వంతున అపరాధ రుసుం వసూలు చేసేవారు. ఏయేటికి ఆయేడు పొగాకు బోర్డు ఇందుకోసం కేంద్ర వాణిజ్యమంత్రిత్వశాఖ నుంచి అనుమతులు తీసుకోవాలి. అయితే అంత శాతం అపరాధ రుసుంతో నష్టపోతామన్న రైతుల ఆవేదనను పరిగణనలోకి తీసుకొని అపరాధ రుసుంను 15 నుంచి 10 శాతానికి కొన్నేళ్ల క్రితం తగ్గించారు. ఇదిలా ఉండగా గత రెండు, మూడు సీజన్‌లుగా కర్ణాటకలో అనుమతించిన దానిలో 60 నుంచి 70శాతం మాత్రమే పంట ఉత్పత్తి జరుగుతుండటంతో పెట్టుబడులు కూడా రావడం లేదని అక్కడ గగ్గోలుపెట్టడంతో వరుసగా రెండు సీజన్లు అక్కడ అపరాధ రుసుంను కేంద్రం రద్దు చేసింది.

కర్ణాటక మాదిరిగానే...

కర్ణాటక తరహాలో తమకు కూడా మినహాయింపు ఇవ్వాలని ఆంధ్ర రైతులు కోరగా గతేడాది ఇక్కడ కూడా అపరాధ రుసుంను రద్దుచేశారు. అయితే ఈ ఏడాది భారీగా రాష్ట్రంలో పంట ఉత్పత్తి పెరిగింది. అయితే సాధారణ ఎన్నికల నేపథ్యంలో అపరాధ రుసుంపై కేంద్రం ఇంత వరకు స్పష్టత ఇవ్వలేదు. దక్షిణాదిలోని రెండు రీజియన్లలో 11 వేలంకేంద్రాలు ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఉండగా ఆ పరిధిలో 2023-24 సీజన్‌కు పొగాకుబోర్డు సుమారు 57వేల హెక్టార్ల విస్తీర్ణంలో పంట సాగుకు, 86.62 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి అనుమతి ఇచ్చింది. అయితే గత రెండేళ్ల మార్కెట్ ఆశాజకనంగా ఉండటం, కర్ణాటకలో ఉత్పత్తి తగ్గడం, ఇక్కడ వాతావరణం అనుకూలత వంటి అంశాలతో దక్షిణాదిలో రైతులు భారీగా పొగాకు సాగు చేశారు. సుమారు 72వేల హెక్టార్లపైగా విస్తీర్ణంలో పంట సాగు కాగా ఇంచుమించు 134 మిలియన్ కిలోలు అధికంగా ఉత్పత్తి జరిగినట్లు అంచనా. ఈ ఏడాది ఫిబ్రవరి 29న కొన్ని, మార్చి 6న మిగిలిన కేంద్రాలలో వేలం ప్రారంభించగా ఇప్పటివరకు సుమారు 89 మిలియన్ల కొనుగోళ్లు జరగ్గా సగటున కిలోకు రూ.254కుపైగా ధర లభించింది. ఆ విషయం అలా ఉంచితే ఇప్పటికే ఒంగోలు-1, 2, కందుకూరు-1,2 , కలిగిరి, డీసీపల్లి, కనిగిరి కేంద్రాల్లో అధికారిక పంట కొనుగోళ్లు పూర్తయ్యాయి. వెల్లంపల్లిలో రేపటితో ముగియనుండగా మిగిలిన టంగుటూరు, కొండపి పొదిలిలోనూ ఈ వారంలో పూర్తి కానున్నాయి.

దక్షిణాదిలో దాదాపు 48 మిలియన్ కిలోలు అధికంగా పంట ఉత్పత్తికాగా కేంద్రం దాని కొనుగోలు విషయంలో అపరాధ రుసుం రద్దు చేయడమా లేక కొంత వసూలు చేయడమా అన్నది స్పష్టత ఇవ్వలేదు. ఈవిషయంపై తగు సూచనలు కోరుతూ బోర్డు అధికారులు చాలా ముందుగానే కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖకు రాతపూర్వకంగా సంప్రదించారు. బోర్డు పాలక మండలి బాధ్యులు, పలువురు రైతులు కూడా ఇటీవల ఆశాఖ మంత్రి పియూష్ గోయల్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ప్రధానంగా ధరలు కొంత బాగానే ఉన్న పెట్టుబడి ఖర్చులు భారీగా పెరగడం, కర్ణాటకలో అపరాధ రుసుం రద్దు చేయడంతో అలాగే ఇక్కడ కూడా రుసుం రద్దుచేసి అధిక పంట ఉత్పత్తి కొనుగోలుకు అనుమతి ఇవ్వాలని కోరారు. అయితే కేంద్రం నుంచి ఈ విషయంలో స్పష్టత రాలేదు. దీంతో కొనుగోలు పూర్తయిన ఏడు కేంద్రాల్లో రైతులు వద్ద పంట ఉన్న వేలం నిలిచిపోయింది. దాదాపు 47 మిలియన కిలోల పంట రైతుల ఇళ్లలో ఆగిపోగా కొనుగోళ్లు ఇంకా జాప్యం జరిగితే తూకం తగ్గడంతోపాటు నాణ్యత దెబ్బతిని భారీగా నష్టపోతామని రైతాంగం ఆందోళన చెందుతున్నారు. తక్షణం కేంద్రం అపరాధ రుసుం రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చి అధిక పంట కొనుగోలు జరిగేలా చూడాలని రైతులు కోరుతున్నారు. కొనుగోలు నిలిచిన విషయంపై పొగాకు బోర్డు ఒంగోలు ఆర్ఎం లక్ష్మణరావును వివరణ కొరగా అధిక పంట కొనుగోళ్లపై కేంద్ర వాణిజ్యమంత్రిత్వశాఖ నుంచి ఆదేశాలు త్వరలో వస్తాయని రాగానే వేలం తిరిగి ప్రారంభిస్తామన్నారు.

మండల సమావేశం ఉద్రిక్తం

జడ్పీ చైర్‌పర్సన్‌ను ప్రశ్నించేందుకు భారీగా చేరిన టీడీపీ శ్రేణులు

పోలీస్ బందోబస్తు మధ్య సమావేశం

ఎంపీటీసీ, ఎంపీపీ మధ్య తీవ్ర వాగ్వివాదం

సమావేశాన్ని అర్ధంతరంగా ముగించిన వైనం


ఎంపీడీవోతో వాగ్వివాదం చేస్తున్న టీడీపీ శ్రేణులు

దొనకొండ, జూలై 5 : ప్రజాసమస్యలను చర్చించేందుకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఉషారాణి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా సాగింది. కొంతమేర ఉద్రిక్తత నెలకొంది. సమావేశానికి జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలుసుకున్న టీడీపీ శ్రేణులు భారీసంఖ్యలో కార్యాలయం వద్దకు చేరుకున్నారు. జడ్పీ చైర్‌పర్సన్‌గా మూడేళ్లకాలంలో ఏఏ సమస్యలు పరిష్కరించారో ప్రశ్నించేందుకు టీడీపీ మండలాధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు నేతృత్వంలో శ్రేణులు ఎంపీడీవో కార్యాలయం వద్దకు చేరుకున్నారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకొని సభ్యులను మాత్రమే లోపలకు పంపి పోలీసు పహారా మధ్య సమావేశాన్ని కొనసాగించారు. అధికారులు వారిశాఖల పరిధిలో సమాచారాన్ని వివరిస్తుండగా వైస్ ఎంపీపీలు వడ్లమూడి వెంకటేశ్వర్లు, మిట్టా కోటిరెడ్డిలు సమస్యలు పరిష్కరించలేని సమావేశాలు నిర్వహించటం ఎందుకని ప్రశ్నించారు. దీనిపై ఎంపీపీ జోక్యం చేసుకోవటంతో వారి మధ్య వాగ్వాదం నెలకొంది. దీంతొ ఇరువురూ సభను వాకౌట్ చేసి బయటకు వెళ్లిపోయారు. ఆరవల్లిపాడు టీడీపీ ఎంపీటీసీ సభ్యురాలు కమ్మా వెంకటసుబ్బులు తమ గ్రామంలో నేటికీ ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని, అర్హులైన వారికి పింఛన్లు కూడా ఇప్పించలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీపీ ఉషారాణి జోక్యం చేసుకొని మాట్లాడటంతో ఇరువురు మధ్య మళ్లీ వాగ్వివాదం పెరిగింది. ఈ నేపథ్యంలో ఎంపీటీసీ వెంకటసుబ్బులును ఎంపీపీ సమావేశంలో అదుపుతప్పి మాట్లాడటంతో ఒక్కసారిగో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సమావేశంలో జరిగిన తీరును బయట ఉన్న టీడీపీ శ్రేణులు విని ఎంపీపీ క్షమాపణ చెప్పాలంటూ పెద్దఎత్తున డిమాండ్ చేశారు. దీంతో పలువురు చొరవ తీసుకొని ఎంపీపీని సమావేశం హాలు నుంచి తీసుకెళ్లిపోవటంతో సమావేశం అర్ధంతరంగా ముగిసింది. సమావేశానికి ముందు ఎంపీడీవో వసంతరావునాయక్ టీడీపీ నాయకుల మధ్య వివాదం నెలకొంది. మండల టీడీపీ అధ్యక్షుడు శివకోటేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ రాచగొర్ల వెంకటయ్య, మాజీ జడ్పీటీసీ సభ్యుడు పులిమి రమణాయాదవ్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు, వల్లపునేని వెంకటస్వామి, సింగమనేని హనుమంతు, దుగ్గెంపూడి చెంచయ్య, చొప్పరపు మైకేల్‌బాబు, వేగినాటి అల్లూరయ్య, వడ్లమూడి వెంకటాద్రి మరికొందరు నాయకులు గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతుంటే పట్టించుకోకుండా ఐదేళ్లు వైసీపీ నేతలు, అధికారులు ఇబ్బందిపెట్టిన తీరును ప్రశ్నించారు. టీడీపీ తరఫున తాము ట్యాంకర్లు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీరుస్తున్నామన్నారు. జడ్పీ నిధులను ఇష్టారాజ్యంగా వైసీపీ నాయకులకు కట్టబెట్టి వారి జేబులు నింపారే తప్ప గ్రామాల్లో అభివృద్ధిని విస్మరించారని ఆరోపించారు. మూడేళ్లుగా జడ్పీ చైర్‌పర్సన్‌గా ఉన్న వారికి ప్రజల సమస్యలు తెలియవా..? ఆమె ప్రజలకు ఎంచేశారో చెప్పాలంటూ వారు ప్రశ్నించారు.


నిబంధనలకు విరుద్ధంగా సమావేశానికి వస్తున్న వైసీపీ నాయకులను రానివ్వకుండా అడ్డుకున్న టీడీపీ శ్రేణులు

ఆగని వైసీపీ నేతల దందా

● సమావేశంలో చొరబడేందుకు యత్నం
● అడ్డుకున్న టీడీపీ శ్రేణులు
● గంటపాటు ఉద్రిక్త వాతావరణం

ప్రభుత్వం మారినా ఇంకా మండలంలో వైసీపీ నేతల దందా ఆగడం లేదు. శుక్రవారం మండల సమావేశానికి హాజరయ్యేందుకు జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డిలతోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు పోలోమంటూ మండల పరిషత్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. విషయం తెలిసి టీడీపీ శ్రేణులు ముందుగానే కార్యాలయం వద్దకు చేరాయి. సమావేశానికి అధిక సంఖ్యలో వైసీపీ నాయకులు, కార్యకర్తలతో చేరుకున్న జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, వైసీపీ నాయకులను టీడీపీ శ్రేణులు కార్యాలయం లోపలకు వెళ్లనీయకుండా గేటు వద్ద అడ్డుకున్నాయి. నిబంధనల మేరకు జడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే మినహా మిగిలిన వారు లోపలకు వెళ్లేందుకు వీలులేదంటూ పట్టుబట్టారు. దాదాపు గంటసేపు ఇరువర్గాల మధ్య వాగ్వివాదంతోపాటు ఒక దశలో ఉద్రిక్తత నెలకొంది. ఎన్నికల్లో వైసీపీ ప్రజలు బుద్ధిచెప్పినా ఇంకా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న తీరును వారు ప్రశ్నించారు. ఈ ఘటన ఎటువంటి గొడవలకు కారణమవుతుందోనని పలువురు ఆందోళనలకు గురయ్యారు. త్రిపురాంతకం సీఐ సుబ్బారావు, దొనకొండ ఎస్సై సంపత్‌కుమార్‌లు చొరవ తీసుకొని టీడీపీ శ్రేణులకు సర్దిచెప్పి ముందు ఎమ్మెల్యేని, ఆ తర్వాత జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మను కార్యాలయం లోనికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు పరిష్కరించని జడ్పీ చైర్‌పర్సన్ గోబ్యాక్ అంటూ గట్టిగా నినాదాలు చేశారు. అప్పటికే సమావేశం ముగియటంతో ఇరువురు ఎంపీపీ గదిలో కొంతసేపు కూర్చుని తిరిగి బయటకు వెళ్లిపోయారు.

పంచాయతీలకు పూర్వవైభవం!

ముఖ్యమంత్రి నేతృత్వంలో విస్తృత చర్చలు

సచివాలయ వ్యవస్థతో నిర్వీర్యమైన గ్రామపంచాయతీలు

రెండింటినీ అనుసంధానం చేసే దిశగా అడుగులు

ఒంగోలు (కలెక్టరేట్), జూలై 5 : గ్రామ పంచాయతీ వ్యవస్థకు పూర్వవైభవం తెచ్చేందుకు నూతన ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా సచివాలయ వ్యవస్థను తెచ్చి పంచాయతీలను నిర్వీర్యం చేసింది. పాలకవర్గాలు ఉన్నా ఉత్సవ విగ్రహాలుగా మార్చింది. ప్రజలకు ఏ అవసరం వచ్చినా గ్రామ పంచాయతీలకు కాకుండా సచివాలయాలకు పరుగులు తీయాల్సిన పరిస్థితిని కల్పించింది. సచివాలయ వ్యవస్థ నిర్వహణ బాధ్యత పేరుకే పంచాయతీలకు అన్నట్లు వ్యవహరించింది. మూడేళ్లుగా గ్రామపంచాయతీల పాలకవర్గాలు తమ హక్కులు తమకు కల్పించాలని అనేక సార్లు వైసీపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. దీంతో సర్పంచ్‌లు కానీ, ఇటు పంచాయతీ కార్యదర్శులు కానీ ఏమీ చేయలేకపోయారు. అప్పటి ప్రభుత్వం ఏది చెప్తే అదే చేయాల్సిన పరిస్థితి. జిల్లాలో 730 గ్రామపంచాయతీల పరిధిలో సుమారు 720 సచివాలయాలు ఉన్నాయి. వాటి ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యక్రమాలు జరుగుతున్న విషయాన్ని గుర్తించిన నూతన ప్రభుత్వం అందులో పంచాయతీ వ్యవస్థకు పూర్వవైభవం తెచ్చేందుకు చర్యలు తీసుకుంది.

పంచాయతీ పరిధిలోకి సచివాలయ ఉద్యోగులు

ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఆ వెటనే ఆయన గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాలు, పంచాయతీల పని తీరు తదితర అంశాలన్నింటిపైనా సమీక్షించారు. గ్రామ పంచాయతీల స్థానంలో సచివాలయ వ్యవస్థను తేవడం ద్వారా అవి నిర్వీర్యమైనట్లు గుర్తించారు. సచివాలయ వ్యవస్థలో పనిచేసే ఉద్యోగులను పంచాయతీలో భాగస్వామ్యం చేసే దిశగా అడుగులు వేసి తద్వారా పూర్వవైభవం తెచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ ప్రక్రియ పక్షంరోజుల్లో పూర్తవుతుందన్న ప్రచారం ఉంది. ఇంకోవైపు గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో గ్రామాల్లో మీసేవా కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు అన్ని రకాల సేవలను అందుబాటులోకి తెచ్చారు. ఆ సేవలను కూడా వైసీపీ ప్రభుత్వం ప్రజలకు దూరం చేసి ఏ పనికావాలన్నా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల ద్వారా చేయిస్తూ వచ్చింది. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారానే గ్రామాల అభివృద్ధితోపాటు ప్రజలకు సత్వర సేవలు అందుబాటులోకి తెచ్చేవిధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

అద్దంకిలో పడకేసిన అభివృద్ధి

- ఎక్కడికక్కడే నిలిచిపోయిన పనులు
- అక్రమ వసూళ్లపైనే దృష్టి సారించిన వైసీపీ కౌన్సిలర్లు
- నేడు మున్సిపల్‌ కార్యాలయంలో అధికారులతో మంత్రి రవికుమార్‌ సమీక్ష
- ఇకనైనా పాలన గాడిలో పడేనా!

అద్దంకి, జూలై 5: అద్దంకి మున్సిపాలిటీ గత వైసీపీ ప్రభుత్వ పాలనలో పూర్తిగా గాడి తప్పింది. వైసీపీ కౌన్సిలర్లు, ఆపార్టీ వార్డు ఇన్‌చార్జులు అభివృద్ధి పూర్తిగా మరిచి అక్రమ వసూళ్లే లక్ష్యంగా పనిచేశారన్న విమర్శలు వచ్చాయి. వైసీపీ ప్రభుత్వంలో కౌన్సిలర్లు, నాయకులు ప్రతి పనికి ఓరేటు నిర్ణయించి వసూళ్లపర్వం సాగించారన్న విమర్శలు ఉన్నాయి. ఈక్రమంలోనే ఇంటి ప్లాన్‌ అప్రూవల్‌ మొదలు రియల్‌ ఎస్టేట్‌ వెంచర్ల వరకు మామూళ్లు ముట్టచెబితేనే పనులు జరిగాయని విమర్శలు వచ్చాయి. కొన్ని సందర్భాలలో అధికారులు సైతం మాకు ఇచ్చే మామూళ్ల సంగతి తేవడెరుగు కౌన్సిలర్లతో మాట్లాడుకోండి అని చెప్పిన సందర్భాలు కూడా ఉన్నాయి.

నిలిచిపోయిన అభివృద్ధి పనులు

అద్దంకి పట్టణంలో పెద్దఎత్తున అభివృద్ధి పనులకు గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే నిధులు మంజూరై పనులు ప్రారంభించినా వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాలలో పనులు పూర్తి చేయటంలో పూర్తిగా విఫలమయ్యారన్న విమర్శలు ఉన్నాయి. సుమారు రూ.85 కోట్లతో అద్దంకి సమగ్ర మంచినీటి పథకం పనులు ప్రారంభించగా, వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రీ టెండరింగ్‌ పేరుతో పథకం పనులు అస్తవ్యస్తంగా మార్చారు. దీంతో ప్రస్తుతం వ్యయం పెరగగా, టీడీపీ ఇళ్లకు మంచినీటి సరఫరా లేకుండా పోయింది. అయినా పనులు పూర్తికాలేదు. బిల్లులు చెల్లించకపోవటంతో గత ఐదారు నెలలుగా పనులు పూర్తిగా నిలిచిపోయాయి. దీనితోటు మున్సిపల్‌ కార్యాలయం ఆవరణలో ఉన్న ఓవర్‌హెడ్‌ ట్యాంక్‌ పూర్తిగా శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది.



అంతర్గత పైపులైన్లు వేసి వదిలివేసిన సీసీ రోడ్డు, ప్రమాదంగా ఉన్న సిమెంట్‌ దిమ్మెలు

ఇక మంచినీటి సరఫరా కూడా అస్తవ్యస్తంగా మారింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా రెండు రోజులకొసారి మంచినీటి సరఫరా జరుగుతుంది. పలు శివారు కాలనీలలో సీసీ రోడ్ల సంగతి దేవుడెరుగు కనీసం తట్ట మట్టి పోసిన పాపాన కూడా పోలేదు. దీంతో పలు కాలనీలలో చిన్నపాటి వర్షం పడినా బురదమయంగా మారుతున్నాయి. పారిశుధ్య పనులు, వీధి లైట్ల నిర్వహణ కూడా అస్తవ్యస్తంగా మారింది.

నేడు మున్సిపల్‌ అధికారులతో మంత్రి రవికుమార్‌ సమీక్ష

అద్దంకి మున్సిపల్‌ కార్యాలయంలో అధికారులతో శనివారం ఉదయం 11 గంటలకు విద్యుత్‌ శాఖ మంత్రి రవికుమార్‌ సమీక్ష నిర్వహించనున్నారు. గాడి తప్పిన మున్సిపల్‌ పాలనను మం త్రి రవికుమార్‌ సమీక్షతోనైనా గాడిలో పడుతుందన్న గుంపెడు ఆశతో పట్టణ ప్రజలు ఎదురు చూస్తున్నారు. ప్రధానంగా మున్సిపల్‌ పరిధిలో ప్లాన్‌ అప్రూవల్‌ మొదలు ఇతర అన్ని అనుమతులకు మామూళ్లు తీసుకోకుండా చేయటంతో పాటు, ఆగిపోయిన అభివృద్ధి పనులను వేగవంతం చేసేవిధంగా మంత్రి రవికుమార్‌ చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. మంత్రిగా రవికుమార్‌ అద్దంకి పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి పెద్ద ఎత్తున నిధులు తెచ్చే అవకాశం ఉంది.



కూలేందుకు సిద్ధంగా ఉన్న మున్సిపల్‌ కార్యాలయంలోని ఓవర్‌హెడ్‌ ట్యాంక్‌

అయితే, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌తో పాటు ఎక్కువమంది కౌన్సిలర్లు వైసీపీకి చెందిన వారు కావటంతో అద్దంకి పట్టణ అభివృద్ధికి సహకరిస్తారా లేక అన్నింటికి అడ్డుపుల్లలు వేసి అభివృద్ధి నిరోధకులుగా మారుతారా అనేది వేచి చూడాల్సి ఉంది. అయితే, ఇప్పటికే ఇద్దరు వైసీపీ కౌన్సిలర్లు టీడీపీకి మద్దతు పలకటం, మరికొందరు కౌన్సిలర్లు టీడీపీ పంచన చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు కూడా తెలుస్తుంది. ఈనేపథ్యంలో మున్సిపల్‌ అభివృద్ధి ఎటువైపు అడుగులు పడతాయో వేచిచూడాలి.

తిరుమలలో మొక్కులు చెల్లించుకున్న ఎమ్మెల్యే కొండయ్య



తిరుమలలో మొక్కులు తీర్చుకున్న ఎమ్మెల్యే కొండయ్య, కుటుంబసభ్యులు

చీరాల, జూలై 5: ఆధ్యాత్మిక బావాన్ని పెంపొందించి ప్ర చ్చుకున్న ఎమ్మెల్యే కొండయ్య శుక్రవారం తిరుమలలో మొక్కులు చెల్లించుకున్నారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల ఆయురారోగ్యాలకు దేవదేవుడు ఆశీర్వదించాలని కోరుకున్నారు. తన సతీమణి, చినకుమారుడు డాక్టర్‌ మహేంద్రనాథ్‌తో కలిసి ఎమ్మెల్యే మొక్కులు చెల్లించుకున్నారు. ఈసందర్భంగా కొండయ్య మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల అభివృద్ధి, ఆయురారోగ్యాలకు అనుగ్రహించాలని స్వామివారిని కోరినట్లు చెప్పారు. వారి వెంట పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సేవా కార్యక్రమాల్లో ఎల్‌ఐసీ

అద్దంకిటౌన్‌, జూలై 5: సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎల్‌ఐసీ ఎప్పుడూ ముందుంటుందని సీనియర్‌ బ్రాంచ్‌ మేనేజర్‌ మాదవకృష్ణ అన్నారు. శుక్రవారం ఆల్‌ ఇండియా ఇన్సూరెన్స్‌ ఎంప్లాయిస్‌ అసోసియేషన్‌ 74వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని బదిరుల ఆశ్రమ పాఠశాలకు నిత్యావసర సరుకులు అందజేశారు. విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం కార్యదర్శి తోటకూర సత్యనారాయణ, యూనియన్‌ అధ్యక్షుడు వినీత్‌, కోశాధికారి తవ్వా రవి, సహాయ కార్యదర్శి శ్రీవాణి, ఏపీఎం బాదర్‌ మస్తాన్‌, డవలప్‌మెంట్‌ ఆఫీసర్‌ రాజశేఖర్‌రెడ్డి, దత్తు రాంబాబు, హరీష్‌, డీపీఎం సత్యనారాయణ, పాఠశాల ప్రిన్సిపాల్‌ సురేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలి

అద్దంకిటౌన్‌, జూలై 5: ప్రభుత్వం, దాతలు అందించే సహకారాలను విద్యార్థులు సద్వినియోగపర్చుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని దాత, రిటైర్డ్‌ బ్యాంక్‌ మేనేజర్‌ యర్రమోతు నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని బొమ్మనంపాడు ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు నోట్‌ పుస్తకాలు, పలకలు, పెన్నులు, పెన్సిల్‌, స్కేల్స్‌ వంటివి అందజేశారు. ప్రతి ఏటా విద్యార్థులకు తమ వంతుగా సాయం అందిస్తున్న నాగేశ్వరరావుకు హెచ్‌ఎం మున్నంగి కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు మస్తాన్‌వలీ, యర్రమోతు సుబ్బయ్య తదితరులు అభినందించారు.

బల్లికురవలో భారీ వర్షం



బల్లికురవలో కురుస్తున్న వర్షం

బల్లికురవ, జూలై 5: బల్లికురవ మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. సుమారు గంట పాటు కురిసిన వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. వ్యవసాయ పనులకు ఈవర్షం ఎంతో ఉపయోగంటని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే దుక్కులు దున్నిన రైతులు పంటలు సాగుచేసే అవకాశం ఉంది. మరికొందరు రైతులు దుక్కులు దున్నేందుకు ఈ వర్షం ఉపయోగపడుతుంది.

పిల్లల ఉజ్వల భవిష్యత్‌కి బాటలు వేయాలి

పర్చూరు, జూలై 5: పిల్లల ఉజ్వల భవిష్యత్‌కు ఉపాధ్యాయులు బంగారు బాట వేయాలని ఎంఈవో మోజెస్‌ అన్నారు. అందుకు ఉపాధ్యాయులు అందిస్తున్న శిక్షణతరగతులు ఎంతగానో దోహద పడతాయని చెప్పారు. శుక్రవారం స్థానిక ఎస్‌ఎస్‌బీఎన్‌ పాఠశాలలో జరుగుతున్న ఎడ్యుకేషన్‌ టూల్స్‌ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. విద్యార్థుల స్థాయికి అనుగుణంగా విద్యాబోధన సాగాలన్నారు. విద్యార్థులకు గుర్తుండిపోయే విధంగా వివిధ రకాల పరికరాలను ఉపయోగిస్తూ విద్యాబోధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో కోర్స్‌ డైరెక్టర్‌ పి.వెంకట్రామయ్య, మాస్టర్‌ ట్రైనర్స్‌ మల్లికార్జునరావు, సోమపరపు నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరావు, గుమ్మా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

అద్దంకిటౌన్‌, జూలై 5: చేతుల పరిశుభ్రతతో పలు వ్యాధులకు దూరంగా ఉంటారని ఎంఈవో బి.సుధాకరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని తిమ్మాయపాలెం జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలను ఎంఈవో సుధాకర్‌ సందర్శించారు. ఈసందర్భంగా వయేదిలా నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై ఆరోగ్య కార్యకర్తలతో అవగాహన కల్పించారు. అలాగే, పాఠశాలలో జరుగుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు పి.గంగాధర్‌, ఎంపీ రమణారెడ్డి, ఏఎన్‌ఎంలు భారతి, సుశీకుకుమారి, సీఆర్పీ ఎంఆర్‌పీ, ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి

యద్దనపూడి(మార్టూరు), జూలై 5: విద్యార్థుల్లో ఉన్న సామర్థ్యాలను, నైపుణ్యాలను వెలికితీసి ఉత్తమ ఫలితాలను సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఇన్‌చార్జ్‌ డీఈవో గల్లా వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం యద్దనపూడి జడ్పీ హైస్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో విద్యార్థులకు పంపిణీ చేసిన కిట్ల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని వారికి నాణ్యమైన భోజనం పెట్టాలని, మెనూ ప్రకారం ఏర్పాటుచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. నేను బడికిపోతా విద్యాప్రవేశ్‌ కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దేవేంద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టోల్‌గేట్‌ వద్ద వాగ్వాదం

మార్టూరు, జూలై 5: మండలంలోని బొల్లాపల్లి టోల్‌గేట్‌ వద్ద శుక్రవారం మధ్యాహ్నం ఒక వాహనంలోని వ్యక్తులు, టోల్‌గేట్‌ సిబ్బంది మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. పంగులూరు మండలానికి చెందిన వ్యక్తులు కారులో చిలకలూరిపేట వైపు వస్తున్నారు. వారు స్థానికులు కావటంతో సర్వీసు రోడ్డులో వెళ్తుండగా, బోలోగేట్‌ సిబ్బంది అడ్డుకున్నారు. ఈక్రమంలో కారులోని వ్యక్తులు, టోల్‌ గేట్‌ సిబ్బంది మధ్య వాగ్వాదం చోటు చేసుకొని చేతులు చేతులు కలిసినట్లు తెలిసింది. ఈఘటనలో టోల్‌గేట్‌కు చెందిన ఒకరికి దెబ్బతగిలినట్లు తెలిసింది. ఈవిషయమై బోలోగేట్‌ మేనేజరు స్థానిక పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు రంగప్రవేశం చేశారు. వారంద రినీ స్టేషన్‌కు తీసుకువెళ్లినట్లు సమాచారం. వారి మధ్య రాజీ జరిగినట్లు తెలిసింది. ఈవిషయమై స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు చేయలేదని తెలిసింది.

ధ్యాన యోగా శిక్షణను సద్వినియోగం చేసుకోండి

చీరాలటౌన్‌, జూలై 5: మానసిక ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెంపొందించుకునేందుకు ధ్యాన యోగా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎన్‌జీ రంగానాయకులు, బాపనమ్మ కల్యాణ మండపంలో ఈనెల 7 నుంచి 16వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వివరాలకు 7013910280, 9493328906 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

రోటరీ క్లబ్‌ అసిస్టెంట్‌ గవర్నర్‌గా రమేష్‌చంద్ర

పర్చూరు, జూలై 5: రోటరీ 3150 జిల్లా అసిస్టెంట్‌ గవర్నర్‌గా తేళ్ల రమేష్‌చంద్ర నియమితులయ్యారు. జిల్లాలోని చీరాల క్లీనపురి, చీరాల, పర్చూరు, ఇంకొల్లు, పంగులూరు, వేటపాలెం క్లబ్‌లకు అసిస్టెంట్‌ గవర్నర్‌గా ప్రాతినిధ్యం వహించనున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఆయన పనిచేస్తున్నారు. 2019-20, 2020-21 పర్చూరు రోటరీ క్లబ్‌ అధ్యక్షుడిగా పనిచేశారు. ఉత్తమ అధ్యక్షుడిగా, ఉత్తమ క్లబ్‌గా గుర్తింపు తెచ్చారు. ఆరోసీ నాగులపాలెం స్థాపించిన వాకింగ్‌ ట్రాక్‌తోపాటు, ఇతర సేవా కార్యక్రమాలలో ఆయన నిర్వహిస్తున్నారు.

వీఆర్‌కు చీరాల డీఎస్పీ ప్రసాద్‌

చీరాల, జూలై 5: చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్‌ను వీఆర్‌(వేకెన్సీ రిజర్వ్‌)కు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం అందుకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రసాద్‌ గతంలో 2019 ఎన్నికల సమయంలో చీరాలలో సీఐగా పనిచేశారు. తరువాత 2024 ఎన్నికలకు ముందుకు డీఎస్పీగా చీరాల వచ్చారు. తాజా ఉత్తర్వులతో ఆయన వీఆర్‌కు వెళుతున్నారు.

శింగరకొండలో కదళీ ఫలార్చన



ప్రత్యేక అలంకరణ లో ప్రసన్నాంజనేయస్వామి

అద్దంకి, జూలై 5: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో అమావాస్య సందర్భంగా శుక్రవారం అరటిపండ్ల పూజ వైభవంగా నిర్వహించారు. వేదపండితులు, అర్చకులు అరటిపండ్లతో 11 ఆవృతములుగా పూజ నిర్వహించారు. దేవస్థాన అసిస్టెంట్‌ కమిషనర్‌ సుభద్ర ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి విరాళం

పర్చూరు, జూలై 5: పర్చూరులోని వైజంక్షన్‌లో రూ.2కోట్ల వ్యయంతో శ్రీఅభయాంజనేయస్వామి విగ్రహంతో రూపుదిద్దుకున్న ఆలయ అభివృద్ధికి తిమ్మసముద్రం గ్రామానికి చెందిన ప్రవాసాంధ్రుడు, జనసేన నాయకుడు మన్నెం శ్రీకాంత్‌, వారి కుటుంబ సభ్యులు రూ.40లక్షల విరాళం ప్రకటించి దాతృత్వం చాటుకున్నారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయన్ను ఘనంగా సత్కరించారు. దేవస్థాన ప్రాంగణంలో వంటశాల భవనం, పూజారి, వాచ్‌మన్‌ గదుల నిర్మాణం కోసం విరాళాన్ని ప్రకటించినట్లు ఆయన తెలిపారు. స్వామివారి ఆలయ అభివృద్ధికి తోడ్పాటు అందించేందుకు ముందుకు వచ్చిన శ్రీకాంత్‌కు కమిటీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కోట హరిప్రసాద్‌, రంగిశెట్టి అంజనేయులు, కఠారి సురేంద్రబాబు, తులసి అప్పారావు, గడ్డిపాటి శ్రీనివాసరావు, మంగగిరి కోటేశ్వరరావు, ఒగ్గిశెట్టి నర సింహం, రంగిశెట్టి రామాంజనేయులు, గోగుల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతపై కానిస్టేబుల్‌ దాడి

చీరాలటౌన్‌, జూలై 5: టీడీపీ నాయకుడిపై దాడికి పాల్పడిన కానిస్టేబుల్‌తో పాటు మరో ఆరుగురుపై చీరాల టూటౌన్‌ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేటపాలెం మండలం పందిళ్లపల్లికి చెందిన టీడీపీ నేత నక్కల వెంకటరమణారావుకు ఈపురుపాలెం పోలీస్‌ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్‌ బాబు యాదవ్‌కు స్వల్ప వివాదాలు ఉన్నాయి. ఈక్రమంలో గురువారం జాతీయ రహదారిలోని టీడీపీ కార్యాలయం నుంచి బయటకు వస్తున్న రమణారావుపై బాబు యాదవ్‌ మరో ఆరుగురు దాడి చేశారు. దీంతో బాధితుడు టూటౌన్‌ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి ఘటనలో ఏడుగురు అరెస్ట్‌

అద్దంకి, జూలై 5: ముండ్లమూరు మండలం శంకరాపురంకు చెందిన వ్యక్తులపై గత నెలలో ఉదే గ్రామానికి చెందిన మరోవర్గం అద్దంకి మండలం తిమ్మాయపాలెం ఇటుకబట్టీల వద్ద దాడి చేసిన సంఘటనకు సంబంధించి శుక్రవారం ఏడుగురిని పోలీసులు అరెస్ట్‌ చేశారు. ఇటీవల 8 మందిని అరెస్ట్‌ చేయగా, శుక్రవారం మరో ఏడుగురిని అరెస్ట్‌ చేశారు.

పారిశుధ్య పనుల పరిశీలన

అద్దంకి, జూలై 5: అద్దంకి పట్టణంలోని 6వ వార్డు పరిధిలో శుక్రవారం మున్సిపల్‌ కమిషనర్‌ సత్యనారాయణ, కౌన్సిలర్‌ కపా రఘ పరిశీలించారు. ప్రధానంగా పారిశుధ్య పనుల నిర్వహణ తీరుతో పాటు సైడ్‌ డ్రైన్లను పరిశీలించారు. పలుచోట్ల మురుగునీరు పారుదల సరిగ్గా లేకపోవటంతో కొత్తగా సైడ్‌ డ్రైన్ల నిర్మాణం చేయాల్సిన ప్రాంతాలను పరిశీలించారు.

అన్నదానం

అద్దంకి, జూలై 5: అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి, అద్దంకి శాఖ ఆధ్వర్యంలో అమావాస్య పర్వదినంను పురస్కరించుకొని శుక్రవారం స్థానిక పాతబస్టాండ్‌ సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పలువురు దాతల సహకారంతో అన్నదానం నిర్వహించారు.

పంటల వివరాలను సమగ్రంగా చేపట్టాలి

అద్దంకి, జూలై 5: క్షేత్రస్థాయిలో కమతాల గణన, పంటల వివరాలు, దిగుబడులు, తదితర అంశాలను సమగ్రంగా చేపట్టాలని జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి శ్రీనివాసరావు అన్నారు. అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు, కొరిశపాడు మండలాలలోని వీఆర్వోలు, ఇతర సిబ్బందికి గణనపై శిక్షణ కార్యక్రమం అద్దంకిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. బాపట్ల, చీరాల డిప్యూటీ ఎస్‌వోలు రవి, చాముండేశ్వరి, ఏఎస్‌వోలు అమర్నాధ్‌, సుబ్రహ్మణ్యం, అనూష తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంలపై పనిభారం తగ్గించాలి

అద్దంకిటౌన్‌, జూలై 5: గ్రామ సచివాలయాల్లో పనిచేసే ఏఎన్‌ఎంలపై పనిభారం తగ్గించాలని ఏపీ నర్సింగ్‌ అండ్‌ హెల్త్‌ ఎంప్లాయిస్‌ సంఘం(సీఐటీయూ) రాష్ట్ర సెక్రటరీ వై. సుభాషిణి డిమాండ్‌ చేశారు. శుక్రవారం సాయంత్రం స్థానిక సుందరయ్య భవనంలో జరిగిన సంఘం అద్దంకి డివిజన్‌ సమావేశంలో ఆమె మాట్లాడారు. హెల్త్‌ సిబ్బంది చేసే విధులకు అదనంగా యాప్‌లు, పంచాయతీరాజ్‌ పనులు చేయిస్తున్నారన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో నియామకాలు చేసి అదనపు పనిభారాన్ని తగ్గించాలని డిమాండ్‌ చేశారు. సమావేశంలో అద్దంకి డివిజన్‌ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టీఫిషియల్‌, ఎన్‌.ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

మార్టూరు, జూలై 5: ఐదేళ్ల నుంచి 14 ఏళ్లలోపు ఉన్న పిల్లలందరూ బడికి వచ్చే విధంగా తల్లిదండ్రులకు కౌన్సెలింగ్‌ ఇవ్వాలని నేను బడికిపోతా కార్యక్రమం రాష్ట్ర పరిశీలకుడు జి.మల్లికార్జున్‌ అన్నారు. బడి ఈడు పిల్లలు అందరూ బడిలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. శుక్రవారం మార్టూరు పీర్లచావిడిలోని ఉర్దూ పాఠశాల, ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థుల హాజరు పెరిగేవిధంగా మండలస్థాయి అధికారులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. బాలకార్మికులను గుర్తించి వారిని బడిలో చేర్పించాలన్నారు. పరిశ్రమలలో తనిఖీలు నిర్వహించాలన్నారు. ఎస్సీ కాలనీలోని భవిత కేంద్రాన్ని కూడా పరిశీలించారు. విద్యార్థులకు కిట్లు ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఐఈ కోఆర్డినేటర్‌ ఎంఆర్పీలు, ఎంఈవో లు వస్రానాయక్‌, ఎం.ప్రేమలత, నక్కాబాబు, విన్నకోట, సీఆర్పీలు రమేష్‌, రామారావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

- హోం శాఖమంత్రి అనితకు ఎమ్మెల్యే ఏలూరి వినతి



హోం శాఖమంత్రి అనితను కలసి సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు, జూలై 5: గత ప్రభుత్వ హయాంలో పెట్టిన అక్రమ కేసుల ఉపసంహరణకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనితను కోరారు. శుక్రవారం విజయవాడలోని హోం మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన కలిశారు. ఈసందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా గత ప్రభుత్వ హయాంలో పెట్టిన అక్రమ కేసులు, పోలీస్‌ స్టేషన్ల ఆధునికీకరణ, నూతన వాహనాలు, నూతన అగ్నిమాపక కేంద్రం, ఎస్సీ, ఎస్టీ కేసులు, పాం 7 నుల పురోగతి తదితర అంశాలపై చర్చించారు. ప్రధానంగా రాజధానిగా అమరావతి కొనసాగించాలని అమరావతి రైతులు 2021 నవంబర్‌లో శాంతియుతంగా చేపట్టిన పాదయాత్ర సందర్భంగా పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించాలని కోరారు. అలాగే, పర్చూరు నియోజకవర్గంలో గుంటూరు చానల్‌ పొడిగించాలని దీక్ష చేపట్టిన నల్లమడ రైతులపై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలని మంత్రికి వివరించారు. వైసీపీ నేతలు అధికారంలో తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుల ఓట్ల తొలగింపునకు తన నియోజకవర్గంలో వందల సంఖ్యలో ఫాం 7 దరఖాస్తులు చేసిన విషయాన్ని హోం మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అక్రమమార్గంలో ఓట్ల తొలగింపునకు కుట్రపన్నిన వారిపై ఎలాంటి విచారణ జరపకుండా నీరుకార్చిన తీరుపై విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేలా ఆదేశించాలని మంత్రిని ఏలూరి కోరారు. మార్టూరులో గ్రానైట్‌ వ్యాపారులపై అప్పటి అధికార పార్టీ ఒత్తిడితో పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలపై పెట్టిన ఎస్సీ, ఎస్టీ కేసులను సమీక్షించాలన్నారు. పర్చూరులో అగ్నిమాపక కేంద్రం, నూతన సబ్‌ డివిజన్‌ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. మార్టూరు, యద్దనపూడి మండలాలను మార్టూరు సర్కిల్‌గా, పర్చూరు, కారంచేడు మండలాలను పర్చూరు సర్కిల్‌గా, ఇంకొల్లు, చిన్నగంజాం మండలాలను ఇంకొల్లు సర్కిల్‌గా ఏర్పాటు చేసేలా చొరవ చూపాలన్నారు. మార్టూరు ఔట్‌పోస్ట్‌ పోలీస్‌ స్టేషన్‌ను సాధారణ స్టేషన్‌గా మార్చాలని పేర్కొన్నారు. నేషనల్‌ హైవే పరిధిలో అన్ని పోలీస్‌ స్టేషన్లను మోడల్‌ స్టేషన్లుగా తీర్చిదిద్దాలని, ఆధునిక సౌకర్యాలు ఏర్పాటుచేయాలని ఏలూరి మంత్రిని కోరారు.

మంచినీటి సరఫరాలో నిలువు దోపిడీ

కుంకలమర్రు(పర్చూరు), జూలై 5: కారంచేడు మండలం కుంకలమర్రు గ్రామంలో మంచినీటి సరఫరాలో నిలువు దోపిడీ జరిగిందని టీడీపీ నాయకుడు కొల్లా సుబ్బారాయుడు ఆరోపించారు. ఇందుకు సంబంధించి గ్రామస్తుల లిఖితపూర్వక ఫిర్యాదును శుక్రవారం బాపట్లలో కలెక్టర్‌కు అందజేశారు. సర్పంచ్‌తోపాటు పంచాయతీ కార్యదర్శి, సీనియర్‌ అసిస్టెంట్‌, వైసీపీ నాయకులు జువ్వా శివరాంప్రసాద్‌ అవినీతికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామంలో తెలుగు ఏర్పాటుచేసిన వాటర్‌ ప్లాంట్‌ పనిచేయక పోవడంతో దానిని బాగు చేయకుండా స్థానిక వైసీపీ నాయకుడు శివరాంప్రసాద్‌ జువ్వా చారిటబుల్‌ ట్రస్ట్‌ పేరుతో మరో వాటర్‌ ప్లాంట్‌ను నెలకొల్పినట్లు తెలిపారు. దీనికి నీటి సరఫరా చేసేందుకు నెలకు రూ.25 వేలు పంచాయతీకి ఇచ్చేవిధంగా ఒప్పందం కుదుర్చుకున్నారన్నారు. నాలుగు నెలల అనంతరం నెలకు రూ.25 వేలు భారంగా ఉండటంతో పంచాయతీలో మరో తీర్మానం చేసినట్లు చెప్పారు. జనవరి 1, 2023 నుంచి డిసెంబరు 1,2037 వరకు 15 సంవత్సరాల పాటు జువ్వా చారిటబుల్‌ ట్రస్ట్‌ సంవత్సరానికి రూ.25వేలు చెల్లించే విధంగా పంచాయతీలో మరో మారు తీర్మానం చేశారన్నారు. ఇది నిబంధనలకు విరుద్ధమని గ్రామస్తులు వాపోతున్నారన్నారు. దీనిని రద్దుచేసి గ్రామంలో పాత వాటర్‌ ప్లాంట్‌ను పునరుద్ధరించాలని కలెక్టర్‌ను కోరినట్లు సుబ్బారాయుడు తెలిపారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకుడు సుబ్బారాయుడు

బల్లికురవ.. మురుగుమయం

- కాలువలు లేక రోడ్లపై ప్రవహిస్తున్న నీరు
- వైసీపీ ప్రభుత్వంలో రోడ్ల వెంబడి దుకాణాల తొలగింపు
- నిర్మాణాలు చేపట్టని వైనం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



కాలువలు లేకపోవటంతో తహసీల్దార్‌ కార్యాలయం ముందు నిలిచిన మురుగు నీరు

బల్లికురవ, జూలై 5: పేరుకు మాత్రం మండల కేంద్రం.. చిన్నపాటి వర్షం కురిసినా బల్లికురవలోని రోడ్లన్నీ మురుగు నీటితో నిండిపోతున్నాయి. మురుగు కాలువలు లేకపోవటంతో ఎంతోకాలం నుంచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం పీటి నిర్మాణం చేపడతామని చెప్పి రోడ్డు కిరువైపులా ఉన్న దుకాణాలను తొలగించారు. పనులు మాత్రం చేపట్ట లేదు. వర్షాకాలం ప్రారంభం కావటంతో ఈ ఏడాదైనా టీడీపీ ప్రభుత్వం మురుగు కాలువలను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. బల్లికురవ మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు నిత్యం పలు గ్రామాల ప్రజలు వ్యక్తిగత పనుల కోసం వస్తుంటారు. ఇక్కడ తగిన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు రోడ్ల జంక్షన్‌ నుంచి సంతమాగులూరు వెళ్లే వైపు, మార్టూరు వైపు, అద్దంకి వైపు, కొప్పెరపాడు వైపు ఉన్న రోడ్ల వెంబడి మురుగు కాలువలు లేవు. దీంతో గ్రామంలో నుంచి వచ్చే మురుగు నీరు కూడా జంక్షన్‌కు చేరుతుంది. చిన్నపాటి వర్షం కురిస్తే రోడ్లన్నీ జలమయంగా మారుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలలోకి వర్షపు నీరు పెద్దఎత్తున చేరుతుంది. తహసీల్దార్‌ కార్యాలయం ముందు అయితే నిత్యం మురుగు నీరు ఉంటుంది. కార్యాలయాలకు వచ్చే ప్రజలు దుర్వాసన భరించలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. నాలుగు రోడ్ల కిరువైపులా వెంటనే మురుగు కాలువల నిర్మాణం చేపడితే మండల కేంద్రంలో పారిశుధ్యం మెరుగుపడుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



నాలుగు రోడ్ల కూడలిలో సైడు కాలువలు లేకపోవటంతో రోడ్డుపై నిలిచిన నీరు

గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి పాలకులు మురుగు కాలువల నిర్మాణం చేపడతామని టీడీపీ సానుభూతిపరులకు చెందిన పలు దుకాణాలను తొలగించారు. ఏడాదిన్నర అయినా నేటికీ పనులు చేపట్టిన దాఖలాలు లేవు అప్పటి ప్రభుత్వ చర్యలపై మండల ప్రజలు భగ్గు మంటున్నారు. ప్రస్తుత టీడీపీ ప్రభుత్వంలో అయినా మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ సహకారంతో దుకాణదారులకు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా మురుగు కాలువల నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.




సంతమాగులూరు రోడ్డులో చిన్నపాటి వర్షానికే జలమయమైన రోడ్డు

మా అప్పుల సంగతి ఏమిటి?

అద్దంకి, జూలై 5: జగనన్న మహిళామార్ట్‌కు సరుకులు అప్పు ఇచ్చిన వ్యాపారులు తమ అప్పుల పరిస్థితి ఏమిటని మార్ట్‌ నిర్వహణ కమిటీని నిలదీశారు. సుమారు రూ.11 లక్షల మెప్మా సభ్యుల సొమ్ము పెట్టుబడి నిధితో మహిళా మార్ట్‌ నిర్వహిస్తుండగా ఇటీవల మూత పడింది. ఇప్పటికే సభ్యులు పెట్టుబడి డబ్బులు గోల్‌మాల్‌ జరిగాయని విమర్శలురాగా విచారణ జరుగుతుంది. మహిళా మార్ట్‌కు సరుకులు అప్పుగా ఇచ్చిన పలువురు వ్యాపారులు శుక్రవారం మెప్మా నిర్వహణ కమిటీ సభ్యుల శుక్రవారం గీతామందిరంలో సమావేశం అయినట్లు తెలిసి అక్కడకు వచ్చి తమ అప్పుల పరిస్థితి ఏమిటని నిలదీశారు. అధికారులు అందుబాటులో లేకపోవటంతో ఈవిషయాన్ని అధికారుల దృష్టికి తీసుకుపోతామని కమిటీ సభ్యులు హామీ ఇచ్చారు.



మహిళామార్ట్‌కు ఇచ్చిన అప్పుల బిల్లులు చూపిస్తున్న వ్యాపారులు

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
శనివారం 6 జూలై 2024

అధికారం మాదే.. ఇక మమ్మల్ని ఎవరు అడుగుతారన్న ధైర్యమో... ప్రజలేగా మోసంచేస్తే ఏమవుతుందిలే.. అన్న బరితెగింపో.. తెలియదు కానీ... మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్వగ్రామం పొదలకూరులో మాయగాళ్లు చేసిన ఫోర్జరీ వ్యవహారం సంచలనం రేపింది. లేఅవుట్లకు అనుమతులు తీసుకోకుండానే ఏకంగా డీటీడీసీ ఉన్నతాధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి అప్రూవల్ తీసుకున్నట్లు చూపించారు. భూమికి కన్వర్షన్ చేయకుండానే ఆర్డీవో పేరుతో నకిలీ పత్రాలు సృష్టించి కన్వర్షన్ జరిగినట్లు ప్రచారం చేసుకున్నారు. వీటి ద్వారా ప్రజలను మోసం చేసి అక్రమ లేఅవుట్లలో ప్లాట్లను విక్రయాలకు పెట్టి దోపిడీకి పాల్పడ్డారు. తాజాగా నుడా అధికారులు ఈ ఫోర్జరీ సంతకాలపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అక్రమాలు వెలుగు చూశాయి.


పొదలకూరులోని స్వర్ణా లేఅవుట్



- ఫోర్జరీ పత్రాలతో లేఅవుట్ల ఏర్పాటు
- ప్రజలను మోసం చేసి ప్లాట్ల విక్రయాలు
- ప్రభుత్వ ఖజానాకు గండి
- కన్వర్షన్, అప్రూవల్ రెండూ ఫేక్...
- కాకాణి అనుచరులే కీలక సూత్రధారులు
- నుడా అధికారుల ఫిర్యాదుతో చర్యలు

మాజీ మంత్రి ఊళ్లో మాయగాళ్లు !

పొదలకూరు/నెల్లూరు, జూలై 5: ఈ ఫోర్జరీ వ్యవహారం వెనుక ఉన్నది పొదలకూరుకు చెందిన నాయకులేనన్న ప్రచారం జిల్లాలో సాగుతోంది. వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యేలకు తెలియకుండా ఇలాంటివి జరగవు. అలాంటిది మాజీ మంత్రి కాకాణి స్వగ్రామంలో ఆయనకు తెలియకుండా ఇన్ని అక్రమాలు జరిగాయన్నది చర్చనీయాంశమైంది.

ప్రజలను మోసగించి...

పొదలకూరు మండలంలో అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. పట్టణం శివార్లలో స్థిరాస్తి వ్యాపారులు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా లే అవుట్లు వేశారు. అటు పన్నులు కట్టకుండా ప్రభుత్వాన్ని, అనుమతుల్లేకుండా ఇటు ప్రజలను మోసం చేస్తున్నారు. పట్టణంలో గత రెండు దశాబ్దాలుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతోంది. లేఅవుట్ వేయడం నుంచి ఆ ప్రాంతాన్ని మెరక చేసేందుకు మట్టి తరలింపు వరకు అన్నీ కూడా మాజీ మంత్రి కాకాణి కనుసన్నల్లోనే జరిగాయనే విమర్శలు ఉన్నాయి. పొదలకూరులో నెల్లూరు ప్రధాన రహదారికి ఆనుకుని స్వర్ణా గార్డెన్స్ పేరుతో లే అవుట్ వేశారు. దీని విస్తీర్ణం 18.44 ఎకరాలు కాగా, ఈ భూమంతా అడంగల్లో వ్యవసాయ భూమిగానే ఉంది. ఈ లేఅవుట్ ఎత్తు పెంచేందుకు వెంకటాచలం మండలం కనుపూరు చెరువు నుంచి రాత్రింబవళ్లు టిప్పర్లతో మట్టి తరలించారు. ఇకపోతే ప్రభుత్వ అనుమతి ఉందన్న కారణం చూపి.. ప్లాట్ల ధరలను విపరీతంగా పెంచారు. ఒక్కో అంకణం రూ.లక్షన్నర వరకు విక్రయించారు. కొనుగోలుదారుల నుంచి రూ.కోట్లు వసూలు చేశారు.

కన్వర్షన్, అప్రూవల్ రెండూ నకిలీలే..

మాజీ మంత్రి కాకాణి స్వగ్రామం తోడేరు పరిధిలోని సర్వే నెంబరు 329, 330/ఏతోపాటు పొదలకూరు గ్రామ పరిధిలోని సర్వే నెంబరు 174తో కలిపి మొత్తం 18.44 ఎకరాల్లో లేఅవుట్ వేశారు. గతంలో వ్యవసాయ భూమి కాగా, మాజీ మంత్రి అనుచరులు, కొందరు వైసీపీ నాయకులు లేఅవుట్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. అధికారం ఉందనే ధీమాతో నుడా నుంచి ఎలాంటి అనుమతి తీసుకోలేదు. స్వర్ణా గార్డెన్స్ పేరుతో రాళ్లు పాతారు. రోడ్లు వేయడంతో పాటు కాలువలు తవ్వారు. మొత్తంగా 207 ప్లాట్లు వేశారు. వీటికి నకిలీ డీటీసీపీ అనుమతి పత్రాలు సృష్టించారు. టీఎల్‌పీ నెంబరు 72/2022/జీతో అనుమతి ఇచ్చినట్లు డాక్యుమెంట్లను సిద్ధం చేశారు. వాటిపై డీటీసీపీ డైరెక్టర్, అడిషనల్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్, ఏడీఎంల సంతకాలను ఫోర్జరీ చేశారు. వాటిని చూపించి విక్రయాలు జరిపారు. ప్రస్తుతం ఆ లే అవుట్‌ను అధికారులు పరిశీలించడం, కేసు నమోదు చేయడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు.

కేసు నమోదు

పొదలకూరులోని స్వర్ణాగార్డెన్స్ లేఅవుట్ పత్రాలను పరిశీలించిన నుడా వైస్ ఛైర్మన్ బాపిరెడ్డి అవన్నీ ఫేక్ అని నిర్ధారించుకున్నారు. పొదలకూరు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. నెల్లూరు రూరల్ డీఎస్పీని కలిసి మరింత సమాచారం కూడా అందజేశారు. దీంతో పొదలకూరు పోలీసులు ఈ వ్యవహారంపై కేసు నమోదు చేశారు. పూర్తిస్థాయిలో నుడా, పోలీసు అధికారులు దర్యాప్తు చేస్తే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఇలా మండలంలో మొత్తం 50 వరకు అనధికారిక లేఅవుట్లు ఉన్నట్లు సమాచారం. ఆ లేఅవుట్లను కూడా పరిశీలిస్తే అవినీతి బాగోతాలు వెలుగులోకి వస్తాయని పలువురు అంటున్నారు.

అక్రమ లేఅవుట్లపై కమిటీ

- ఆక్రమణదారుల్లో గుబులు
- అయోమయంలో కొనుగోలుదారులు

నెల్లూరు (జడ్పీ), జూలై 5 : జిల్లాలోని నుడా పరిధిలో ఏర్పాటైన అక్రమ లేఅవుట్లపై మున్సిపల్ శాఖామంత్రి నారాయణ ప్రత్యేక దృష్టి సారించారు. నెల్లూరు, కడప జిల్లాల్లో లేఅవుట్లకు సంబంధించి ఎక్కువగా అక్రమాలు జరిగాయని ఫిర్యాదులు రావడంతో వాటిని పరిశీలించేందుకు ప్రత్యేకంగా రాష్ట్రస్థాయి కమిటీని మంత్రి ఏర్పాటు చేశారు.ఈవారంలో ఈ కమిటీ జిల్లాలో పర్యటించనుంది.

ఆక్రమణదారుల ఆందోళన

జిల్లాలో సుమారు 70శాతంపైగా అక్రమ లేఅవుట్లు ఉన్నాయి. ఈ వ్యవహారం దశాబ్దాల కాలంగా జరుగుతూ ఉంది. గత ప్రభుత్వంలో నెల్లూరులో అక్రమ లేఅవుట్ల వ్యవహారం విచ్చల విడిగా సాగింది.నుడా అనుమతులతో ఏర్పాటు చేయాల్సిన లేఅవుట్లను అక్రమంగా ఏర్పాటు చేశారు. అంతేకాక ప్రైవేట్ భూముల పక్కనున్న ప్రభుత్వ భూ ములను కలుపుకుని లేఅవుట్లను ఏర్పాటు చేశారు. అధికారపార్టీ నేతల అండ ఉందన్న ధైర్యంతోనూ, భవిష్యత్తులో ఇబ్బందులు ఉండ వన్న ఆలోచనతో లేఅవుట్లను వేసు కుని రూ.కోట్లు ఆర్జించారు. కాగా ప్రభుత్వ భూముల ఆక్రమణల వ్యవహారం వెలుగు లోకి వస్తే, తమపై ఎలాంటి చర్యలు ఉంటాయోనన్న ఆందోళన ఆక్రమణదారుల్లో నెలకొని ఉంది.

కొనుగోలుదారుల అయోమయం

ఈ అక్రమాలు తెలియక అనేకమంది ఆయా లేఅవుట్లలో ప్లాట్ల ను కొనుగోలు చేసి గృహాలు కూడా నిర్మించుకున్నారు. దీంతో త్వర లో కమిటీ నిర్వహించనున్న పరిశీలనలో ఏమవుతుందోనన్న ఆం దోళన వారిలో నెలకొంది. ప్రభుత్వం వీరి పట్ల ఎలాంటి వైఖరి అవలంబిస్తుందో వేచిచూడాలి.

15 నుంచి పాసింజర్ రైళ్ల రద్దు

బిట్రగుంట, జూలై 5: మూడోలైన్ పనుల కారణంగా బిట్రగుంట రైల్వే సెక్షన్ పరిధిలో నడిచే పాసింజర్ రైళ్లను తాత్కాలికంగా రద్దుచేస్తున్నట్లు రైల్వే ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. విజయవాడ డివిజనల్ పరిధిలోని విజయవాడ, గూడూరు రైల్వేస్టేషన్ల మధ్య జరుగుతున్న మూడోలైన్ పనుల కారణంగా విజయవాడ నుంచి గూడూరు వరకు నడిచే 07500 పాసింజరు రైలును ఈనెల 15వ తేదీ నుంచి 30 వరకు, అలాగే గూడూరు నుంచి విజయవాడ వెళ్లే 07458 పాసింజర్ రైలును 16వ తేదీ నుంచి 31 వరకు తాత్కాలికంగా రద్దు చేస్తునట్లు తెలిపారు.


సముద్ర స్నానం ఆచరిస్తున్న భక్తులు

తెప్పపై త్రిశూలధారి వైభోగం

- తీర్థవాదికి పోటెత్తిన భక్తులు
- వైభవంగా అశ్వవాహనసేవ

విడవలూరు, జూలై 5: మండలంలోని రామతీర్థం బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వేకువన భక్తులు తీర్థవాది(సముద్రస్నానం) ఆచరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షలాదిమంది భక్తులు తరలివచ్చారు. చిన్నాపెద్దా తేడా లేకుండా సముద్రంలో మునుగుతూ ఆనంద డోలికల్లో తేలియాడారు. తీరం వెంబడి కబడ్డీ, ఖోఖో తదితర ఆటలు ఆడారు. అధిక సంఖ్యలో మహిళలు కూడా సముద్రస్నానం ఆచరించి సైకత శివలింగాలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. అనంతరం శివాలయంలో కూడా ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల రాకతో రామతీర్థం వీధులన్నీ కిటకిటలాడాయి. కొనుగోలుదారులతో అంగళ్లు కళకళలాడాయి. భక్తు లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసు ఉన్నతాధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సముద్ర తీరాన, ఆలయ ప్రాంగణంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. మెరైన్ పోలీసులు గస్తీ నిర్వహించారు. పలువురు దాతలు భక్తులకు తాగు నీరు, పులిహోరా పొట్లాలు పంపిణీ చేశారు. పెన్నార్ హేచరీస్ అధినేత ఓబిలి కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు భక్తులకు పులిహోరా అందచేశారు.


తెప్పపై విహరిస్తున్న ఆది దంపతులు

వైభవంగా తెప్పోత్సవం

శుక్రవారం రాత్రి రామలింగేశ్వరుడి తెప్పోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. తెప్పోత్సవానికి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఉభయకర్తగా వ్యవహరించారు. ఆలయ పూజారి పేరేపి శ్రీకాంత్‌శర్మ స్వామి, అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించి, అనంతరం పొన్నపూడి రహదారిలో ఉన్న కోనేరులో తెప్పోత్స వాన్ని నిర్వహించారు. విద్యుత్‌దీపకాం తుల నడుమ ఆది దంపతులు కోనేరులో విహరించారు. అనంతరం స్వామివారికి అశ్వవాహనసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా రామతీర్థం, పొన్నపూడిలకు చెందిన తంబి సుబ్బమ్మ, సుబ్బరామమ్మ, పొన్నపూడి గ్రామస్థులు వ్యవహరించారు. కార్యక్రమాల్లో ఆలయ ఈవో రామకృష్ణ, టీడీపీ నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, తాతా రమేష్, కోడూరు శ్రీధర్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.


ఆక్రమణకు గురైన వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం

ఆయన చెప్తేనే ఖాళీ చేస్తాం..!

- మాజీ మంత్రి అండతో మూడేళ్లుగా వైద్యశాఖ కార్యాలయం ఆక్రమణ
- జిల్లా వైద్యాధికారే సహకరించారంటూ విమర్శలు
- విద్యుత్ బిల్లులూ చెల్లింపు

నెల్లూరు(వైద్యం) జూలై 5: మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ మమ్మల్ని ఇక్కడ ఉండమన్నారు... ఆయన ఖాళీ చేయమని చెప్తేనే ఖాళీ చేస్తాం...అని ఆక్రమణదారులు వైద్యఆరోగ్యశాఖ అధికారులకు తేల్చిచెప్పారు. ఎవరేమి చేసినా ఇక్కడ నుంచి కదలేది లేదంటూ వారు భీష్మించుకున్నారు. దీంతో చేసేది లేక వైద్యాధికారులు వెనుతిరుగుతున్నారు. ఈ సంఘటన వివరాల్లోకి వెళితే.. నెల్లూరు నగరంలోని పాత మున్సిపల్‌శాఖ కార్యాలయం ఎదురుగా గతంలో వైద్య ఆరోగ్యశాఖకు చెందిన ప్రాజెక్టు ఆఫీసర్, డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ టీమ్ (పీవోడీటీటీ) కార్యాలయం ఉండేది. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ కార్యాలయాన్ని ఖాళీ చేయించి ఓ వైసీపీ నేత కుటుంబానికి కేటాయించారు. అప్పట్లో నీటిపారుదలశాఖ మంత్రిగా ఉన్న అనిల్‌కుమార్ యాదవ్ అనుచరుడి కుటుంబం కూడా ఈ ఆక్రమిత కార్యాలయంలో ఉండేటట్లు అనిల్ కూడా సహకరించారన్న విమర్శలు ఉన్నాయి. మూడేళ్ల క్రితం స్వయంగా అనిల్ సూచించిన వ్యక్తికే ఈ కార్యాలయాన్ని డీఎంహెచ్‌వో అప్పగించారనే చర్చ ఉద్యోగవర్గాల్లో సాగుతోంది.

భవనం కూలడంతో వెలుగులోకి...

ఈ క్రమంలో ఇటీవల మలేరియా విభాగం వారు దోమల నివారణకు ఉపయోగించే రసాయనాలు, మందులు ఉన్న పాత భవనం దొంతెలు చోరీకి గురికావటంతో ఆ భవనం కూలిపోయింది. దీంతో ఆ రసాయనాలను పాత పీవోడీటీటీ కార్యాలయానికి మార్చాలని మలేరియా విభాగం ఉద్యోగులు ప్రయత్నించారు. అయితే అందులో ఉన్న ఆక్రమణదారుడు తాను ఎట్టి పరిస్థితుల్లో ఖాళీ చేయనని, అనిల్ చెబితేనే చేస్తానని చెప్పడమేకాక వైద్య ఆరోగ్యశాఖలోని ఓ ఉన్నతాధికారి తనకు అండగా ఉన్నారని,మీరేం చేసుకుంటారో చేసుకోండి అని పేర్కొన్నట్లు తెలిసింది. ఈ క్రమంలో ఉద్యోగులు ఈ విషయాన్ని వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన చూద్దాంలే.. అంటూ వాయిదా వేశారు.

రూ. వేలల్లో విద్యుత్ బిల్లుల చెల్లింపు

ఆక్రమణదారుడు ఈ కార్యాలయంలో యథేచ్ఛగా రాజభోగాలు అనుభవిస్తున్నాడు. ఈ కార్యాలయం విద్యుత్ బిల్లులను వైద్యఆరోగ్యశాఖే చెల్లిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ మూడేళ్లలో రూ. వేలల్లో బిల్లుల కింద చెల్లించారన్న ఆరోపణలు లేకపోలేదు. ఇక్కడ నూతనంగా నిర్మించిన గోషా ఆసుపత్రి నీటివిభాగం నుంచి నీటి వినియోగం కూడా ఉచితంగా పొందుతున్నాడు. ఇకపోతే ఆక్రమణకు గురైన కార్యాలయం ముందు భాగంలో దుకాణాలు కూడా ఏర్పాటు చేసుకున్నారు. కార్యాలయం కనిపించకుండా ఈ దుకాణాలు ఉన్నాయి. ఈ దుకాణాల నిర్మాణం కూడా పక్కాగా చేపట్టినట్లు తెలుస్తోంది. వీటికి కూడా విద్యుత్ బిల్లులను వైద్య ఆరోగ్యశాఖే చెల్లిస్తున్నట్లు సమాచారం. ఈ ఆక్రమణలపై పోలీసు కేసు పెట్టి ఖాళీ చేయించాల్సి ఉన్నా వైద్యాధికారులు ఆ దిశగా ప్రయత్నాలు చేయకపోవటం పలు అనుమానాలకు తావిస్తుంది. ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. జిల్లాకు చెందినవారు ఇద్దరు మంత్రులుగా ఉన్నారు. ఈ ఆక్రమణల పై వారు దృష్టిపెట్టి ఖాళీ చేయించాలని పలువురు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు పరిస్థితిని తెలియచేశాం..



వైద్య ఆరోగ్యశాఖకు చెందిన కార్యాలయం ఆక్రమణలకు గురైందని రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులకు తెలియచేశాం. వారి ఆదేశానుసారం చర్యలు తీసుకుంటాం. ఆక్రమణదారులపై చర్యలు తప్పవు.

- డాక్టర్ పెంచలయ్య, డీఎంహెచ్‌వో

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

సంతానలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు



ఉదయగిరి రూరల్, జూలై 5: స్థానిక బీసీ కాలనీలోని సంతానలక్ష్మి ఆలయంలో జేష్ఠమాస శుక్రవారం అమవాస్య సందర్భంగా అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు విశేష పూజలు, అభిషేకాలు, అలంకరణలు నిర్వహించి భక్తులకు దర్శనమిచ్చారు.

'నేను బడికి పోతా'పై అవగాహన ర్యాలీ



తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

ఉదయగిరి రూరల్, జూలై 5: బిజ్జంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల పరిధిలో శుక్రవారం ఎంఈవో-1 మస్తాన్‌వలి విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి నేను బడికిపోతా కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిఈడు కలిగిన పిల్లలను తల్లిదండ్రులు బడిలో చేర్పించాలన్నారు. అనంతరం కొత్తపల్లి గిరిజన కాలనీలో బడికిరాని విద్యార్థుల నివాసాలకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాయబ్, వెల్ఫేర్ అసిస్టెంట్ ఏడుకొండలు పాల్గొన్నారు.

రహదారిపై గుంతలు పూడ్చివేత



ఎక్స్‌కవేటర్‌తో గుంతలు పూడ్చుతున్న అధికారులు

సంగం, జూలై 5: మండలకేంద్రానికి వెళ్లే రహదారిపై ఉన్న గుంతలను శుక్రవారం ఆర్‌అండ్‌బీ అధికారులు పూడ్చివేశారు. సంగం టౌన్‌లోని రహదారిలో టీడీఆర్ కల్యాణ మండపం సమీపంలో సిమెంట్, తారురోడ్డు అనుసంధానం వద్ద దెబ్బతిని డ్రైనేజీ నీరు నిలబడి అధ్వానంగా తయారై ప్రయాణికులకు ఇబ్బందిగా ఉంది. దీంతో ఆర్‌అండ్‌బి అధికారులు డ్రైనేజీ నీరు నిలవకుండా జేసీబీతో గుంతలను పూడ్చివేశారు. అదేవిధంగా సంగం కొండ మలుపులో పలు చోట్ల గుంతలు పూడ్చివేశారు. రహదారి పక్కన వేసిన కోళ్ల వ్యర్థాలను, చెట్ల కొమ్మలను తొలగించారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎల్ఐసీ యూనియన్ నాయకులు

ఆత్మకూరు, జూలై 5: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఇండియన్ రెడ్‌క్రాస్ ఆత్మకూరు శాఖ చైర్మన్ మహ్మద్ సాదిక్ హుస్సేన్, ఎస్ఆర్‌జేడీ పీడీ సిరిమావిళ్ల వెంకటేశ్వర్లు తెలిపారు. ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ పిలుపు మేరకు శుక్రవారం ఆత్మకూరు ఎల్ఐసీ కార్యాలయంలో ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 50 మంది యువతీ, యువకులు, ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ ఆత్మకూరు బ్రాంచ్ కార్యదర్శి ఎస్ శ్యామ్‌ప్రభాకర్, అధ్యక్షుడు ఎస్ ప్రవీణ్, జాయింట్ సెక్రటరీ టి రమేష్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ షేక్ సందాని, పలువురు ప్రజాసంఘాలు, జెవివి నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించాలి

ఆత్మకూరు, జూలై 5: ఉపాధి కూలీలకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం పుల్లయ్య, కౌలురైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు జి లక్ష్మీపతి అధికారులను కోరారు. మండలంలోని మురగళ్లలో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం వారు పరిశీలించి, కూలీలను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా, గ్రామ కమిటీ సభ్యులు పి వెంకటేశ్వర్లు, టి రఘురామ్, కేవీపీఎస్ నాయకుడు జి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఏఎస్ పేట, జూలై 5: మండలంలోని హసనాపురం గ్రామంలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ షేక్ గౌస్ బాషా కోరారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు 2024-2025 సంవత్సరానికి ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ట్రేడులో ఈనెల 24వ తేదీ సాయంత్రం 5గంటలలోగా ఐటిఐ.ఎపి.జిఒవి.ఐఎన్ అను వైబ్ సైట్‌లో ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకున్నవారు ఈనెల 27వ తేదీన ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో కళాశాలకు హాజరుకావాలని కోరారు.

జూనోసిస్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వలేటివారిపాలెం, జూలై 5 : పశువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి పశువులకు సంక్రమించే (జూనోసిస్) వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వెటర్నరీ ఏడీ బ్రహ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వ్యాధులు ఎక్కువగా పశుపోషకులు, పాల ఉత్పత్తిదారులు, పెంపుడు కుక్కల యజమానులు, వ్యవసాయం చేసే రైతులు, పశువైద్యులు, జంతు ప్రదర్శనశాల సిబ్బందికి, పరిశోధనాలలో పనిచేసే వారికి సంక్రమిస్తాయని తెలిపారు. వ్యాధులు సోకిన మనుషులలో జ్వరం, తలనొప్పి, దురద, అనారోగ్యం, ఉద్రేకం, నోటినుంచి చొంగ కారడం, కళ్లలో నీరు కారడం, మూర్ఛ వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. కాగా ఈనెల 6న జూనోసిస్ డేని పురస్కరించుకొని స్థానిక పశువైద్యశాలలో పెంపుడు జంతువులకు ఉచితంగా టీకాలు వేయనున్నట్లు తెలిపారు.

రేపు ఎడ్ల బండలాగుడు పోటీలు

కావలి రూరల్, జూలై 5: కావలి మండలం చౌదరిపాలెంలో ఆదివారం సేద్యపు ఎడ్ల బండలాగు పోటీలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 16 రోజుల పండుగను పురస్కరించుకుని జిల్లా స్థాయిలో ఈ పోటీలు నిర్వహించటం జరుగుతుందన్నారు.

అటకెక్కిన 'చేతుల శుభ్రత'

● విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు గండి ● పథకంపై దృష్టి లేదు

ఆత్మకూరు, జూలై 5: ప్రభుత్వ పాఠశాలల్లో చేతుల శుభ్రత పథకంపై విద్యా, వైద్యాధికారులు దృష్టిసారించడంతో అటకెక్కింది. రోజు భోజనం చేసే ముందు చేతులు కడుక్కోవడంపై విద్యార్థులను ఉపాధ్యాయులు చైతన్యం చేయడం లేదు. పాఠశాలలో అధికారులు సబ్బులు ఏర్పాటు చేయకపోవడం మరో విశేషం. ఆత్మకూరు మండలంలో 76ప్రభుత్వ పాఠశాలలున్నాయి. అందులో 60ప్రాథమిక, 3ప్రాథమికోన్నత, 13జిల్లా ఉన్నత పాఠశాలున్నాయి. వీటిలో 5,050మంది పిల్లలు చదుతువుతున్నారు. విద్యార్థుల పరిశుభ్రతపై అవగాహన పెంచాలనే సర్వశిక్షాభియాన్ ఉన్నత లక్ష్యం నీరుగారిపోతోంది.

స్వచ్ఛమైన తాగునీరే గతి లేదు..

చేతుల పరిశుభ్రత ఎలా ఉన్నా మధ్యాహ్న భోజనం చేయడానికి స్వచ్ఛమైన తాగునీరు లేని పరిస్థితి పాఠశాలల్లో ఉంది. తాగేందుకు విద్యార్థులు ఇళ్ల వద్ద నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. తాగునీటి పథకాలు నిరుపయోగంగా ఉన్నాయి. సమస్యలు ఇలా ఉంటే ఇక చేతుల పరిశుభ్రత మాటేమిటని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అన్ని పాఠశాలల్లోను చేతుల శుభ్రత పథకం అమలుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతున్నారు.



పమిడిపాడు అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ నారాయణమ్మ

అభివృద్ధికి సహకరించాలి

● కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే

కావలి, జూలై 5: జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఓ. ఆనంద్‌ను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. ఈసందర్భంగా కావలి నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్‌కు విన్నవించారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందచేస్తున్న కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి

రోడ్లపైనే ఆవులు, కుక్కల స్వైరవిహారం

● పట్టించుకోని పోలీసులు, పంచాయతీ అధికారులు

● ఉదయగిరిలో ఇది దుస్థితి



ఉదయగిరి వీధుల్లో సంచరిస్తున్న కుక్కలు

ఉదయగిరి, జూలై 5: పట్టణంలోని ప్రధాన రహదారుల్లో వందల సంఖ్యలో ఆవులు, కుక్కలు స్వైర్య విహారం చేస్తున్నాయి. ఆవులు రోడ్డుకి అడ్డంగా నిలవడం, పడుకోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది, రాత్రి పగలు తేడా లేకుండా అవి సంచరిస్తుంటే బస్సులు, లారీలు వంటి భారీ వాహనాలు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది ఆవులను, ఎడ్లను దేవుడి మొక్కు పేరుతో కొనుగోలు చేసి వదిలి వేస్తున్నారు. ఆవులు, ఎద్దు వీధులో సంచరిస్తుంటే పలువురు వాటికి పూజలు చేసి ఆహారం పెడుతుంటారు. దీంతో అవి తిని తిరుగుతుంటాయి. పుట్టిన దూడలను వాటి యజమానులు తోలుకుపోయి మంచి రేట్లకు అమ్ముకొని సొమ్ము చేసుకుం టున్నారు.మిగిలిన వారు కూడా ఇది మంచి వ్యాపారంగా భావించి వాటిని కొని వదిలి వేస్తున్నారు. ప్రస్తుతం 200 ఆవులు, ఎడ్లు రోడ్లపై కనిపిస్తున్నాయి. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. అలాగే వీధి కుక్కలు పట్టణంలోని పలు వీధుల్లో స్వైర విహారం చేస్తున్నాయి. ఉదయం, సాయంత్రం వాకింగ్‌కె వెళ్లే వారిపై దాడికి పాల్పడుతున్నాయి. సరుకులు, టిఫన్, మాసం తీసుకెళుతున్న వారిపై దాడి చేసి కవర్లను పీకే స్తు న్నాయి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు, పోలీసులు స్పందించి వీధుల్లో సంచరి స్తున్న ఆవులు, కుక్కలను నియంత్రించాయి.

కాడెద్దుల వ్యవసాయం.. కనుమరుగు

● వ్యవసాయంలో పెరిగిపోయిన ఆధునిక యంత్ర సాంకేతికత

● ఖర్చు తక్కువ.. సమయం ఆదా ● భారమవుతోన్న పోషణ



పొలం దున్నుతున్న కాడెడ్లు

సీతారామపురం,జూలై 5: ఒకప్పుడు వ్యవసాయం చేసే వారి ఇంటి వద్ద ఎద్దులు, బండి, పశువుల కొట్టంతో సందడిగా ఆహ్లాదకర వాతావరణం ఉండేది. ఎడ్ల బండి ఉన్న వారికి ఏడాదంతా పనిదొరికేది. ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానం పెరిగిపోవడంతో అన్నదాతలు తక్కువ సమయంలోనే తమ పనులను ముగించుకొనేలా ఆధునిక యంత్రాలు అందుబాటులో వచ్చాయి. నేటి తరంలోని అన్నదాతల ఇంటి ముంగిట ట్రాక్టర్లు దర్శన మిస్తున్నాయి. కాడెడ్లకు బదులు కల్టివేటర్లు పనిచేస్తున్నాయి. ఎడ్ల బండి ఉన్నా వారినే వ్యవసాయానికి పిలిచేవారు రైతులు చెబుతున్నారు. ఒకప్పుడు ఏ పొలంలో చూసినా జాతి ఎడ్లతో వ్యవసాయ పనులు, దుక్కులు, అడుసు దున్నేవారు. కానీ ఇప్పుడు తక్కువ సమయంలోనే ఎక్కువ పనులను చేసేలా ఆధునిక యంత్రాలు అందుబాటులోకి రావ డంతో పాటు చకచకా పనులు చేసుకునే వెసులుబాటు కలగడంతో రైతన్నలు వాటివైపు మొగ్గు చూపుతున్నారు.

సబ్సిడీలపై ఆధునిక యంత్రాలు.. ఒకప్పుడు ఏవిధమైన ప్రభుత్వ ప్రోత్సాహం లేకుండానే వ్యవసాయం చేసేవారు. కానీ ప్రస్తుతం వ్యవసాయానికి ప్రభుత్వాలు వివిధ రకాల పథకాలను ప్రవేశపెడుతున్నాయి. సన్న, చిన్నకారు రైతులకు కూడా సాంకేతిక, ఆధునిక పరికరాలు, యంత్రాలు, కోత మిషన్లు, నూర్పిడి యంత్రాలు వంటివి ఇస్తున్నారు. తక్కువ పెట్టుబడితో సులభ వాయిదాల్లో యంత్రాలు అందుబాటులోకి రావడంతో ఎద్దుల వ్యవసాయం రానురాను కనుమరుగైపోయింది. సీతారామపురం మండల ప్రాంత జనాభాలో 70శాతం మంది రైతులు ఉన్నారు. వీరిలో 70శాతంకు పైగా రైతులకు అన్ని వసతులతో కూడిన సాంకేతిక యంత్రాలు అందుబాటులో ఉన్నాయి.

గతంలో భలే గిరాకీ... గతంలో వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందే అన్నదాతలు ఎద్దులు, బండ్లు సిద్ధం చూసుకొనే వారు. వీటికి మంచి గిరాకీ ఉండేది. సాగుకు అవసరమైన పనులు చేయించుకొనేందుకు ముందుగానే అడ్వాన్సులు ఇచ్చి మరీ ఆఫర్‌లో పెట్టుకొనేవారు. కూలీలకు కూడా గిరాకీ ఉండేది. ఇప్పుడు కేవలం కలుపులు తీయడానికి, పురుగు మందులు చల్లడానికి తప్పితే కూలీలకు పెద్దగా పనులు ఉండటం లేదని రైతులు వాపోతున్నారు. కాడెడ్ల పోషణ కూడా భారమైపోతుంది. ప్రస్తుత మార్కెట్‌లో జత ఎడ్లు కొనుగోలు చేయాలంటే సుమారు రూ.లక్ష నుంచి రూ.1.5 లక్షల వరకు డిమాండ్ ఉంది. అంత ఖర్చు చేసినా కేవలం ఇంటి ముందు ఉంచుకోవడానికి తప్పితే వ్యవసాయానికి అంతగా వినియోగపడటం లేదని రైతులు వాపోతున్నారు. ఇక సన్న, చిన్నకారు రైతులు వాటి జోలికి పోవడం మానేశారు.

వామ్మో పులి.. అడవికెళ్లేందుకు జంకుతున్న జనం

ఉదయగిరి రూరల్, జూలై 5: వెలుగొండ అడవుల్లో రెండు పులులు సంచరిస్తున్నాయని అటవీ శాఖాధికారులు నిర్ధారించడంతో అడవులకు వెళ్లేందుకు జీవాల యజమానులు, అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న గ్రామాల ప్రజలు జంకుతున్నారు. గతంలో చిరుతలు మేకలు, ఆవుల మందలపై దాడి చేసిన సంఘటనలు సైతం ఉన్నాయి. ఉదయగిరి పట్టణ వాసులు కోన కాలువ నీటి కోసం తెల్లవారుజామున 3 గంటల నుంచే అటవీ ప్రాంతానికి వెళుతుంటారు. ప్రస్తుతం అడవిలో పులి సంచరిస్తుందని తెలపడంతో అలువైపు వెళ్లేందుకు జంకుతున్నారు. సంబంధిత అధికారులు అటవీ ప్రాంతానికి సమీపాన ఉండే గ్రామాల ప్రజలు, జీవాల యజమానులకు తగు సూచనలు, సలహాలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రమాదకరంగా జాతీయ రహదారి

● వేగ నియంత్రణ చర్యలేవి ● విచ్చలవిడిగా పశువుల సంచారం

● నిత్యం ప్రమాదాలు ● పట్టించుకోని అధికారులు

అనంతసాగరం, జూలై 5: మండలంలో కొన సాగుతున్న జాతీయ రహదారి ప్రమాదాలకు నిల యంగా మారింది. ముఖ్యంగా నకిరికెల్ నుంచి తిరు పతి ఏర్పేడు వరకు జాతీయ రహదారి 565 విస్తరించి వుంది. మండలంలో చుంచులూరు నుంచి అనంత సాగరం మండలంలోని గోగులపల్లి, ఉప్పలపాడు వర కు కలువాయి మండలం మీదుగా రాపూరు, ఏర్పేడు వరకు కొనసాగుతోంది. అయితే ఉప్పలపాడు వద్ద సోమశిల- ఆత్మకూరు, జాతీయ రహదారి కలిసే ప్రాంతంలో జాగ్రత్తలు తీసుకోకుండా నిర్మాణ పనులు చేప ట్టారు. అక్కడ రోడ్డు దాటే క్రమంలో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదాల్లో చాలామంది మృతి చెందిన ఘట నలు ఉన్నాయి. ఆ ప్రాంతంలో వేగ నియంత్రణ చర్యలు చేపట్టక పోవడంతో ఇబ్బం దు లు తప్పడం లేదు. రహదారిపై రాత్రి, పగలు అనే తేడా లేకుండా పశువులు సంచ రిస్తుండటంతో చిలకలమర్రి, గుడిగుంట, ముస్తాపురం, గోగులపల్లి గ్రామాల ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురై ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. రహదారి వెంట ఉన్న గ్రామ కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు కొన్ని ప్రాంతాల్లో వెలగక పోవడంతో విద్యుత్ స్తంభాలు అలం కారప్రాయంగా ఉన్నాయి. అధికా రులు స్పందించి పశువులు రహ దారి మీదకు రాకుండా రోడ్డు వెంబడి ఉన్న గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



చిలకలమర్రి వద్ద జాతీయ రహదారి



అలంకార ప్రాయంగా విద్యుత్ దీపాలు

పేదలకు దుప్పట్ల పంపిణీ

బిట్రగుంట, జూలై 5: బోగోలు రాజా వీధిలోని షిరిడీ సాయి మందిరంలో శుక్రవారం బచ్చు అమరా వర్ధంతిని పురస్కరించుకుని పేదలు, పంచాయతీ పారిశుధ్య కార్మికులకు ప్రవాస భారతీయులు బచ్చు కృష్ణకు మార్, సంధ్య దంపతులు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సాయిసేవకులు ఆనందసాగర్, మధుసూదనరావు, హరిబాబు, సాగర్, విజయలక్ష్మీ, గీత, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మంత్రితో ఉదయగిరి ఎమ్మెల్యే భేటీ



మంత్రి అచ్చెన్నాయుడుకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్

జలదంకి, జూలై 5: ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శుక్రవారం రాష్ట్ర రాజధాని అమరావతిలోని మంత్రి పేషీలో రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కె అచ్చెన్నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయగిరి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారాలపై చర్చలు జరిగాయి. ఈ భేటీలో ప్రకాశం జిల్లా పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఉన్నారు.

బీద రవిచంద్రకు సత్కారం



బీద రవిచంద్రను సత్కరిస్తున్న వేదపండితులు

కావలిటౌన్, జూలై 5: అర్చకులు, బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రను వేదపండితులు కోరారు. కావలి ఆచారపు పెద్దింటి యాదవ్, సమాధి కృష్ణ ఆధ్వర్యంలో కావలికి చెందిన వేదపండితులు శుక్రవారం రవిచంద్రను నెల్లూరులోని ఆయన కార్యాలయంలో కలిసి సత్కరించి ఆశీర్వచనాలు అందించారు.

దివ్యాంగుడికి మోటార్‌సైకిల్ వితరణ

కావలి, జూలై 5: కావలి రూరల్ మండలం రుద్రకోట ఎస్టీ కాలనీకి చెందిన దివ్యాంగుడు చలంచర్ల ప్రహ్లాద్‌కు మూడు చక్రాల స్కూటీని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి వితరణ చేశారు. కావలి పట్టణ ముసునూరులోని ఆయన నివాసం వద్ద శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా దివ్యాంగుడికి వాహనాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి, రుద్రకోట టీడీపీ నాయకులు డీ తిరుమల, వల్లెపు బాలకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

కొండాపురం, జూలై 5: మండల పరిధిలోని భీమవరప్పాడు, ఎస్సీ, సాయిపేట ఎస్టీ కాలనీల్లోని పాఠశాలలను మండల విద్యాశాఖాధికారి కే రవికుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు పంపిణీచేసిన స్టూడెంట్ కిట్స్ రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. గ్రామానికి సమీపంలో ఉన్న సాయిపేట పంచాయతీ ఎర్రబాలెం ఎస్టీకాలనీ నుండి ఏడుగురు విద్యార్థులను తన స్వంత ఖర్చులతో రవాణా సౌకర్యాన్ని కల్పించి పాఠశాలలో ప్రవేశం కల్పించిన ప్రధానోపాధ్యాయుడు వి మాధవరెడ్డిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం సాయిపేట ఎస్టీకాలనీలోని పాఠశాలను తనిఖీచేసి మధ్యాహ్న భోజనం, రికార్డులను పరిశీలించి ప్రధానోపాధ్యాయుడు యుగంధర్‌కు పలు సూచనలు చేశారు.

ముగిసిన శిక్షణ తరగతులు

కావలి, జూలై 5: కావలి పట్టణ ఎమ్మెస్సార్ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ, నాందీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు 8 రోజుల పాటు నిర్వహించిన ఎంప్లాయబిలిటీ స్కిల్స్ శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు అవసరమైన సాఫ్ట్‌స్కిల్స్, లైఫ్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై ట్రైనర్ హరికుమార్ శిక్షణ ఇచ్చారు. అనంతరం కరస్పాండెంట్ రాజకుమార్‌చౌదరి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కళాశాలలో విద్యార్థులకు ఇటువంటి ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించటమే లక్ష్యంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

జూదరుల అరెస్టు

గుడ్లూరు, జూలై 5: మండలంలోని పొట్లూరులో ఇద్దరు జూదరులను శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గ్రామస్థులు అందించిన సమచారం మేరకు పొట్లూరు గ్రామ శివారు ప్రాంతంలో పేకాట శిబిరంపై దాడి చేయగా ఇద్దరు పట్టుబడ్డారు. వారి వద్ద రూ. 30 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులపై కేసునమోదు చేసి కందుకూరు కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్సై లక్ష్మణరావు తెలిపారు. మండలంలో ఎక్కడైనా పేకాట, కోడిపందాలు ఆడితే కఠిన చర్యలు తప్పవని సీఐ సుబ్బారావు తెలిపారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధ్యం

ఉలవపాడు, జూలై 5: వేరుశనగ సాగులో అధిక దిగుబడి సాధించడానికి సమగ్ర పోషకాల యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణపై రైతులకు అవగాహన సదస్సు కరేడు పంచాయతీ పరిధిలోని అలగాయపాలెం రైతుసేవా కేంద్రం వద్ద శుక్రవారం రైతులకు ఏర్పాటుచేసి నట్లు ఏవో తిరుమల జ్యోతి తెలి పారు. కందుకూరుకు చెందిన కృషి విజ్ఞాన కేంద్ర సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జీ ప్రసాద్, మరో ఇద్దరు శాస్త్రవేత్తలు వెంకటేష్, జయలు చీడపీడల యాజమాన్యం, నేలద్వారా సంక్రమించే మొదలు కుళ్లు, వేరుకుళ్లు, ఎండు తెగులు, సమజ నూనెల తయారీ వంటి అంశాలపై అవగాహన కల్పించనట్లు చెప్పారు. రసం పీల్చే పురుగుల నివారణకు పసుపు, నీలం జిగురు అట్టలు, పచ్చ పురు గు, లద్దె పురుగు నివారణకు బుట్ట లు, జీవన ఎరువులు, జీవన శిలీంద్ర నాశినులు ఇవ్వడం జరిగిందని తెలి పారు. సదస్సులో రైతులు పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈకార్యక్రమంలో రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు వంశీ, చరణ్‌సాయి కుమార్, ప్రకృతి వ్యవసాయ శిక్షకులు కృష్ణారెడ్డి, స్థానిక వేరుశనగ సాగు రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆదాయం రెట్టింపు చేయడమే ఎఫ్‌పీవో లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్లు

అల్లూరు, జూలై 5 : రైతుల ఆదాయం రెట్టింపు చేయడమే ఎఫ్‌పీవో లక్ష్యమని ఆ సంస్థ అల్లూరు మండలం డైరెక్టర్లు అన్నారు. శుక్రవారం అల్లూరులో వారు విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులే నిర్వాహకులుగా, డైరెక్టర్లుగా ఏర్పాటు చేసుకొని సంస్థ అభివృద్ధికి సహకరించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగే ఈ సంస్థ ద్వారా రైతులు పండించిన పంటలకు దేశవ్యాప్తంగా గిట్టుబాటు ధర కల్పించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. అందుకు అవసరమైన సదుపాయాలను రాయితీ ద్వారా అందించడంలో తోడ్పాటును అందిస్తుందన్నారు. 50 శాతం రాయితీతో విత్తనాలు, ఎరువులను పొందే అవకాశం కూడా ఉంటుందని, రైతులు ఈ సంస్థలో చేరి లాభాలను పొందాలన్నారు. మూలధనం కింద రూ. 2వేలుతోపాటు ప్రవేశ రుసుముగా రూ. 100 చెల్లించి సభ్యత్వం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ఎం రాఘవయ్య, కె అనీల్ కుమార్, డి హరిప్రసాద్‌రెడ్డి, ఎస్ శ్రీనివాసులు, పి శివశంకర్, జి వెంకటేశ్వర్లు, కె శ్రీధర్‌రెడ్డి, పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు

కావలి, జూలై 5: ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి ఎవరైనా నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు తప్పవని కావలి మున్సిపల్ కమిషనర్ జీ శ్రావణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే అక్రమ నిర్మాణాలను తొలగించి దానికి అయ్యే ఖర్చులను వారి నుంచే రికవరీ చేయటం జరుగుతుందన్నారు. కావలి పట్టణ ముసునూరు మందాడి చెరువులోని రాళ్లగుట్ట పోరంబోకులో తొలగించిన అక్రమ నిర్మాణాలను ఆయన గుర్తుచేశారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు



ఆసుపత్రిని పరిశీలిస్తున్న కందుకూరి

అల్లూరు, జూలై 5: ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నేషనల్ కమిటీ సభ్యుడు కందుకూరి సత్యనారాయణ కోరారు. శుక్రవారం అల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలను ప్రభుత్వం ఏర్పాటుచేసిందని, సిబ్బంది అన్నివిధాలా సేవలను అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కత్తుల కిరణ్, కె మల్లికార్జున సింగ్, చెంతాటి కృష్ణమోహన్, సిద్దా రమణయ్య, సివివి సత్యం తదితరులు పాల్గొన్నారు.

చెరువు కలుజు వద్ద పూడిక తొలగింపు

కావలి రూరల్, జూలై 5: కావలి పట్టణ తుమ్మలపెంట రోడ్డులోని తాళ్లపాలెం చెరువు కలుజు వద్ద శుక్రవారం ఇరిగేషన్ అధికారులు పూడికతీత పనులు చేపట్టారు. గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు పంటకాలువలు ఆక్రమించి లేఅవుట్లు వేసిన విషయాన్ని రైతులు ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో పంట కాలువలకు హద్దులు ఏర్పాటుచేసి పూడికతీత పనులు చేపట్టారు. అలాగే తుమ్మలపెంట రోడ్డు సమీపంలో కాలువ స్థలం ఆక్రమించి కట్టిన గోడలు తొలగించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ జంపాని కిరణ్, టీడీపీ నాయకులు ఉప్పాల శ్రీనివాసులు, తిరుపతిస్వామి తదితరులు పాల్గొన్నారు.

అతిసార నివారణపై అవగాహన ర్యాలీ



మానవహారం నిర్వహించిన ఆరోగ్య సిబ్బంది

లింగసముద్రం, జూలై 5: మండలంలోని చినపవని గ్రామంలో శుక్రవారం లింగ సముద్రం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది అతిసార నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు డయేరియాపై అవగాహన కలిగించారు. అనంతరం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పి భూలక్ష్మి, ఏఎన్ఎం శాంతి మాట్లాడుతూ తొట్లలో నీరు నిల్వ లేకుండా చేయాలని, మురుగు నీరు నిల్వ లేకుండా చేసి, దోమలు, లార్వా వృద్ధి చెందకుండా చూడాలన్నారు. ప్రతి ఒక్కరూ చేతులు శుభ్రంగా కడుక్కొని భోజనం చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాలొన్నారు.

రక్తదాన ప్రేరేపితులకు అభినందనలు

కావలి టౌన్, జూలై 5: డాక్టర్స్ డేను పురస్కరించుకుని చేపట్టిన రక్తదానంలో ఒకేరోజు 1210 మంది రక్తదానం చేసి ఐఎంఎ చరిత్ర సృష్టించిందని కావలి ఐఎంఎ అధ్యక్షుడు కె సుబ్బారావు, సీనియర్ వైద్యులు బెజవాడ రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ముసునూరులోని ఐఎంఎ కార్యాలయంలో రక్తదాన ప్రేరేపితులైన పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రెడ్‌క్రాస్, టీం సేవియర్స్, యుటీఎఫ్, జేవీవీ సభ్యులకు అభినందన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఐఎంఎ కార్యదర్శి డాక్టర్ గోపి, డాక్టర్ నళినిపద్మ, డాక్టర్ మనోహర్‌బాబు, డాక్టర్ శివప్రసాద్ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల పాదయాత్రకు సంఘీభావం



పర్చూరు టీడీపీ నేతల పాదయాత్రలో పాల్గొన్న బోగోలు తెలుగు తమ్ముళ్లు

బిట్రగుంట, జూలై 5: పర్చూరు ఎమ్మెల్యేగా ఏలూరి సాంబశివరావు గెలుపొందడంతో పర్చూరు నుంచి టీడీపీ నేతలు తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు చేపట్టిన పాదయాత్ర శుక్రవారం తిప్ప జాతీయ రహదారి వద్దకు చేరుకుంది. వారికి బోగోలు మండల తెలుగు తమ్ముళ్లు ఘన స్వాగతం పలికారు. వారికి సంఘీభావంగా దగదర్తి మండలం ఉలవపాళ్ళ అభయాంజనేయస్వామి ఆలయం వరకు నడిచామని మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నేతలు సుధీర్‌బాబు, మాధవరావు, నేతిపిచ్చయ్య, తదితరులు ఉన్నారు.